
www.andhrajyothy.com srikakulam

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

16 శ్రీకాకుళం

శనివారం 5 ఆగస్టు 2017





అప్పయ్యదొర కుమారుడుని విచారిస్తున్న డీఎస్పీ

రక్తపుమడుగులో పడి ఉన్న కానిస్టేబుల్ రోణుకేశ్వరరావు

పలాసలో కలకలం

- కానిస్టేబుల్‌పై హత్యాయత్నం
- పరిస్థితి తీవ్ర విషమం
- మాజీ ఎంపీ అప్పయ్యదొర ఇంట్లో సంఘటన
- కత్తితో దాడి చేసి నిందితులు పరారీ
- ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నందుకే...

శుక్రారం మధ్యాహ్నం 2 గంటలు. పలాస -కాశీబుగ్గలోని మాజీ ఎంపీ హనుమంతుఅప్పయ్యదొర నివాసం. అక్కడ అప్పయ్యదొర కుమారుడు విజయ్‌కుమార్ దొరతో కానిస్టేబుల్ రోణుకేశ్వరరావు మాట్లాడుతున్నారు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు ఇంటిలోకి ప్రవేశించారు. కానిస్టేబుల్‌తో వాగ్వాదానికి దిగారు. ఉన్నట్టుండి కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ రక్తమోడుతూనే నిందితులను వెంబడించారు. ఆ క్రమంలో రోడ్డుపైనే కుప్పకూలారు. అందరూ చూస్తుండగానే చోటుచేసుకున్న ఈ సంఘటన జంట పట్టణాల్లో సంచలనం సృష్టించింది.

వివరాలు 14లో

వరాలివ్వు... వరలక్ష్మీ!



శ్రీకాకుళం సత్యసాయి పెద్దమందిరంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

- జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో వ్రతాలు
- ఆలయాల వద్ద బారులు తీరిన మహిళలు

లోపలి పేజీల్లో

ఇక సొంతమే!

- ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు సర్కార్ సై
- మంత్రివర్గ నిర్ణయంతో పేదల్లో ఆనందం
- జిల్లాలో వేలాది కుటుంబాలకు లబ్ధి

(శ్రీకాకుళం సిటీ)

ఆర్థికంగా, పారిశ్రామికంగా వెనుకబడిన శ్రీకాకుళం జిల్లాకు ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ఎంతో ప్రయోజనం కలిగించనుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న పేదలకు క్రమబద్ధీకరణకు అవకాశమిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్) పేరిట అక్రమ భవనాల క్రమబద్ధీకరణను కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితం చేశారు. తాజా మంత్రి వర్గ సమావేశంలో వంద గజాల్లోపు ఆక్రమణలకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తూ, పట్టణం, గ్రామం తేడా లేకుండా పేదలందరికీ న్యాయం చేయాలన్న కీలక నిర్ణయంతో - మిగతా 14లో



శ్రీకాకుళం నగరం

ధర... నిద్దుర

- ఇసుక ధర నిర్ణయంపై మీనమేషాలు
- ప్రభుత్వ ఆదేశాలున్నా కదలని గనులశాఖ
- సమావేశమే కాని జిల్లా స్థాయి కమిటీ

(శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి)

"కోట్ల ఆదాయాన్ని కాదనుకుని ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టాం. అయినా 52 శాతం మంది ప్రజల్లో ఈ విధానంపై ఇంకా ఎందుకు అసంతృప్తి ఉంది. ఇప్పటికే జిల్లాస్థాయిలో కమిటీలు కూడా వేశాం. కానీ ధర నిర్ణయంపై ఎందుకు జాప్యం జరుగుతోంది"

- గురువారం నాటి టీడీపీ రాష్ట్రస్థాయి సమన్వయకమిటీ సమావేశంలో సీఎం చంద్రబాబు అసంతృప్తి.

ఉచిత ఇసుక ధర నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసి పదిరోజులవుతున్నా ఆచరణలోకి రాలేదు. కమిటీ సమావేశం - మిగతా 14లో



వివాదమే కారణమా?



రామారావు మృతదేహం

తోటి రైతులతో గొడవలు ఆ కౌలు రైతును పొట్టన పెట్టుకున్నాయా? ఆవేశం అనర్థానికి దారి తీసిందా? మందస మండలం ఉమాగిరి గ్రామానికి చెందిన ఇసినాని రామారావు(48) గురువారం పొలానికి వెళ్లాడు. శుక్రవారం ఉదయానికి విగతజీవిగా మారాడు. ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

3లో



విత్తన శుద్ధితో.. అధిక దిగుబడులు

● తక్కువగా పెట్టుబడులు ● చీడపీడల నుంచి పంటలకు విముక్తి

పలాస:

విత్తనాలకు విత్తనం ద్వారా లేదా నేల ద్వారా వ్యాధులు సోకకుండా ఉండేందుకు విత్తనానికి పురుగుల మందు లేదా తెగుళ్ల మందులను పొడి/ద్రవ రూపంలో పట్టించడానికి విత్తనశుద్ధి అంటారు. విత్తనాలను అధిక ఎండలో ఉంచడం, వేడినీటిలో ఉంచడం వంటి ప్రక్రియలను కూడా విత్తనశుద్ధిగానే చెప్పవచ్చు.

విత్తనశుద్ధి ఆవశ్యకత:

విత్తనం నాణ్యమైనదైతే పంట కూడా నాణ్యతగా వస్తుంది. అదే విత్తన తెగుళ్ల సోకితే దాని ఫలితం దిగుబడిలో కనిపిస్తుంది. కొన్ని సమయాల్లో విత్తనం నాణ్యమైనది అయినప్పటికీ నేల స్వభావం వల్ల సంక్రమించే తెగుళ్ల, తొలిదశలో ఆశించే రసం పీల్చే పురుగుల బారినపడి పంట దిగుబడి తగ్గుతుంది. కొన్ని మార్లు విత్తనం లేదా వాడే మొక్క ఇతర భాగాలైన దుంపలు, కొమ్మలు వ్యాధి జనకాలకు నిలయంగా ఉండి వ్యాధి వ్యాప్తిలో తోడ్పడతాయి. ఈ విధంగా చీడపీడలు వ్యాపించేటప్పుడు సస్యరక్షణలు పాటించడం కంటే వాటి వ్యాప్తిని తొలిదశలోనే అరికడితే మంచిది.

విత్తేముందు మొలక శాతం తెలుసుకోవడం ఎంత ముఖ్యమో విత్తనాల చీడపీడల బారి నుంచి తప్పించేందుకు విత్తన శుద్ధి చేయడం కూడా అంతే ముఖ్యం. ఈ నేపథ్యంలో రైతులు విత్తనశుద్ధిపై అవగాహన కలిగి ఉంటే అధిక దిగుబడులు సాధించవచ్చు.

విత్తన శుద్ధిలో జాగ్రత్తలు..

విత్తన శుద్ధి చేసే రసాయనాలు హానికరమైనవి. అందుకు చిన్నపిల్లలకు, పశువులకు దూరంగా పెట్టుకోవాలి. విత్తన శుద్ధి మందు డబ్బాలు సీలు తీసినపుడు ముఖం, కళ్లు, శరీరం, చేతులు, నోరు ఇతర శరీర భాగాలకు తగలకుండా రబ్బరు తొడుగులు, మాస్క్‌లు వేసుకోవాలి. అవసరమైన మేరకే విత్తనశుద్ధి చేసుకోవాలి. మిగిలిన విత్తన శుద్ధి చేసిన విత్తనాలు తినడానికి, పశువుల దాణాకు వినియోగించకూడదు. విత్తనంపై పొర ఊడకుండా విత్తనశుద్ధి చేసుకోవాలి. మోతాదు తగ్గితే మందు సామర్థ్యం దెబ్బతింటుంది. విత్తనం మొలక శాతం తగ్గుతుంది.

విత్తనశుద్ధి వల్ల ప్రయోజనాలు.

విత్తనశుద్ధి వల్ల నేల లేదా విత్తనం వల్ల సంక్రమించే తెగుళ్లను తొలిదశలో ఆశించే పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు. ● విత్తనశుద్ధి ద్వారా విత్తనం పైభాగంలో ఆశించిన శిలీంధ్ర బీజాలను, విత్తనం లోపల ఉన్న శిలీంధ్ర బీజాలను నిర్మూలించడానికి ఉపయోగపడుతుంది. ● విత్తనశుద్ధి చేసిన తర్వాత మొలకెత్తిన లేత మొక్కలు నేలలో ఉన్న శిలీంధ్రాల నుంచి రక్షణ పొందుతాయి. ● తక్కువ ఖర్చుతో తెగుళ్లను, పురుగుల మందులను అరికట్టడమే కాకుండా రసాయన మందులు అవశేషాలు లేని ఆరోగ్యమైన దిగుబడి వస్తుంది.● విత్తనశుద్ధి చేయబడిన విత్తనానికి నిల్వ సమయంలో కూడా పురుగులు, తెగుళ్ల నుంచి రక్షణ ఏర్పడుతుంది. ● విత్తనశుద్ధి చేయడం ద్వారా చీడపీడల నిర్మూలనకు విచక్షణ రహిత క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించి, వాతావరణ కాలుష్యంను అరికట్టవచ్చు.

ఇలా చేస్తే మంచిది..

వరిపంటకు కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బెండిజంను కలిపి 24 గంటల తర్వాత నారుపోసుకోవాలి. దుంపనారు మళ్లుకైతే ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజంను కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టాలి. మరో 24 గంటల్లో మండికట్టి చల్లుకోవాలి. కిలో విత్తనాలు నానబెట్టడానికి ఒక లీటరు మందునీరు సరిపోతుంది.



కదలని.. సిలబస్

● రెండు నెలలుగా సాగని పాఠాలు
● సరిగా పూర్తికాని ఫార్మేటివ్..సమ్మేటివ్‌పై దృష్టి తప్పనిసరి
● పాఠశాలలను వెంటాడుతున్న సమస్యలు

(శ్రీకాకుళం సిటీ)

ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్నది జిల్లాలోని లావేరు మండలం వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. 500 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల హేతుబద్ధీకరణ, ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ తర్వాత ఈ పాఠశాలకు కొత్త ఉపాధ్యాయులు ఆగస్టు రెండో తేదీన విధుల్లోకి వచ్చి చేరారు. బదిలీలు ప్రక్రియలో భాగంగా ఇక్కడ నుంచి పది మంది బదిలీపై వెళ్లగా వారి స్థానంలో మరో పది మంది విధుల్లో చేరారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా కావడంతో విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి ప్రకారం కొత్తగా గ్రేడ్-1 హిందీ, తెలుగు పోస్టులు కొత్తగా మంజూరయ్యాయి. హెచ్ఎంతో కలసి మొత్తం 17 మంది ఉపాధ్యాయులు ఈ పాఠశాలలో పనిచేస్తున్నారు. జిల్లాలోని 379 ఉన్నత పాఠశాలల్లోనూ, దాదాపు మూడు వేల మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులను సంపూర్ణంగా నియమించామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

● దృష్టి సారించాల్సిన సమయమిది..

బదిలీల వ్యవహారాల్లో అవి పూర్తి కావడంతో గురువులు, అధికారులు ఇప్పుడు సమ్మేటివ్ పరీక్షల సన్నద్ధతకు పాఠాల బోధనపై దృష్టి సారించాల్సి ఉంది.

వెంటాడుతున్న సమస్యలు..

ప్రస్తుతం సిలబస్ ముమ్మరంగా జరగాల్సిన సమయంలో బదిలీలు నిర్వహించడం సర్కారు విద్యకు కొంత దెబ్బ తీస్తే... మరికొన్ని సమస్యలు పాఠశాలలను వెంటాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలకు ఆంగ్ల మాధ్యమంలో పుస్తకాలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో చేరలేదు. ఇక విద్యార్థుల యూనిఫా రాల గూర్చి మాట్లాడుకుంటేనే మంచిదని పలువురి అభిప్రాయం. గతేడాది పూర్తి స్థాయిలో పంపిణీ చేయగా ఈ ఏడాది వాటి ఊసే లేదు. బదిలీల కారణంగా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలకు సమాధానమిచ్చేలా విద్యాశాఖాధికారులు అన్ని పాఠశాలల్లో విస్తృతంగా పర్యటించి ఉపాధ్యాయులను అప్రమత్తం చేయాల్సి ఉంది.

పాఠశాలల పునఃప్రారంభం జూన్ 12కు ముందే ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ మొదటగా ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. వెబ్ కౌన్సెలింగ్, పెర్ఫార్మెన్స్ పాయింట్లు రద్దు చేయాలని రోడ్డెక్కడం, షెడ్యూల్‌లో మార్పులు, అనుబంధ సవరణలతో సుమారు రెండు నెలల పుణ్యకాలం పూర్తిగా బదిలీల ప్రక్రియతోనే గడిచిపోయింది. ఒక స్థానంలో పనిచేస్తూ మరో స్థానానికి తప్పనిసరి బదిలీ జాబితాలో వెళ్లాల్సిన వారు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రోజంతా వీటిపైనే దృష్టి సారించాల్సి వచ్చింది. ఎలాగూ తాము బదిలీపై వెళ్తున్నామని కొందరు, బదిలీ దరఖాస్తులు, దాని ప్రక్రియ కోసం కంప్యూటర్ కేంద్రాల చుట్టూ తిరుగుతూ మరికొందరు మొత్తంగా ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు విద్యకు ప్రణాళిక ప్రకారం బోధించ లేకపోయారనేది వాస్తవం. నూతన స్థానాల్లో ఉపాధ్యాయులు ఇప్పటికే విధుల్లో చేరారు. ఇప్పటి నుంచి పాఠ్యాంశాల బోధనపై దృష్టి సారించాల్సి ఉంది. లేదంటే ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులు నిర్ణీత పరీక్షల సమయానికి సిలబస్ పూర్తికాక ఇబ్బంది పడే అవకాశం కూడా లేకపోలేదు. కౌన్సెలింగ్‌లో లోపాలు జరిగి ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకోవచ్చని, కాని విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు కూడా సిలబస్ సకాలంలో పూర్తికి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి ఉంది. లేకపోతే పదో తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి లేకపోలేదు.

● పూర్తికాని ఫార్మేటివ్..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో రెండు లక్షల 35 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జులై చివరి నాటికి వారందరికీ మొదటి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు పూర్తి కావాలి. ఉపాధ్యాయులు, హెచ్ఎంల అనాసక్తత వల్ల కొన్ని పాఠశాలల్లో ఇప్పటికీ ఆ పరీక్షలు జరగలేదు. అందుకు కావాల్సిన విద్యాభ్యాసం (సిలబస్) పూర్తికాకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఫార్మేటివ్ పరీక్షలు 50 మార్కులకు నిర్వహించాల్సి ఉంది. ఇందులో ఇరవై మార్కులకు రాతపరీక్ష, పది మార్కులు రికార్డు పరిశీలన, పది మార్కులు ప్రాజెక్టు పనులకు, పది మార్కులు సమకాలీన అంశాలపై ప్రతిస్పందనగా కేటాయింపు జరగాలి. అనేక పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయం మేరకు సిలబస్ పూర్తికాలేదని ఉపాధ్యాయులే అంగీకరిస్తున్నారు. దీంతో ఫార్మేటివ్ ప్రక్రియ చాలా చోట్ల జరగలేదనే చెప్పాలి. ఆగస్టు రెండు నాటికి స్కూల్ అసిస్టెంట్లు, తర్వాత సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీలు పూర్తయ్యాయి. వారు కొత్త స్థానాల్లో చేరు తున్నారు. సెప్టెంబర్ 11 నుంచి జరగనున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల లోపు సిలబస్ పూర్తిపై దృష్టి సారించాల్సి ఉంది.నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులే ఎక్కువగా ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఆ పాఠశాలల్లో పరిస్థితి మెరుగుకు అధికారులు, ఇటు ఉపాధ్యాయ వర్గం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

● నాణ్యమైన విద్యకు సన్నాహాలు



బదిలీల కౌన్సెలింగ్ తర్వాత ఉపాధ్యాయులంతా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయా పాఠశాలల్లో వెళ్లి విధుల్లో చేరుతున్నారు. విద్యార్థులకు ఎటువంటి నష్టం జరగకుండా ఉపాధ్యాయులను కేటాయించాం. పూర్తి స్థాయిలో ప్రభుత్వ విద్యాలయాల్లో బోధన కొనసాగుతుంది. నాణ్యమైన విద్య అందేలా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తాం. ప్రభుత్వ విద్య బలోపేతానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటాం.

డా.ఆబోతుల ప్రభాకరరావు, డీఈవో, శ్రీకాకుళం

రెప్పపాటులో!

● కల్వర్టును ఢీకొన్న కారు
● విశాఖ వాసి దుర్మరణం

పెద్దలవునిపల్లి(నందిగాం): కంపెనీ పనిపై వెళ్తూ ప్రమాదానికి గురై ఒక వ్యక్తి మృత్యువాత పడిన సంఘటన నందిగాం మండలంలో చోటుచేసుకుంది. విశాఖపట్నం సుజాతనగర్ పాపయ్యరాజుపాలెంకు చెందిన మదన్‌కుమార్ (37) హైదరాబాద్‌లోని సెరామిక్స్ కంపెనీలో ఏరియా మేనేజర్‌గా పనిచేస్తున్నారు. కంపెనీ పనిలో భాగంగా శుక్రవారం కారులో ఇచ్ఛాపురం వెళ్తూ నందిగాం మండలం పెద్దలవునిపల్లి సమీప జాతీయరహదారి కల్వర్టును బలంగా ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వాహనం నుజ్జునుజ్జయిపోగా కారులో ఇరుక్కున్న మదన్‌కుమార్ మృతదేహాన్ని హైవే అంబులెన్స్, స్థానిక పోలీసులు శ్రమించి బయటకు తీశారు. సంఘటనా స్థలాన్ని కాశీబుగ్గ డీఎస్పీ సీహెచ్ వివేకానంద, నందిగాం ఎస్ఐ వి.సత్యనారాయణ సందర్శించారు. అనంతరం రహదారిపై ఉన్న వాహనాన్ని తప్పించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన మదన్‌కుమార్ (ఇన్‌సెట్లో) ఫైల్‌ఫొటో


ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వివేకానంద

చంపేశారా?

● అనుమానాస్పద స్థితిలో రైతు మృతి
● పొలంలో ఘర్షణే కారణమంటున్న కుటుంబ సభ్యులు ● మందసలో విషాదం

ఉమాగిరి(హరిపురం): కౌలు రైతు అనుమానాస్పందంగా మృతిచెందాడు. పొలంలో జరిగిన ఘర్షణతో హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటన మందస మండలం జిల్లుండ పంచాయతీ ఉమాగిరి గ్రామ సమీపంలోని పొలాల్లో చోటుచేసుకుంది. మందస సెగిడి వీధికి చెందిన ఇసినాని రామారావు(48) రైస్ మిల్లులో కళాసీగా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య లక్ష్మి, కుమారుడు కిషోర్, కుమార్తె రమ్య ఉన్నారు. కిషోర్ హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తుండగా.. రమ్య డిగ్రీ చదువుతోంది. ఉమాగిరిలో రెండెకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ప్రస్తుతం ఖరీఫ్ పనుల్లో భాగంగా గురువారం పొలానికి నీరుపెట్టి ట్రాక్టర్‌తో దమ్ముపెట్టించాడు. నాట్లు వేసేందుకు పొలం సిద్ధం చేశాడు. కాగా ఆ పొలం దాటి ఉన్న పొలాలకు ట్రాక్టర్ తీసుకెళ్లేందుకు పక్క రైతులు ప్రయత్నించారు. దీంతో రామారావు అడ్డుకుని వారితో ఘర్షణకు దిగాడు. గురువారం అర్ధరాత్రి దాటినా ఇంటి కి రాక పోవడంతో ఆందోళన చెందారు. శుక్రవారం ఉదయానికి పొలాల్లో శవమై కనిపించాడు. పొలంలో జరిగిన ఘర్షణలోనే తన భర్త మృతిచెందినట్లు భా ర్య లక్ష్మి, కుటుంబసభ్యులు అనుమా నం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. డీఎస్పీ వివేకానంద, ఇచ్ఛాపురం సీఐ అవతారం, మందస, కంచిలి, సోంపేట ఎస్ఐలు వై.రవికిరణ్, ప్రసాద్, భాస్కరరావు సంఘటనా స్థలానికి చేరుకొని. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీలను రప్పించి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ పితాతొలి, పుచ్చపాడు గ్రామాలవైపు వెళ్లి వెనుతిరిగాయి.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామారావు మృతితో సెగిడి వీధి శోకసంద్రంలో మునిగిపోయింది. ఇది హత్యేనని.. ఆ త్మహత్య చేసుకునే పరిస్థితి లేదని, తలపై దెబ్బలు కనిపిస్తున్నాయని, చెవినుంచి రక్తం కారిన ఆనవాళ్లున్నాయని కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.


రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

మెళియాపుట్టి: ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి అక్రమంగా ద్విచక్రవాహనంపై తరలిస్తున్న వారి నుంచి నలుగు సంచుల గుట్కా ప్యాకెట్లను స్వాధీన పర్చుకున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో సంతబొమ్మాళికి చెందిన పి.ఆనందరావు, పోలాకికి చెందిన బి.నాగరాజు టీవీఎస్ ఎక్సెల్ వాహనాలపై వీటిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. కేసు నమోదుచేశామన్నారు. హెచ్‌సీలు నర్సింగరావు, దాలినాయుడు తదితరులున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

కిడ్నీవ్యాధితో ఒకరి మృతి

రాజపురం(కవిటి రూరల్): కిడ్నీవ్యాధితో రాజపురానికి చెందిన లొట్ల ఢిల్లీరావు (36) శుక్రవారం మృతి చెందాడు. కొంత కాలంగా ఈ వ్యాధితో బాధపడుతూ తనకున్న కొద్దిపాటి పొలం అమ్మివేసి బాగా డబ్బు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకున్నాడని గ్రామస్థులు తెలిపారు. అయినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోయారు. ఇతడికి భార్య, కుమారుడున్నారని మూడేళ్ల కిందటే వివాహమ యిందన్నారు. అందివచ్చిన ఢిల్లీరావు తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు నారాయణ పార్వతి, భార్య తేజేశ్వరి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆమదాలవలస: కొత్తరోడ్డుసమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్వి చక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. కె.చిన్నారావు, పి.గోవిందరావు తన ద్విచక్రవాహనంతో ఫ్లై ఓవర్ మీదుగా శ్రీకాకుళం వైపు వస్తుండగా లావేరు మండలానికి చెందిన కొమ్ము గోవిందరావు తన కారుతో వచ్చి ఢీ కోన్నాడు. ఈ సంఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరి తలలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. ఎల్.అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.వాసుదేవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఘాట్ రోడ్డులో వ్యాన్ బోల్తా

40 మంది ప్రయాణికులకు గాయాలు

సీతంపేట/రూరల్: మండలంలోని బూర్జగూడ ఘాట్‌రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం వ్యాన్ బోల్తాపడిన సంఘటనలో 40 మందికి గాయాలయ్యాయి. పెదరామ డీఆర్ డిపో నుంచి బూర్జగూడ వెళ్తున్న వ్యాన్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడింది. పెదరామలో డిఆర్ డిపోలో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేసుకొని తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈవ్యాన్‌లో ప్రయాణిస్తున్న జగతిపిల్లి, బూర్జగూడ గ్రామాలకు చెందిన పేజమ్మ, మంగమ్మ, సెరంగి, తవిటమ్మలతోపాటు మరికొంతమందికా తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో కొంతమంది పాలకొండ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా కొంతమంది ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

నిర్లక్ష్యంగా వ్యవహరించారని

జెమ్స్ ఆస్పత్రిలో ఆందోళన

శ్రీకాకుళం రూరల్: బాలింత ఆరోగ్యం విషయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ కుటుంబసభ్యులు రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగారు. పోలాకి మండలం రాళ్ల గోదాయవలసకి చెందిన నవగాన రజనీ గతనెల 30న ప్రసవం కోసం జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. 31న ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. అప్పటికే ఆమె ఫిట్స్‌తో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం జెమ్స్ నుంచి శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. దీనిపై బంధువులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరోగ్యం బాగాలేని విషయం తెలియపరచకుండా... నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆందోళనకు దిగారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచే ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతుండగా.... కనీస సమాచారమివ్వకుండా సిబ్బంది గోప్యంగా ఉంచారని బాధితురాలి భర్త గురుమూర్తి చెబుతున్నారు. బాధితురాలు రజనీని కిమ్స్ నుంచి శుక్రవారం రాత్రి జెమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమెకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు.


ఆసుపత్రిలో ఆందోళనకు దిగిన రోగి బంధువులు

చంద్రన్న బీమా పంపిణీ

నువ్వలరేవు(వజ్రపుకొత్తూరు): నువ్వలరేవు గ్రామానికి చెందిన ముువ్వల జగబంధు కుటుంబానికి చంద్రన్నబీమా పథకం ద్వారా రూ.ఐదు వేలు తక్షణ సహాయాన్ని శుక్రవారం అందజేశారు.ఇప్పటివరకూ 27మంది చంద్రన్న బీమా సొమ్ము గ్రామంలో అందుకున్నట్లు ఎంపీటీసీ సభ్యులు ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో బీమా మిత్ర లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.


బీమా సొమ్ము అందజేస్తున్న ఎంపీటీసీ ఆనంద్

ముఖ్యమంత్రిపై విమర్శలు సరికాదు

నగరంపల్లి(వజ్రపుకొత్తూరు): ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత జగన్ విమర్శలు చేయడం సరికాదని నగరంపల్లి సర్పంచ్ దువ్వాడ విజయలక్ష్మి, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ దువ్వాడ వెంకటకుమార్‌చౌదరి హితవుపలికారు. శుక్రవారం నగరంపల్లిలో వారు విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్న ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి జగన్‌కు లేదన్నారు. కేవలం అధికారం కోసం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

ఎన్టీఆర్ వైద్యసేవ పేదలకు వరం



పరీక్షిస్తున్న సుధామోహన్

జిల్లుండ(హరిపురం): ఎన్టీఆర్ వైద్య సేవ వైద్యశిబిరాలు నిరుపేదలకు వరమని బుడంబో పీహెచ్‌సీ వైద్యుడు శరత్ చంద్ర తెలిపారు.మందస మండలంలోని కిల్లోయిలో శుక్రవారం ఎన్టీఆర్ వైద్యసేవ శిబిరంలో భాగంగా కిమ్స్ ఆసుపత్రి వైద్యుడు వరహాలనాయుడు, జీఎంఆర్ వైద్యులు సుధామోహన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 139 మందికి పరీక్షలు నిర్వహించి 12మందికి శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశరావు, క్యాంపుకోఆర్డినేటర్ శ్రీనుబాబు, బీమామిత్రలు రామారావు, మాధవరావు సుప్రభాదేవీ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోండి

బేతాళపురం(హరిపురం): సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్యామసుందరరావు సూచించారు.మందస మండలంలోని బెల్లుపటియా, సిరిపురం, కరేపల్లి, వనస్యసవరమధ్య రెవెన్యూ సబ్ డివిజన్ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్ వంటి సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన సమస్యలను రైతులకు తెలియజేసి తమ భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో ఆర్ఐలు అమర్‌నాథ్, సునంద, సర్పంచ్‌లు గేదెల రామకృష్ణ, ఎంపీటీసీ రాజాన ఝూన్సీ, సవరచంద్రశేఖర్, ఉద్యానవనశాఖ అధికారులు ఉమాభరణి, శంకరరావు, ఏవో పోలారావు, ఉదయ్, వీఆర్వోలు రాంబాబు, గోవిందరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్యామసుందరరావు

హాల్ట్ ఇవ్వరు..అభివృద్ధి చేయరు


మందసస్టేషన్‌లో చెట్టునీడలో సేదతీరుతున్న ప్రయాణికులు

- ● ఇదీ పూండి,హరిపురం రైల్వేస్టేషన్ల దుస్థితి
- ● ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం
- ● కలగా మిగిలిన పలు ఎక్స్ ప్రెక్స్ రైళ్ల హాల్ట్

హరిపురం, పూండి రెల్వే స్టేషన్లలో సమస్యల కూత వినిపిస్తోంది. వాణిజ్య, పారిశ్రామిక, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాల్లో పలు ఎక్స్ ప్రెస్‌లకు హాల్ట్ ఇవ్వాలన్న ప్రయాణికులు డిమాండ్ అటకెక్కుతోంది. ఇక్కడ సమస్యలపై రైల్వే ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నా పరిష్కరించలేదు. ఇప్పటికైనా ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు రైల్వేశాఖ మంత్రి దృష్టికి ఇక్కడి సమస్యలు తీసుకువెళ్లాలని ఉద్దానం వాసులు కోరుతున్నారు.

పూండి/హరిపురం: స్వాతంత్ర్య రాక పూర్వం నిర్మించిన పూండి రైల్వేస్టేషన్ ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదు. రోజువారి ఆదాయం బాగా వస్తున్నా స్టేషన్‌లో కనీస అవసరాలు తీర్చేందుకుసదుపాయాలు లేకప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు.

● ప్లాట్‌ఫారం ఎత్తులేకపోవడం వల్ల వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగులు, చిన్నపిల్లలు రైలు ఎక్కడానికి ఇబ్బందిపడుతున్నారు.● తాగునీటి సదుపాయం, వర్షం పడితే చాలు తలదాచుకునేందుకు షెల్టర్లు లేవు.● టికెట్ కౌంటర్ దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో ఇరుగ్గాఉంటోంది.●విశాఖ, ఇంటర్‌సిటీ, ప్రశాంతిఎక్స్‌ప్రెస్‌లు ఈ స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వకపోవడంతో ఈ ప్రాంత ప్రయాణికులు పలాస, నౌపడ రైల్వేస్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. ●ఈ స్టేషన్ పరిధిలోని రైల్వేక్వార్టర్లు శిథిలావస్థ చేరాయి.

మందస రోడ్డులో...

మందస, సోంపేట మండలాల్లో 70 గ్రామాలకు ముఖ్య కూడలిగాఉన్న మందసరోడ్డు (హరిపురం) రైల్వే స్టేషన్ అభివృద్ధి మూడడుగులు ముందుకు..ఆరడుగులు వెనక్కు అన్న చందంగా ఉంది.తాగునీరు, వేచి ఉండేందుకు వసతి సౌకర్యాలు లేవు.ప్లాట్‌ఫారాలు షెడ్లు లేక ఎండలో ఎండి, వర్షంలో తడిసి చెట్లునీడలో ప్రయాణికుల తలదాచుకుంటున్నారు. టిక్కెట్లు తీసే, విశ్రాంతి గది ఉన్నా సౌకర్యాలు కొరవడ్డాయి.


వసతులు లేని పూండి రైల్వేస్టేషన్

ఆదాయపరంగా...



హరిపురం రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరించి, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపితే డివిజన్‌లోనే ఈ స్టేషన్ ఆదాయ పరంగా మొదటి స్థానంలో నిలుస్తుంది. స్టేషన్ పరిధిలోని ప్రాంతాలు వ్యాపార, ప్రారిశ్రామిక, విద్యా రంగాల్లో అభివృద్ధి చెందతుతుండడంతో కనీస సౌకర్యాలు కల్పించాలి.ఈ రైల్వేస్టేషన్‌లో సమస్యలపై అధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతులు అందించాం.

-వైఎస్ఎన్ మూర్తి, వ్యాపారవేత్త, హరిపురం

ఎంపీ దృష్టికి తీసుకెళ్లాం



హరిపురం రైల్వేస్టేషన్ విషయమై ఇప్పటికే టీడీపీ అధ్యక్షురాలు గౌతు శిరీష, ఎంపీ రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లాం. స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రైల్వే శాఖామంత్రి సురేష్‌ప్రభు దృష్టికి తీసుకెళ్లాం. ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటు రాజారాణి హాల్టింగ్, స్టేషన్ ఆధునికీకరణ వంటి అభివృద్ధి పనులతో త్వరలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరనున్నాయి.

-జుత్తు చిరంజీవులు,
ఎంపీటీసీ మాజీ సభ్యుడు, బిడిమి

ఉన్నతాధికారులు దృష్టిసారించక...



పూండి రైల్వేస్టేషన్‌లో విశాఖ, ఇంటర్‌సిటీ, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లు హాల్ట్ చేస్తే స్టేషన్ మరింత అభివృద్ధి చెందుతుంది.పురాతన చరిత్ర ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు దృష్టిసారించకపోవడంతో స్టేషన్ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆదాయం బాగా వస్తున్నా అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. హాల్ట్ విషయంలో హామీలే గాని అమలుకావడం లేదు.

-అన్నెపు మహాందాత,
విశ్రాంత ఉపాధ్యాయుడు, పూండి

స్టేషన్ లోతట్టులో...



పూండిరైల్వే స్టేషన్ లోతట్టు ఉండడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు,గర్భిణులు, చిన్నపిల్లలు రైలు ఎక్కలేని స్థితిలో ప్రమాదాలుకొని తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఫ్లాట్‌ఫారం రైలు పట్టాలకు ఆనుకొని ఉండడం వల్ల రైళ్లు ఎక్కలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్లాట్‌ఫారం ఎత్తు పెంచాలి. తక్షణమే ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలి.

-కర్ని రమణ, జిల్లా టీడీపీ ప్రతినిధి, పూండి

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు


మందస సత్యసాయి బృందావన్‌లో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు

మందస: మందసలో సత్యసాయి బృందావన్, వాసుదేవాలయం, అన్నపూర్ణేశ్వరి గ్రామదేవత ఆలయంలో శుక్రవారం శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వత్రలు, కుంకుమపూజలు నిర్వహించారు.సత్యసాయి బృందావన్‌లో 63మంది మహిళలు వరలక్ష్మీ పూజలు జరిపారు. కార్యక్రమంలో సత్యసాయి ఆలయ కన్వీనర్ వి.ఈశ్వరరావు, మాజీ కన్వీనర్ సుంకర శంకరరావు, డివిజన్ బాధ్యులు డి.బైరాగి, కె.మాధవరావు, గణేష్‌శర్మ పాల్గొన్నారు. అలాగే అన్నపూర్ణ గ్రామదేవతాలయంలో కుంకుమపూజలు చేపట్టారు. ●మందస వాసుదేవాలయంలో మూలనక్షత్రంలో వాసుదేవుడి జయంతి పురస్కరించుకొని మందసకు చెందిన జామి ప్రసాదరావు, కమలాపురానికి చెందిన సీపాన నర్సింహరాజు, పలాసకు చెందిన జె.సాయిమూర్తి, గుణుపూర్‌కు చెందిన ఎస్.నర్సింహమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు పట్టువస్త్రాలు కప్పి సన్మానించారు.


మందస గ్రామదేవత అన్నపూర్ణేశ్వరి ఆలయంలో పూజలు

జంటపట్టణాల్లో...

పలాస: జంటపట్టణాల్లో శ్రావణశుక్రవారం పుర స్కరించుకొనివరలక్ష్మీవ్రతాలు ఘనంగా నిర్వహించారు. కాశీబుగ్గ సీతారామాలయంలోగల లక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.షిర్డీసాయి బాబా ధ్యానమందిరంలో లక్ష్మీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి కుంకుమపూజలు చేశారు. కన్యకపరమేశ్వరి ఆలయాల్లో లక్ష్మి, సామూహిక కుంకుమ పూజ ల్లో నిర్వహించారు. స్థానిక ఎల్‌సీగేటు వద్ద గల సంతోషిమాత ఆలయంలో ఉదయం నుంచి భక్తులు పూజలకై బారులుతీరారు. సంతోషిమాత అమ్మవారికి ఈ సందర్భంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కామేష్,దేవి పాల్గొన్నారు.

కౌన్సిలర్ల ఆధ్వర్యంలో...

పలాస: జంటపట్టణాల్లో వరలక్ష్మీ వ్రతాల పురస్కరించుకొని 5,12 వార్డుల్లో కౌన్సిలర్లు కోత అరుణకుమారి, బల్లరేవతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో మహిళలు పాల్గొన్నారు.


ముత్తయిదువులకు వాయినాలు ఇస్తున్న కౌన్సిలర్ అరుణకుమారి

ఘనంగా కుంకుమ పూజలు

తిలక్‌నగర్(కాశీబుగ్గ):మున్సిపాల్టీలోని 15వ వార్డు మంకి నమ్మ ఆలయంలో శుక్రవారం కుంకుమపూజలు ఘనంగా నిర్వహించారు. పూజలుఆలయ కమిటీ సభ్యులు ఎస్.ప్రభాక రరావు, బడగల మధు, తాళాసు రమణ, విజయగోపాల్, రమేష్, తంగుడు రామ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి.


కుంకుమపూజలు నిర్వహిస్తున్న మహిళలు

చెల్లించరు..వసూలు చేయరు

- చోద్యంచూస్తున్న రెవెన్యూ అధికారులు
- రూ.8 కోట్ల వసూలుపై ఇంకా తేలని వైనం
- ఇదీ నాలా దుస్థితి

పలాస:పలాస-కాశీబుగ్గమున్సిపాల్టీతో పాటు టెక్క లి డివిజన్‌లో నాలా రియల్టర్లు ఎగవేస్తున్నా రెవెన్యూ అధికారులుచోద్యంచూస్తున్నారు.వ్యవసాయభూములు వ్యవసాయేతర అవసరాలకు(నాలా) వినియోగిస్తే డె వలపర్లు నిర్దేశించిన మేర నాలా చెల్లించాల్సిఉంది. లేఅవుట్‌డెవలపర్లు నాలా చెల్లించక, రెవెన్యూ అధికా రులు వసూలుచేయక ప్రభుత్వ ఆదాయానికి గం డిపడుతోంది.

విజిలెన్స్ కమిటీ ఆదేశించినా...

రాష్ట్ర విజిలెన్స్ కమిటీ అటువంటి భూముల నుంచి రూ.16కోట్లు వసూలు చేయాలని ఆదేశించింది. సంబం ధిత భూయాజమానులు అందుబాటులో లేకపోవడం, కొన్ని సర్వే నెంబర్లు తప్పులు ఉండడంతో రూ.16కోట్లు బదులు రూ.ఎనిమిది కోట్ల వరకూ వసూలు చేయగల మని రెవెన్యూఅధికారులు ప్రభుత్వానికిస్పష్టంచే శారు. అయినా ఇంతవరకూ పైసా కూడా వసూలు కాకపో వడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

భూయజమానులకోసం ఆరా..

మూడేళ్ల కిందట నుంచి డివిజన్‌లో టెక్కలి, నంది గాం,పలాస-కాశీబుగ్గ, ఇంగిలిగాం, శాసనం, బారు వ జంక్షన్ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల్లో రియ ల్టర్లు లేఅవట్లు ఏర్పాటుచేశారు.ఈ భూములను ప్ర భుత్వ నిబంధనల ప్రకారం అప్పటికున్న ధర ప్ర కారం పదిశాతం నగదు నాలా కింద రెవెన్యూశా ఖకు చెల్లించాల్సి ఉంది. అనంతరమే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడా నికి వీలు ఉంటుంది. కాని రియల్ఎస్టేట్ వ్యాపారులు వ్యవసా యభూ మిని లేఅవుట్లు వేసి అమ్ముకున్నారే తప్ప నాలా మాత్రం చెల్లించలేదు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ బృందం తనిఖీలు నిర్వహించి అటువంటి భూములను గుర్తించింది. జిల్లా వ్యాప్తంగా రూ.23కోట్ల వరకూ అపరాధ రుసుంతో నాలా చెల్లించాలని సూచించగా, ఇందులో ఒక్క టెక్కలి డివిజన్‌లోనే రూ. 16కోట్లు వరకూ చెల్లించాలని ఆదేశించింది. దీని ప్ర కారం దీనిని రూ.ఎనిమిది కోట్లకు కుదించిన రెవెన్యూ అధికారులు భూయజమానుల కోసం ఆరాతీస్తున్నారు. కొంతమందిహైదరాబాద్, ఒడిశా ప్రాంతా ల్లో ఉన్నట్లు గుర్తించారు. వారికి నోటీసులు ఇవ్వడానికి సరైన అడ్ర స్‌లు దొరక్క మల్లాగుల్లాలు పడుతున్నారు.


పలాసలో నాలా చెల్లించని భూముల్లో ఇదొకటి

భూయజమానులపై చర్యలు

సంబంధిత భూయజమానులపై చర్యలుతీసుకుం టామని తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి తెలిపారు. సం బంధించిన సర్వేనెంబర్లు బ్లాక్‌చేసి సబ్‌రిజిస్ట్రార్ కార్యా లయాలకు పంపించినట్లు చెప్పారు. ఆయాప్రాంతాల్లో కొనుగోలు చేసిన భూములు చెల్లవని స్పష్టంచేశారు.


సింహద్వారాన్ని ప్రారంభిస్తున్నఎమ్మెల్యే శివాజీ

ఆధ్యాత్మికభావంతో మెలగండి: ఎమ్మెల్యే

పద్మనాభపురం(పలాస):ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికభావంతో మె లిగి తేనే సమాజం అభివృద్ధి చెందుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శివాజీ తెలిపారు. పద్మనాభపురంలో శివాలయానికి టీడీపీ పట్టణా ధ్యక్షుడు, ఆరో వార్డు కౌన్సిలర్ లొడగల కామేశ్వరరావు సొంత నిధు లతో నిర్మించిన సింహద్వారాన్ని శుక్రవారం శివాజీ ప్రారంభించా రు.శ్రావణశుక్రవారం పురస్కరించుకొని వినాయక,దుర్గాసహిత ఆం జనేయ ఆలయాలను వైద్యుడు హరిరాజ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన తండ్రి హరిముకుందపండా తన సొంత నిధులతో ఆలయ సముదాయాన్ని నిర్మించారు. ఉదయం సంప్రోక్షణ చేసిన అనం తరంయంత్రప్రతిష్ఠ చేశారు.కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గురిటి సూర్య నారాయణ, లొడగల కామేశ్వరరావుయాదవ్,అబ్దుల్లా పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు వక్రీకరించడం సరికాదు

పలాస నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త అప్పలరాజు


మాట్లాడుతున్న డాక్టర్ అప్పలరాజు

పలాస: నంద్యాల సభలో తమ నేత జగన్ ప్రజలకు స్పష్టమైన సందేశాన్ని పంపించారని, దీనిని వక్రీకరించి టీడీపీ నేతలు గగ్గోలు పెట్టడం సరైన పద్ధతికాదని పలాస నియోజకవర్గ వైసీపీ సమన్వ యకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు తెలిపారు. శుక్రవారం పలాసలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ టీడీపీ మూడేళ్ల పాలనలో ప్ర జలకు చేసింది ఏమీలేదని, వారికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. నంద్యాలలో జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు విమ ర్శించడాన్ని తప్పుపట్టారు.సమావేశంలో ఆ పార్టీ నాయకులు దువ్వాడ శ్రీకాంత్, డబ్బీరుభవానీశంకర్, పైల వెంకట్రావు, మరడ భాస్కరరెడ్డి, వై.మోహనరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఒత్తిడిని జయించాలి

కుంటి కోట(హరిపురం):విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే ప్రతి ఉద్యో గి విధి నిర్వహణలో ఒత్తిడిని జయిం చాలని బీఎస్ఎన్ఎల్ అడిషనల్ డివిజన ల్ ఇంజనీర్, యోగగురువు ఎంవీ రామా రావు తెలిపారు. మందస మండలంలోని కుంటికోటలోని వైటీసీలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయ న మాట్లాడుతూ ఒత్తిడి జయించేలా పలు కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని కోరారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి పీజేఎస్ఎన్ పట్నాయక్ ఉపకారవేతనా లను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, పరిశీలన విధానాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్త లపై మందస వైద్యాధికారి టి.పాపినాయుడు అవగాహన కల్పిం చారు. పర్సనాల్టీ డెవలప్‌మెంట్‌పై ఐతమ్ డీన్, హెచ్ఆర్‌డీ రిసోర్స్ పర్సన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి వివరించారు. కార్యక్రమంలో జిల్లా హెచ్ఆర్‌డీ మేనేజర్ మోహనరావు, వైటీసీ మేనేజర్ రామునా యుడు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామారావు

ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్

పలాస: ఐటీఐలో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులకు రెండోవిడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డాక్టర్ వి.కణితీస్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఆర్ఆర్.కృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. పలా స ఐటీఐలో ఈనెల 17న, ప్రైవేటు ఐటీఐలో మిగిలిన సీట్లకు 18న కౌన్సెలింగ్ నిర్వహి ంచనున్నామని పేర్కొన్నారు. కొత్తగా పలాస ఐటీఐలో ఈ విద్యా సంవత్సరం నుంచి కోపాట్రేడ్ మంజూరు చేయడంతో ఇందులో చేరేందుకు తమను సంప్రదించాలని కోరారు. కౌన్సెలింగ్ ఉదయం 10గంటల నుంచి ఐటీఐ ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు.

రైతులకు పట్టాదారు పాసుపుస్తకం అవసరం


తహసీల్దార్ సనపల రమణయ్య

పూండి: పట్టాదారుపాసుపుస్తకం రైతుకు ఎంతో అవసరమని వజ్రపుకొత్తూరు తహసీల్దార్ సనపల రమణయ్య తెలిపారు. శుక్రవారం వజ్రపుకొత్తూరు మండలంలోని అమలపాడు, పెద్దమురహరిపురం గ్రా మాల్లో రైతు సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన భూముల వివ రాలను మీభూమి వెబ్‌సైట్‌లో పొందుపరిస్తేనే భవిష్య త్‌లో బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. భూమి అమ్మకాలు, కొనుగోలు, సబ్సిడీ ఎరువులు, రుణాలకు అడంగల్ అవసరమని తెలిపారు. ఆయనతో పాటు డీటీ అప్పలస్వామి, ఆర్ఐ రామకృష్ణ, కిరణ్‌కుమార్, సర్వేయర్ తిరుపతిరావు, సర్పంచ్ దున్న షణ్ముఖరావు, కలిశెట్టి పార్వతి, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోండి

జిల్లా డీవీటీ మేనేజర్ విజయవాణి

సాయికాలనీ(పలాస):ఉపాధిహామీ పథకం కూలీలు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసం ధానం చేసుకోవాలని జిల్లా డీవీటీ మేనేజర్ విజయ వాణి కోరారు. శుక్రవారం స్థానిక సాయికాలనీ ఎన్ఆర్ ఈజీఎస్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస మండలంలో 1,184 మంది కూలీలకు రూ.ఏడులక్షలు వేతనాలు పెండిం గ్‌లో ఉన్నాయని, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసం ధానం కాకపోవడం వల్ల ఈ సమస్య వచ్చిందని తెలి పారు. ఆమెతో పాటు ఏపీవో బి.హరికృష్ణ, రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఈ రామారావు

కొనసాగుతున్న దీక్షలు

వాల్తేరు(సంతకవిటి): మండలం వాల్తేరు, ఇసుకలపేట గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన నిర్మాణం చేపట్టా లనే డిమాండ్ చేపడుతున్న దీక్షలు శుక్రవారం నాటికి 167వ రోజుకు చేరుకు న్నాయి. శుక్రవారం నిర్వహించిన దీక్షలో వాల్తేరు గ్రామానికి చెందిన కూటికుప్పల సింహాచలం, ఎం.వెంకటరమణ, పైడి సూర్యనారాయణ, పప్పల సన్యాసప్పుడు, జి.లక్ష్మం దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరం లో వంతెన పోరాట సాధన కమిటీ కన్వీ నర్ నారాయణరావుస్వామి మాట్లాడుతూ శాంతియుతంగా ఉద్యమాన్ని చేపడుతూ.. సమస్య పరిష్కరించుకుంటామని తెలిపారు.

నల్ల రిబ్బన్లతో కార్మికుల నిరసన

పాలకొండ రూరల్: పాలకొండ నగరపంచాయతీ ప్రజలపై పన్నుభారం మోపే 159, 160, 279 జీవోలను రద్దు చేయాలని శుక్రవారం నగర పంచాయతీ కార్మికులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐ టీయూ నాయకులు దావాల రమణారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పడాల భాస్కర రావు, చింతల క్రైసులు మాట్లాడుతూ... 279 జీవో అమలులోకి వస్తే పట్టణాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర పనులన్నీ ప్రైవేట్ సంస్థలకు అప్పగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశా రు. 151 జీవో ప్రకారం మున్సిపాలిటీల్లో అన్ని విభాగాల్లోఉద్యోగులకు జీతాలు చెల్లిం చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖ రి విడనాడి మున్సిపల్ కార్మికుల సమస్యలను సానుకూలంగా స్పందించి పరి ష్కరించాలన్నారు. లేకుంటే.. ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్య క్రమంలో సీ.హెచ్.సంజీవి, సీ.హెచ్.రఘు, పి.శ్రీను. సురేష్, మధు, వి.గిరి. శ్రీదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

పలాస- కాశీబుగ్గ

హరిశంకర్--ఫిదా

రవిశంకర్-ఏజెంట్ భైరవ

భాస్కరరామ-వాసుకి

శ్రీవెంకటేశ్వర-నిన్నుకోరి

అన్నపూర్ణ-గౌతమ్‌నంద

మందస

మహేంద్ర....గౌతమ్‌నంద

సమాచారం

15న దేశభక్తి గీతాల పోటీలు

కాశీబుగ్గ:ఆరో తరగతి నుంచిడిగ్రీ వరకూ చదువుతున్న విద్యా ర్థులకు ఈనెల 15న మధ్యాహ్నం 3.30 గంటలకు కళాస్రవంతి ఆధ్వర్యంలో దేశభక్తిగీతాల పోటీలను శ్రీగురుకుల పాఠశాలలో నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష,కార్యదర్శులు బూర్లి కోటేశ్వరరావు, ఇప్పిలి ఏకాహం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 9490015314 నెంబరుకు సంప్రదించాలని కోరారు. బాలబాలికలకు విడివిడిగా ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

రేపు పోటీపరీక్షలపై సదస్సు

కాశీబుగ్గ:బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ యువ తకు శనివారం ఉదయం 10గంటలకు అవగాహన సదస్సు నిర్వహించను న్నట్లు జగన్‌కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 9866596316 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ఒడిశా

ఓజేఈఈ నిర్వహించండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

పర్లాకిమిడి:రాష్ట్రంలో రెండోసారి ఒడిశా సంయుక్త ప్రవేశపరీక్ష (ఓజెఈఈ) నిర్వహించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో ప్రైవేటు ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో అత్యధికంగా సీట్లు ఖాళీగా ఉన్నాయని, రిజర్వ్‌డ్ అభ్యర్థుల సీట్లు కూడా భారీగా ఖాళీగా ఉండడంతో ఓజేఈఈ ప్రత్యేక ప్రవేశపరీక్షకోసం ఆదేశించాలని హైకోర్టులో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల సంఘం రిట్ పిటిషన్ దాఖలుచేసింది. ఈ రిట్ పిటిషన్ విచారణ పురస్కరించుకొని శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీచేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగాఖాళీగా ఉన్న రిజర్వ్‌డు సీట్లు భర్తీ చేసేందుకు ప్రత్యేక ప్రవేశపరీక్ష నిర్వహించనుండడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఎస్ఎస్ఈ బకాయిలు చెల్లించండి

పర్లాకిమిడి:రాష్ట్రానికి చెల్లించాల్సిన భద్రతా బకాయిలు (ఎస్ఎస్ఈ) వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఆదిత్య ప్రసాద్‌పాడి ఒక ప్రకటనలో కోరారు. రెండేళ్లుగా నిధుల బకాయిలు ఖాతాలో మూలుగుతున్నాయని తెలిపారు. ఈఖాతా కింద కేంద్రప్రభుత్వం రూ.280 కోట్లు రాష్ట్రానికి బకాయి ఉందని తెలిపారు. ఈ బకాయి నిధులను తక్షణమే విడుదలచేయాలని కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ సిన్హాతో వీడియో కాన్ఫరెన్స్‌లో కోరినట్లు చెప్పారు. రాష్ట్రంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలో అభివృద్ధి సంబంధిత ప్రాజెక్ట్‌లపై చర్చించినట్లు తెలిపారు. కోరాపుట్, మల్కనగిరి జిల్లాల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రాజెక్ట్‌లు త్వరితగతిన పూర్తి చేసుకొనేందకు సహకరించాలని కోరినట్లు చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసన

పర్లాకిమిడి:ప్రధాని మోడి పాలనలో సాధారణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు శశీర్‌బంత్ సామంత్ రాయ్ ఆరోపించారు. హైస్కూల్ కూడలిలో శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంత్‌రాయ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ధోరణి వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన ఏర్పాటుచేశారు



నిరసన తెలుపుతున్న ఆమ్‌ఆద్మీ పార్టీనాయకులు

తులసీదాస్‌కు డాక్టరేట్

రాయగడ: స్థానిక గోపబంధు పురపాలక ఉన్నతపాఠశాల ఉపాధ్యాయడు పతివాడ తులసీదాస్‌కు డాక్టరేట్ లభించింది.దాస్ అన్నమయ్య కీర్తనలు వైష్ణవభక్తి అన్న తులనాత్మక గ్రంధం సమర్పించడంతో బరంపురం విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది.తులసీదాస్ ఎస్.ఎన్.రావుగారి పర్యవేక్షణలో ఈ గ్రంధ పరిశోధన చేశారు

జోనల్ స్థాయి డ్రామా పోటీలు

రాయగడ:రాయగడ జీబీఎం పాఠశాలలో శుక్రవారం జోనల్‌స్థాయి డ్రామా పోటీలు జరిగాయి.ఈ పోటీల్లో గజపతి, రాయగడ, కొరాపుట్,నవరంగపూర్, మలకనగిరి జిల్లాలకు చెందిన విద్యార్థులు నటన చూపరులను ఆకట్టుకుంది.చిల్లంగి,మూఢనమ్మకాలు, స్వచ్ఛభారత్, డిజిటల్ ఇండియాపై జరిగిన డ్రామా పోటీల్లో విద్యార్థులు నటించారు. ఈ సందన్భంగా సబ్‌కలెక్టర్ ప్రభీర్‌కుమార్‌నాయక్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అనస్థ్యకర్కట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వరలక్ష్మీ పూజలు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వరలక్ష్మీవ్రత పూజలు ఘనంగా జరిగాయి. స్థానిక పొడుగు దేవాలయంలో నిర్మించిన లలితాదేవీ ఆలయం వద్ద 500 మంది మహిళలు వ్రతం చేశారు. ఆలయానికి ఉదయం ఐదు గంటల నుంచే భక్తుల రద్దీ నెలకొంది. ప్రసన్న వెంకటేశ్వర, పాత వెంకటేశ్వర ఆలయం వద్ద సామూహిక వ్రతాలు జరిగాయి.



పూజలు చేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న జీడి వ్యాపారసంఘ నాయకులు

పొరపొచ్చాలు వద్దు.. ఐక్యంగా ఉందాం

జీడి వ్యాపార సంఘ నాయకుల పిలుపు

పలాస:ఒకే వ్యాపారంలో కొనసాగుతున్న మన మధ్య పొరపొచ్చాలు లేకుండా ఐక్యంగా ఉందామని కొనసాగుదామని జీడి వ్యాపారసంఘ నాయకులు పిలుపునిచ్చారు. జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటుచేయడానికి పలాస పీసీఎంఏ సమావేశమందిరంలో జిల్లా జీడివ్యాపారులు సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఎం.రామేశ్వరరావు, కె.రామారావు ఏపీ క్యాజు అసోసియేషన్‌తో ఉన్న సంబంధాలపై చర్చించారు. జిల్లావ్యాప్తంగా జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటుచేయడానికి తొమ్మిది మందితో కూడిన కమిటీ నియమించారు.కార్యక్రమంలో జిల్లాలోని జీడి పరిశ్రమదారులు ప్రసాదరావు, జె.చిట్టిబాబు, కృష్ణారావుతోపాటు పలాస-కాశీబుగ్గ వ్యాపారసంఘ ప్రధాన కార్యదర్శి చుండూరు మహేష్, కోశాధికారి సిందిరి సతీష్‌కుమార్, జిల్లా రైస్‌మిల్లర్ల అసోసియేషన్ కార్యదర్శి శాసనపురి మురళీకృష్ణ, మాజీ కార్యదర్శి మల్లా సురేష్‌కుమార్, మాజీ కోశాధికారి కేవీ శివకృష్ణ, కొత్తకోట తిరుమలరావు, పట్నాన వైకుంఠరావు, తంగుడు వీర్రాజు, యరుకోల సుధాకర్, తూముల శ్రీనివాసరావు, డోకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగస్టులో ఎన్టీఆర్ వైద్యసేవ శిబిరాలు

శ్రీకాకుళం సిటీ:డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆగస్టులో నిర్వహించనున్న మెగావైద్యశిబిరాల వివరాలను జిల్లాసమన్వయకర్త డాకర్‌పి.ప్రకాషరావు శుక్రవారం ప్రకటించారు.ఈనెల 11న భామిని మండలంలోని తాటిమానుగూడ, 13న నందిగాం మండలంలెని ఎస్ఆర్‌పురం, 23న బూర్జమండలంలోని జంగాలవలస, 30న సీతంపేట మండలంలోని శంభాం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు భాషాపండితులకు పదోన్నతుల కౌన్సెలింగ్

శ్రీకాకుళం సిటీ: గ్రేడ్-2 భాషా పండితులకు శనివారం పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించను న్నట్లు డీఈవో ఆబోతుల ప్రభాకరరావు తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉదయం 9:30కు ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

నంద్యాలలో 'కలమట' ప్రచారం

మెళియాపుట్టి:నంద్యాల శాసనసభ ఉప ఎన్నికలో టీడీపీ అభ్యర్థి బ్రహ్మానందరెడ్డికి మద్దతుగా పాతపట్నం ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి ప్రచారం చేశారు. నంద్యాల మున్సిపాల్టీకి ఇన్‌చార్జిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించడంతో ఎన్నికలు జరిగే వరకు ప్రచారంలోనే పాల్గొనున్నట్లు తెలిపారు. శుక్రవారం పలు వార్డుల్లో బ్రహ్మానందరెడ్డి తరుపున ప్రచారం నిర్వహించారు.



ప్రచారం చేస్తున్న వెంకటరమణమూర్తి

చైనా వస్తువులు బహిష్కరిద్దాం

కాశీబుగ్గ: భారతభూభాగాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్న చైనాకు సంబంధించిన వస్తువులను బహిష్కరించాలని, స్వదేశీ వస్తువులనే వాడాలని స్వదేశీజాగరణ్‌మంచ్ ఆధ్వర్యంలో కాశీబుగ్గలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీదుగా ఎకనామిక్ కారిడార్ నిర్మాణం, ఐక్యరాజ్యసమితిలో మనదేశానికి శాశ్వత సభ్యత్వం రాకుండా అడ్డపడడం వంటి చర్యలకు చైనా పాల్పడుతోందని తెలిపారు. చౌకధరలకు లభిస్తున్నాయని చైనా ఉత్పత్తులు కొనడంవల్ల గ్యారంటీ లేని వస్తువులు అంటగడుతున్నారని తెలిపారు.పలాసఎంఈవో పైల కృష్ణప్రసాద్‌కు కరపత్రం అందజేశారు. కార్యక్రమంలోఅర్జున్‌పాత్రో, వాసు, మాధవ్,కిషోర్‌కుమార్‌పాత్రో పాల్గొన్నారు.

గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

● జిల్లా వ్యాప్తంగా 2,620 మంది అభ్యర్థుల హాజరు
● నాలుగు కేంద్రాల్లో నిర్వహణ ● డీఆర్వో సత్యనారాయణ

(శ్రీకాకుళం సిటీ)

జిల్లా వ్యాప్తంగా ఈనెల 6, 7 తేదీల్లో జరగనున్న ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు డీఆర్వో నటుకుల సత్యనారాయణ తెలిపారు. పరీక్షలు పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రూప్-3 పరీక్షలు రెండు విడతల్లో జరుగుతాయన్నారు. ఆగస్టు 6న ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఉదయం 1,310, మధ్యాహ్నం 1,310 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు తెలిపారు. రాజాంలోని జీఎమ్మార్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, టెక్కలిలోని ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చిలకపాలెంలోని శ్రీశివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. బయోమెట్రిక్ ద్వారా అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుందని, అభ్యర్థులు ఏదైనా ఒరిజినల్ గుర్తింపుకార్డును తీసుకురావాలని డీఆర్వో సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు గంట ముందుకు హాజరుకావాలని సూచించారు. ఈ సమీక్షలో ఏపీపీ ఎస్సీ సెక్షన్ అధికారి ఐ.గంగాధర్, సహాయ సెక్షన్ అధికారులు ప్రతాప్‌కుమార్, డి.నాగభూషణం, లైజన్ అధికారులు కె.కృష్ణమూర్తి, ఎస్.సతీష్, ఎస్.హనుమంతురావు, కె.శరత్‌బాబు, కళాశాలల ప్రతినిధులు, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణ

ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు పీవో ఎల్.శివశంకర్ తెలిపారు. శుక్రవారం గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్‌పీ సిసోడియాతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ వివరాలను పీవో విలేఖరులకు వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో గల గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం రూ.600కోట్లు విడుదల చేసేందుకు సిసోడియా హామీనిచ్చినట్టు పీవో తెలిపారు. ప్రస్తుత అపడమిక్ సీజన్‌లో గిరిజనులు వ్యాధుల బారిన పడకుండా అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిసోడియా ఆదేశించినట్టు చెప్పారు. ఐటీడీఏ పరిధిలో ఇప్పటి వరకు 212 గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని చెప్పారు. డిసెంబర్ 31 నాటికి అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో రోడ్డు సౌకర్యం కల్పించన్నున్నట్టు పీవో తెలిపారు. విద్యార్థుల శాతం పెంచడంతోపాటు వారి ఆధార్‌నెంబర్‌లు అనుసంధానం చేయాలన్నారు. డ్రాపౌట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ విద్యావిభాగాన్ని ఆదేశించారన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఈఈ కె.అశోక్, డిప్యూటీ డీఈవో జి.రామ్మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో నరేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవో శివశంకర్

అన్ని గ్రామాలకు పత్రికలు వెళ్లాలి

ఏజెన్సీ ప్రాంతంలో అన్ని గిరిజన గ్రామాలకు వార్తాపత్రికలు వెళ్లాలని ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ తెలిపారు. శుక్రవారం 20 మండలాల ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఐటీడీఏ తరపున చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు మారుమూల గిరిజన గ్రామాలకు చేరడం లేదన్నారు. ఆ పథకాల ప్రయోజనాలేంటో గిరిజనులకు తెలియడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీ దినోత్సవం నుంచి ప్రతి గ్రామానికీ వార్తాపత్రికలు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని పీవో ఆదేశించారు.

వెంకటరమణ పర్వతారోహణకు
రూ.3.5 లక్షల విరాళం

సిక్కోలు ఖ్యాతిని చాటి చెప్పాలి: జేసీ చక్రధర్‌బాబు

శ్రీకాకుళంసిటీ: పర్వతారోహణలో సిక్కోలు ఖ్యాతిని చాటిచెప్పాలని జాయింట్ కలెక్టర్ కేవీఎన్ చక్రధరబాబు ఆకాంక్షించారు. ఆఫ్రికా ఖండంలో అతిపెద్దదైన కిల్లీమంజారో పర్వతాన్ని అధిరోహించేందుకు వెళుతున్న కొత్తూరుకు చెందిన మామిడి వెంకటరమణకు నగరంలోని వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు తమ సహకారాన్ని అందించారు. పర్వతారోహణకు అవసరమైన రూ.3.5 లక్షలను సమీకరించి వెంకటరమణకు అందజేశారు. గీతాశ్రీకాంత్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు గీతాశ్రీకాంత్, సిక్కోలు యువశక్తి ప్రతినిధి అన్నెపు సందీప్ రూ.2.70 లక్షలు, సుందర సత్సంగం వ్యవస్థాపకుడు శ్రీపెరంబదూరు సూరిబాబు, అతని శిష్యబృందం రూ.21 వేలు, ట్రెజరీ హెల్పింగ్ హ్యాండ్స్ బృందం మాదారపు డేవిడ్, ప్రదీప్‌కుమార్, అనిల్ బృందం, బాలకృష్ణఫ్యాన్స్ రాజశేఖర్, సంతోష్ రూ.10వేలు అందించారు. ఈ మొత్తాన్ని జేసీ చేతులమీదుగా రమణకు అప్పగించారు.



జేసీకి చెక్కు అందజేస్తున్న గీతాశ్రీకాంత్, తదితరులు

గిరివర్య పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట: పాతపట్నంలో ఈనెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో గిరివర్య, గిరిసేవ పురస్కారాలను అందజేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో ఎల్.శివశంకర్ తెలిపారు. గిరిసేవ పురస్కారాలను జిల్లాలోని గిరిజనులకు విశేష సేవలందించిన గిరిజనేతరులకు ప్రదానం చేస్తామని ఆయన చెప్పారు. గిరివర్య పురస్కారాలను గిరిజనులకే అందిస్తామన్నారు. ఐఐటీ, ఎంబీబీఎస్ సీట్లు సాధించిన వారు, ఎవరెస్టు శిఖరం అధిరోహించిన వారు, జాతీయ స్థాయిలో వివిధ క్రీడల్లో పాల్గొన్న వారు, సర్వీస్ కమిషన్ ద్వారా ఉన్నత ఉద్యోగాలు పొందిన గిరిజనులు అర్హులన్నారు. అసాధారణ ప్రతిభ కనబరిచిన వారు సోమవారం పీఎంఆర్‌సీ భవనంలో వారి పూర్తి వివరాలను అందజేయాలని పీవో కోరారు.

7న జాతీయ చేనేత దినోత్సవం

శ్రీకాకుళం-కలెక్టరేట్: జాతీయ చేనేత దినోత్సవాన్ని ఈనెల 7న నిర్వహిస్తున్నట్టు చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు జి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు పాతబస్టాండ్ నుంచి బాపూజీ కళామందిర్ వరకు అవగాహన ర్యాలీ చేపడతామని చెప్పారు. అనంతరం బాపూజీ కళామందిర్‌లో సమావేశం ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

జగన్ వ్యాఖ్యలు జుగుప్సాకరం

● విపక్ష నేతపై జిల్లా ఎమ్మెల్యేల మండిపాటు

ఫ్యాక్షనిజాన్ని ప్రేరిపిస్తున్నారు: ఎమ్మెల్యే లక్ష్మీదేవి

శ్రీకాకుళం సిటీ: ముఖ్యమంత్రిపై జగన్ వ్యాఖ్యలు జుగుప్సాకరం, అప్రజాస్వామికమని ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. ప్రతిపక్ష నేత, ఒక రాజకీయపార్టీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న జగన్ బహిరంగసభలో ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. రాష్ట్రచరిత్రలో ఏ ప్రతిపక్షనాయకుడు గతంలో ఇంతటి తీవ్రవ్యాఖ్యలు చేసిన సందర్భాలు లేవన్నారు. ఫ్యాక్షనిజాన్ని ప్రేరేపించే విధంగా జగన్ మాటలు ఉన్నాయని, ఆమె విమర్శించారు.

జగన్‌కు విమర్శించే అర్హత లేదు: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట: రాష్ట్రాభివృద్ధికి నిరంతరం పాటుపడే సీఎం చంద్రబాబునాయుడును విమర్శించే అర్హత పలు కేసుల్లో జైలుకు వెళ్లిన జగన్మోహన్‌రెడ్డికి లేదని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. తండ్రి అధికారాన్ని అడ్డంగా చేసుకొని రాజకీయ దందాలకు పాల్పడి పలువురి ప్రాణాలను జగన్ తీశారని బగ్గు ఆరోపించారు. మరోసారి జగన్ తన బుద్ధిని చాటుకున్నారని మండిపడ్డారు.

జగన్‌ది ఫ్యాక్షన్ బుద్ధి: ఎమ్మెల్యే కలమట

మెళియాపుట్టి :జగన్ ఫ్యాక్షన్ బుద్ధి మరోసారి బయటపడిందని ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం కలమట ఫోన్‌లో మాట్లాడారు. అధికారంలోకి రాలేమనే ఉక్రోసంతో జగన్.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఇటువంటి మాటలు మళ్లీ మాట్లాడితే ప్రజలే జగన్‌ను కాల్చిచంపే పరిస్థితి వస్తుందన్నారు.

హత్యా రాజకీయాలను ప్రేరేపించేలా జగన్ వ్యాఖ్యలు

డైఅండ్‌నైట్ జంక్షన్: జగన్ వ్యాఖ్యలు హత్యా రాజకీయాలకు ప్రేరేపించే విధంగా ఉన్నాయని...విపక్ష నేతగా ఆయన విఫలమయ్యారని టీడీపీ ఉత్తరాంధ్ర శిక్షణ కేంద్రం సమన్వయకర్త కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకఖరుల సమావేశంలో మాట్లాడారు. సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్‌పై రాజద్రోహం కేసు పెట్టాలన్నారు. జగన్ కుటుంబానికి నేర చరిత్ర ఉందన్నారు. ఎంతో మంది ప్రాణాలను తీసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు వై.వినోదరావు, జల్లు చంద్రమౌళి, లక్ష్మిసుమంత్‌నాయుడు, ఎ.రామకృష్ణంనాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలనాయుడు

క్వెస్ట్‌తో ఆదిత్య కళాశాల ఒప్పందం

కె.కొత్తూరు(టెక్కలి):మైక్రోసాఫ్ట్ హెవ్‌లెట్ పెక్టర్ శిక్షణ అనుబంధ సంస్థ అయిన క్వెస్ట్ ఈజ్ సొల్యూషన్ కంపెనీతో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్ర వారం కళాశాలలో క్వెస్ట్ ప్రతినిధి జాఫరీ, డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఒప్పంద పత్రాల ను ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌తో పాటు నూతన ఆవిష్కరణలపై కళాశాలలో సదస్సులు, వర్క్‌షాపులు నిర్వహించేందుకు అవకాశాలు మరింత పెరుగుతాయని నాగేశ్వ రరావు తెలిపారు. అధునాతన, సాంకేతికతపై ఆదిత్య అధ్యాపకులు శిక్షణ పొందేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. క్వెస్ట్ ప్రతినిధి జాఫరీ మాట్లాడుతూ, ప్రపంచంలో ఉన్న పోటీని ఎదుర్కొనేందుకు నూతన ఆవిష్కరణలు రావాలని, కంపెనీలతో పాటు కళాశాలలు ఈ బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్ ఏఎస్ శ్రీనివాసరావు, ఐఐపీసీ కో ఆర్డినేటర్ పి.రాజేష్ పాల్గొన్నారు.



క్వెస్ట్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఆదిత్య డైరెక్టర్

ఇంటర్‌లో చేరేందుకు మరో అవకాశం

శ్రీకాకుళం సిటీ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఇంటర్ బోర్డు మరోసారి అవకాశమిచ్చింది. కళాశాలల్లో చేరేందుకు ఈ నెల 16 వరకూ షెడ్యూల్ ప్రకటించింది. దీంతో గతంలో దరఖాస్తు చేసుకుని సీట్లు రానివారు, అలాగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైనవారు ఇంటర్‌లో చేరేందుకు వెసులుబాటు కల్పించింది.ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి మల్లేశ్వరరావు తెలిపారు.

త్వరలో జిల్లాకు మంత్రి లోకేష్

డేఅండ్‌నైట్ జంక్షన్ : ఐటీ, పంచాయతీరాజ్ శాఖామంత్రి నారా లోకేష్ త్వరలో జిల్లాకు రానున్నారని రాష్ట్ర ఎంపీపీ సంఘ అధ్యక్షుడు వై.వినోద్‌రాజ్ తెలిపారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. లోకేష్ పర్యటనలో భాగంగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ప్రతినిధులు, ఎంపీపీలు, సర్పంచ్‌లను కలవనున్నారని తెలిపారు. మరో రెండు రోజుల్లో నారా లోకేష్ పర్యటన వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న వినోదరాజు



పక్షిమోచన తీర్థంలో స్నానాలు చేస్తున్న భక్తులు

పక్షి మోచన తీర్థానికి పోటెత్తారు

- భక్తులతో కిటకిటలాడిన శ్రీముఖలింగం
- ఐదో రోజూ.. అదే తాకిడి
- స్నానాలు చేసి పులకించిన భక్తజనం

శ్రీముఖలింగం (జలుమూరు): అష్టతీర్థ రాజమహాయోగం సందర్భంగా ఐదోరోజు ద్వాదశి శుక్రవారం పక్షిమోచన తీర్థంలో భక్తులు స్నానాలాచరించారు. అనంతరం భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అంతకముందు అర్చకులు ఉదయం 5 గంటలకే పక్షి మోచన తీర్థం వద్ద పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పర్లాకిమిడి మహారాజు పేరున అభిషేకం చే శారు. తొలుత గణపతిపూజ చేసి పుణ్యాహవచనం నిర్వహించారు. వంశధారనీటితో తెచ్చిన కలశాలకు పూజలుచేసి పక్షి మోచన తీర్థంలో కలిపారు. అనంతరం భక్తులను స్నానాలకు అనుమతించారు.



తీర్థానికి హారతి ఇస్తున్న దేవాదాయశాఖ ఏసీ శ్యామలాదేవి

తరలివచ్చిన భక్తజనం

జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో శ్రీముఖలింగం కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తజనం పక్షిమోచన తీర్థంలో స్నానాలాచరించి భీమేశ్వర స్వామితో పాటు మధుకేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. దేవాదాయశాఖ అధికారులు భక్తుల కోసం షామియానాలు ఏర్పాటుచేశారు. తాగునీటి సౌకర్యం కూడా కల్పించారు. దేవాదాయశాఖ ఏసీ వి.శ్యామలాదేవి తీర్థం , ఆలయాలు వద్ద పరిస్థితులను సమీక్షించారు. జిల్లా పంచాయతీ అధికారి కోటేశ్వరరావు గ్రామంలో పారిశుధ్యం పనులను పరిశీలించి పంచాయతీ అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా శ్రీముఖలింగేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరి బలరాం, తర్ర బలరాం, అర్చకులు పెద్దలింగన్న, నారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవి, వ్యవసాయాధికారి డి.విజయభాస్కరరావు, అప్పారావు, శ్రీకృష్ణ, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

● దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వి. శ్యామలాదేవి ఆలయంలో గోపూజ నిర్వహించి పక్షి మోచన తీర్థంలో హారతులు ఇచ్చారు.

● రాధాగోవిందస్వామి మఠం వద్ద కొమనాపల్లి, బైదలాపురం భక్తులు భజన కాలక్షేపం చేశారు. నరసన్నపేట బృందం కచేరి నిర్వహించింది.

● బైదలాపురం రోడ్డులో, శ్రీముఖలింగేశ్వరాలయం, రాధాగోవిందస్వామి మఠం వద్ద భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. ● అచ్యుతాపురం వైద్యాధికారి విజయలక్ష్మి ఆలయం సమీపంలో ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహించారు. ● కొమనాపల్లి, బుడితి సత్యసాయి భక్తులు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● నరసన్నపేట సీఐ పైడిపునాయుడు నేతృత్వంలో జలుమూరు ఎస్ఐ వంద మంది పోలీసులతో గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. ● పక్షిమోచన తీర్థంలో సాయంత్రం అర్చకులు అష్టాదశ, నాగ, పంచ హారతులను అందించి పూజలు చేశారు.

నేడు జంబు తీర్థంలో...

అష్టతీర్థ రాజమహాయోగంలో భాగంగా ఆరో రోజు త్రయోదశి, శనివారం జంబు తీర్థంలో భక్తులు స్నానాలాచరించనున్నారు. అనంతరం సమీపంలో జంబుకేశ్వరస్వామిని దర్శించుకుంటారు. ఈ తీర్థం శ్రీముఖలింగం నుంచి కరకవలస వెళ్లే రోడ్డుకు ఎడమ వైపున ఆలయానికి కిలోమీటరు దూరంలో ఉంది. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



జంబు తీర్థం, జంబుకేశ్వరస్వామి



కృష్ణారావుకు కిడ్నీదానమిచ్చిన సోదరి

కొత్తవరకలో...

కవిటి రూరల్: కొత్తవరక గ్రామానికి చెందిన బెల్లెడ కృష్ణారావు(ట్రాక్టర్ డ్రైవర్) రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో సోదరి జగన్మోహిని తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. అయితే 40 నుంచి 50సార్లు డయాలసిస్ చేసిన తర్వాతే.. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు చెప్పారు. దీంతో కృష్ణారావు కొన్నాళ్లు మందులు వాడాడు. 2014 తర్వాత వరుసగా డయాలసిస్‌ను చేయించుకున్నాడు. తెలుపు రేషన్ కార్డు లేకపోవడంతో తనకున్న ఎకరా 25 సెంట్లను అమ్మి వైద్యం కోసం ఖర్చు చేశాడు. అప్పటికే రూ.5లక్షలకుపైగా వెచ్చించాడు. ఆర్థికపరిస్థితి సహకరించకపోవడంతో వెంటనే తెలుపురేషన్ కార్డు పొందాడు. ఆరోగ్యశ్రీ ద్వారా 2015, ఏప్రిల్‌లో సోదరి సహకారంతో కిడ్నీ మార్పిడి చేయించుకున్నాడు. అయితే మందుల కోసం నెలకి రూ. 8500/- వెచ్చించాల్సి వస్తోందని చెప్పాడు. తనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, కుటుంబ పోషణ భారంగా మారిందని కృష్ణారావు చెప్పాడు. ఇదిలా ఉండగా కిడ్నీ దానమిచ్చిన సోదరి జగన్మోహిని భర్త చనిపోవడంతో ప్రస్తుతం సోదరుడి వద్దే ఉంటోంది. ఎటువంటి పెన్షన్ అందడం లేదు.

ఆ త్యాగం అపూర్వం



మన కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా సమస్య వస్తే...? తలో చేయి వేసి ఏదోలా సహాయపడతాం. ఆ సమస్య నుంచి గట్టెక్కిస్తాం. అదే ఆరోగ్యపరంగా అయితే.. కాస్త ఆలోచిస్తాం. అవయవదానం చేయాలంటే మాత్రం వెనకడుగు వేస్తాం. కానీ ఇచ్ఛాపురం, ఉద్దానం వంటి ప్రాంతాల్లో పరిస్థితి ఇందుకు భిన్నం. కిడ్నీ వ్యాధికి గురై నరకయాతన అనుభవిస్తున్న రక్త సంబంధీకులను కాపాడుకోవడానికి ఆ ప్రాంతవాసులు వెనకా, ముందు ఆలోచించడం లేదు. తమ కిడ్నీలను దానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు. అయితే కిడ్నీ మార్పిడి ప్రక్రియ పూర్తయిన తర్వాత చాలామంది రోగులు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. సరైన పోషకాహారం లేక, మందులు కొనుక్కోనే స్థోమత లేక మృత్యువాతపడుతున్నారు. దీంతో కిడ్నీ దానం చేసిన వారి త్యాగం వృథా అవుతుంది. తోడుగా కలకాలం నిలుస్తారనుకున్న వారు తమ కళ్లెదుటే మరణిస్తుండడంతో కిడ్నీదాతలు ఆవేదనకు గురవుతున్నారు.

అండగా నిలిస్తేనే.. సార్థకం

- కిడ్నీ దానంతో కొత్త జీవితం
- మందులు వాడితేనే ఫలితం
- లేదంటే కష్టం వృథా
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం



కొఠారిలో కిడ్నీతో భర్తలను కోల్పోయిన తోడికోడళ్లు

ఇచ్ఛాపురం మండలవాసులను కిడ్నీ వ్యాధి తరతరాలుగా పట్టిపీడిస్తోంది. రాకాసిలా వారిని వెంటాడుతోంది. ఇప్పటికే వందలాది మందిని ఆ మహమ్మారి బలితీసుకుంది. నేటికీ ఎంతోమంది ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ముఖ్యంగా మండలంలో కేశుపురం, కొఠారి, బూర్జుపాడు పంచాయతీల్లో.. ఎవరిని పలకరించినా.. కన్నీటి గోడే వినిపిస్తుంది. అధికారులు, నేతలు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు.. ఇలా ఎందరొచ్చినా.. వారి వెతలు మాత్రం తీరడం లేదు. ఇక ఉద్దానంలో ఏ గ్రామం చూసినా మంచాన పడిన రోగులే దర్శనమిస్తారు. గత 20ఏళ్లగా పరీక్షలు, పరిశీలనే తప్పా.. వ్యాధి లక్షణాలను సమగ్రంగా గుర్తించిన దాఖలాలు లేవు. డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు ప్రకటనలకే పరిమితమవడంతో కిడ్నీ రోగుల కష్టాలు తీరడం లేదు.

ఇచ్ఛాపురం : కేశుపురం పంచాయతీ సన్యాసిపుట్టుగ గ్రామానికి చెందిన మాసుపత్రి ఆనంద్ రెండు కిడ్నీలు పాడైపోయాయి. దీంతో భార్య ఈశ్వరి 2012లో ఒక కిడ్నీని భర్తకు దానం చేసింది. అయితే రెండేళ్లకే భర్త ఆరోగ్యం క్షీణించడంతో తరుచూ విశాఖకు వెళ్తూ.. చికిత్స అందించేవారు. చివరకు 2014లో ఆనంద్ మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రస్తుతం ఈశ్వరి కూలి పను లు చేసుకుంటూ.. ముగ్గురు పిల్లలను పోషించుకుంటోంది.

కేశుపురంలో...

కేశుపురం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గుజ్జు జోగులు, నిర్మల కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. వారి తనయుడు నాగరాజును కూడా కిడ్నీ వ్యాధి మహమ్మారే మింగేసింది. జోగులు తమ్ముడు వల్లభరావు కూడా అదే వ్యాధికి గురై మరణించాడు. ఆయన కొడుకు మోహన్ కిడ్నీ వ్యాధితో బాధపడు తుండగా.. ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నాడు. భర్త మంచం పట్టగా, భార్య కూలి పనులు చేసుకుంటూ... పిల్లలను పోషిస్తోంది. అదే గ్రామానికి చెందిన ఎస్.చిరంజీవి కిడ్నీ వ్యాధితో మృతి చెందగా భార్య పుష్ప ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు నానా అవస్థలు పడుతోంది.



సన్యాసిపుట్టుగలో కిడ్నీ ఇచ్చినా భర్త దక్కకపోవడంతో దీనంగా కూర్చొన్న ఈశ్వరి

కొఠారిలో...

కొఠారి గ్రామంలో భార్యాభర్తలైన దల్లి పురుషోత్తం, తులసమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. వీరి కుమారులు దల్లి పోలయ్య, దల్లి కోదండరావు కూడా కిడ్నీ వ్యాధితోనే మృత్యువాత పడ్డారు. అన్నదమ్ములిద్దరూ.. నెలల తేడాలో చనిపోవడంతో తోడికోడళ్లు అనాథలుగా మారారు.



తల్లి సుశీలతో మధు

దాతల కోసం ఎదురుచూపు

బారువ (సోంపేట) : బారువ గ్రామానికి చెందిన శరత్, సుశీల దంపతుల ఏకైక కుమారుడు మధుపాణీగ్రాహి. తండ్రి చిరుద్యోగం నుంచి ఉద్యోగ విరమణ పొందారు. మధు మొదట ప్రయివేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసి అనంతరం కెమికల్ కంపెనీలో కార్మికునిగా విధుల్లో చేరాడు. మధుకు అనారోగ్యం పాలవడంతో విశాఖలో వైద్యచికిత్సలు చేయించగా రెండు కిడ్నీలు పాడైనట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో కిడ్నీ దానానికి ఆ తల్లి ముందుకు వచ్చింది. ఆరోగ్యశ్రీ కింద 2013లో కిడ్నీని మార్చారు. అనంతరం తల్లి, కుమారుడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నా.. మందులు కొనుక్కోలేక తీవ్ర ఇబ్బందులపాలవుతున్నారు. ప్రస్తుతం మధు అంబేద్కర్ యూనివర్సిటీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు.

భారమవుతున్న మందుల వ్యయం

ఆంధ్రజ్యోతి ఫోకస్

కిడ్నీ వ్యాధికి గురైన వారికి ఉచితంగా డయాలసిస్ చేస్తున్నా.. మందుల భారం మాత్రం రోగులను మరింత కుంగదీస్తోంది. వాటి కోసం ప్రతినెలా విశాఖకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే కావడంతో రోగులకు సరైన పౌష్టికాహారం కూడా అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, దాతలు, స్వచ్ఛంద సంస్థలు స్పందించి కిడ్నీ బాధితులను అన్ని విధాలా ఆదుకోవాల్సి ఉందని, లేకుంటే ఇంకెంతోమంది మృతి చెందడం ఖాయమని ఆ ప్రాంతవాసులు తెలియజేస్తున్నారు.

కె.శాసనాంలో ...

కె.శాసనాంలో పెదిని మాదయ్య రెండు కిడ్నీలు పాడైపోవడంతో నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో తల్లి తేజమ్మ 2016మార్చిలో కొడుక్కి కిడ్నీ దానమిచ్చింది. ప్రస్తుతం వారిద్దరూ క్షేమంగానే ఉన్నారు. అయితే ప్రతినెలా మందుల కోసం వేలకు వేలు వెచ్చించ లేకపోతున్నామని ఆ తల్లీకొడుకులు తెలిపారు.



కుమారుడికి కిడ్నీదానం చేసిన తల్లి

వరలక్ష్మీ.. పాహిమాం!

- ఆలయాలకు శ్రావణ శోభ
- అమ్మవారి దర్శనాలకు బారులుదీరిన మహిళలు

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మహిళలు భక్తిశ్రద్ధలతో ఇళ్లలో వరలక్ష్మి వ్రతం చేశారు. అనంతరం ఆలయాలకు క్యూ కట్టారు. ప్రధానంగా అమ్మవారిని దర్శించి మగువలు పులకించిపోయారు. అనంతరం సామూహికంగా కుంకుమపూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వరాలిచ్చే.. వరలక్ష్మిని మనసారా స్మరించి.. అమ్మా.. కరుణించు అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. మొత్తంగా జిల్లాలో ప్రధాన పట్టణాల్లోని ప్రముఖ ఆలయాలన్నీ.. భక్తజనంతో కిటకిటలాడాయి.



ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో..



శ్రీకాకుళంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో...





జలుమూరు శ్రీముఖలింగంలో...



కనకదుర్గకు పూజలు



హారతి అందుకుంటున్న దృశ్యం



హిరమండలంలో మహిళల పూజలు



కవిటి రూరల్ ప్రగడపుట్టుగ కోదండరామాలయంలో....



టెక్కలి దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ...





కాశీబుగ్గ మహాలక్ష్మి ఆలయంలో..



శ్రీకాకుళం: క్యూలైన్లలో భక్తులు



పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో...



ఏడురోడ్ల జంక్షన్‌వద్ద కనకదుర్గ గుడి వద్ద మహిళలు ఇలా..



రాజాంలో ఆలయం ఎదుట బారులుదీరిన మహిళలు

కోడ్ భాషలో TROUBLEను ఎలా రాస్తారు?

మెంటల్ ఎబిలిటీ

1. ఒక కోడ్ భాషలో LAWYER ను ZHWNEC గా రాశారు. అదే కోడ్‌లో WONDER ను ఎలా రాస్తారు?
ఎ) EHWYST బి) WEYHTS
సి) TUSEWJ డి) ఏదీకాదు
2. ఒక కోడ్ భాషలో NUMBER ను ELXMHU గా రాశారు. అదే కోడ్ భాషలో UNINOR ను ఎలా రాస్తారు?
ఎ) LHLEQK బి) LQLKHE
సి) LELQHK డి) ఏదీకాదు
3. ఒక కోడ్‌లో MASTERను IVGHZNగా రాశారు. అదే కోడ్‌లో TALENTను ఎలా రాస్తారు?
ఎ) GZOGMV బి) GMVOZG
సి) GVOZMG డి) ఏదీకాదు
4. ఒక కోడ్‌లో EXCELను GBIMVగా రాశారు. అదే కోడ్‌లో SMILEను ఎలా రాస్తారు?
ఎ) IPPQT బి) IPTQP
సి) UQOTO డి) ఏదీకాదు
5. ఒక కోడ్‌లో STARను 170 గా రాశారు. అదే కోడ్‌లో UNITను ఎలా రాస్తారు?
ఎ) 92 బి) 108 సి) 126 డి) ఏదీకాదు
6. ఒక కోడ్ భాషలో PRIVATE ను BVHVOPF గా రాశారు. అదే కోడ్ భాషలో TROUBLE ను ఎలా రాస్తారు?
ఎ) CHUSPNL బి) HNCPLHU
సి) CNHUSPL డి) ఏదీకాదు

7 - 10
ఒక కోడ్ ప్రకారం HANDSOME ను 89431052 గాను, NICE ను 4672 గాను రాశారు. పై కోడ్ ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి

7. NOSE కు సరైన కోడ్?
ఎ) 4012 బి) 2041 సి) 1024 డి) ఏదీకాదు
8. AIM కు సరైన కోడ్?
ఎ) 569 బి) 695 సి) 965 డి) ఏదీకాదు
9. MIND కు సరైన కోడ్?
ఎ) 5643 బి) 3456 సి) 5436 డి) ఏదీకాదు
10. HOME కు సరైన కోడ్?
ఎ) 8520 బి) 8052 సి) 5082 డి) ఏదీకాదు
11. 6, 7, 16, 51, ---------
ఎ) 208 బి) 504 సి) 416 డి) ఏదీకాదు
12. 8, 4.5, 5.5, 12.5, 52, ----------
ఎ) 416.5 బి) 418.5 సి) 420.5 డి) ఏదీకాదు
13. 8, 3, 2, 3, 10, --------
ఎ) 49 బి) 64 సి) 86 డి) ఏదీకాదు
14. 5, 4, 6, 15, 56, -------
ఎ) 285 బి) 275 సి) 280 డి) ఏదీకాదు
15. 9, 15, 43, 83, 247, -----------
ఎ) 192 బి) 921 సి) 291 డి) ఏదీకాదు
16. a - bc - ab - cdabc - da - cd - ----
ఎ) abbcdd బి) adbcbd
సి) abcdbd డి) ఏదీకాదు
17. ab - b - cacc - b - a - cb
ఎ) cbaab బి) aabbc
సి) adcab డి) ఏదీకాదు
18. d - dba - a - db - - a - ac
ఎ) bcdbcc బి) bbcccd
సి) bccdbc డి) ఏదీకాదు
19. ప్రకటనలు: అన్ని జిల్లాలు రాష్ట్రాలు
అన్ని రాష్ట్రాలు దేశాలు
సారాంశాలు: 1. కొన్ని దేశాలు జిల్లాలు
2. ఏ జిల్లా రాష్ట్రం కాదు
3. కొన్ని దేశాలు రాష్ట్రాలు కాదు
4. కొన్ని రాష్ట్రాలు జిల్లాలు
ఎ) 1, 4 సరైనవి బి) 1, 2, 4 సరైనవి
సి) 1, 3 సరైనవి డి) ఏవీ సరైనవి కావు
20. ప్రకటనలు: ఏ సెకను నిమిషం కాదు




Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special


కొన్ని నిమిషాలు గంటలు
సారాంశాలు: 1. కొన్ని గంటలు సెకన్లు కాదు
2. కొన్ని సెకన్లు నిమిషాలు కాదు
3. కొన్ని గంటలు నిమిషాలు
4. అన్ని సెకన్లు గంటలు
ఎ) 1, 3, 4 సరైనవి బి) 2, 4 సరైనవి
సి) 1, 2, 3 సరైనవి డి) ఏదీకాదు

21. కింది రేఖాచిత్రంలో ఎన్ని త్రిభుజాలు ఉన్నాయి?



ఎ) 20 బి) 22 సి) 18 డి) 14

22. కింది రేఖాచిత్రంలో ఎన్ని దీర్ఘచతురస్రాలు ఉన్నాయి?




ఎ) 8 బి) 9 సి) 10 డి) 11

23 - 25
భిన్నమైనదాన్ని తెలపండి
23. ఎ) షిల్లాంగ్ బి) ఇంఫాల్ సి) అగర్తల డి) భోపాల్
24. ఎ) 4541 బి) 3973 సి) 8167 డి) 6345
25. ఎ) RN బి)SJ సి) FV డి) PH

26 - 30
A + B అంటే A కుమారుడు B
A ÷ B అంటే A భార్య B
A - B అంటే A కుమార్తె B
A X B అంటే A భర్త B
A @ B అంటే A తల్లి B
A $B అంటే A సోదరుడు B
పై సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి


26. A@B$C÷D సమీకరణం ప్రకారం కిందివానిలో ఏది సత్యం?
ఎ) A మేనమామ C బి) C మేనల్లుడు A
సి) D మేనకోడలు A డి) ఏదీకాదు
27. A÷B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A మామగారు C బి) D భర్త C
సి)D కుమార్తె B డి) A తండ్రి D
28. A+÷C$D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) A కోడలు C బి) C భార్య B
సి) B భర్త C డి) C మామగారు A
29. A$B@CXD సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కుమారుడు A బి) D కుమార్తె B
సి) A తండ్రి D డి) D భర్త C
30. A-BXC@D సమీకరణం ప్రకారం కింది వానిలో ఏది సత్యం?
ఎ) D కోడలు B బి) C అత్తగారు A
సి) C తండ్రి D డి) D తండ్రి C
31. SKOHRILC పదంలోని అక్షరాల స్థానాలను మారిస్తే ఒక పానీయం పేరు వస్తుంది. ఆ పేరులోని మొదటి, చివరి అక్షరాలను సమాధానంగా తెలపండి
ఎ) R, I బి) H, S సి) C, R డి) ఏదీకాదు
32. కింది పదాలను నిఘంటువు ప్రకారం రాసిన తరవాత నాలుగో స్థానంలో వచ్చే పదాన్ని తెలపండి?
1. Honey 2. Heart 3. Home
4. Health 5. Help
ఎ) Help బి) Home
సి) Heart డి) Honey
33. ENVIRONMENT పదంలో వర్ణమాల ప్రకారం ఎన్ని జతలు ఉన్నాయి?
ఎ) నాలుగు బి) మూడు సి) ఆరు డి) ఐదు
34. వర్ణమాలలోని బేసి సంఖ్య అక్షరాలను చిన్న అక్షరాలుగాను, సరి సంఖ్య అక్షరాలను పెద్ద అక్షరాలుగాను రాస్తే జనవరి నెల అక్షరాలు ఎలా ఉంటాయి?
ఎ) JaNuaRy బి)JANuary
సి) JAnuARy డి) ఏదీకాదు
35. వర్ణమాలలోని మొదటి సగం అక్షరాలను అపసవ్యదిశలో రాసి రెండో సగం అక్షరాలను సవ్యదిశలో రాశారు. దీని ప్రకారం కుడి నుంచి పదో అక్షరానికి గల అయిదో ఎడమ అక్షరాన్ని తెలపండి?
ఎ)A బి) B సి) O డి) N
36. అచ్చులు తొలగించిన వర్ణమాల ప్రకారం కచ్చితంగా మధ్యలో గల అక్షరం?
ఎ) L బి) M సి) N డి) P

(37-40)



పై డయాగ్రమ్‌లకు కింది పదాల ప్రకారం సరైన దానిని సూచించండి

37. పురుషులు, తండ్రులు, ఉపాధ్యాయులు
38. వైద్యులు, మహిళలు, ఇంజనీర్లు
39. మానవుడు, న్యాయవాది, కుర్చీ
40. గంట, నిమిషం, సెకను
41. కింది డయాగ్రమ్‌ల ఆధారంగా 2 అంకె గల ముఖానికి ఎదురుగా ఉండే ముఖంలోని అంకె?



ఎ) 5 బి) 6 సి) 3 డి) 1
42. సెప్టెంబరు నెలలో ఏ తేదీకి ఏ వారం వస్తుందో అదే తేదీకి అదేవారం వచ్చే తదుపరి నెల?
ఎ) నవంబరు బి) అక్టోబరు
సి) జనవరి డి) డిసెంబరు

సమాధానాలు

1) ఎ	7) ఎ	13) ఎ
2) సి	8) సి	14) బి
3) బి	9) ఎ	15) సి
4) సి	10) బి	16) బి
5) ఎ	11) ఎ	17) ఎ
6) సి	12) బి	18) సి

19) ఎ	27) సి	35) బి
20) సి	28) ఎ	36) సి
21) బి	29) సి	37) బి
22) బి	30) ఎ	38) డి
23) డి	31) బి	39) సి
24) సి	32) బి	40) ఎ
25) బి	33) సి	41) బి
26) ఎ	34) ఎ	42) డి

ఉద్యోగాలు

ఐజిఐఎంఎస్

పట్నాలోని ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఐజిఐఎంఎస్)- **సీనియర్ రెసిడెంట్/ ట్యూటర్** పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
మొత్తం ఖాళీలు : 57
విభాగాలవారీ ఖాళీలు: అనెస్థీషియా 2, చెస్ట్ & టిబి 1, డెంటిస్ట్రీ 2, ఫోరెన్సిక్ మెడిసిన్ 1, జనరల్ మెడిసిన్ - ఎమర్జెన్సీ 5, జనరల్ సర్జరీ 1, జనరల్ సర్జరీ - ఎమర్జెన్సీ 1, మైక్రో బయాలజీ 1, ఆప్తల్మాలజీ 1, ఆర్థోపెడిక్స్ 1, ఫార్మకాలజీ 1, పీడియాట్రిక్స్ 3, ఫిజికల్ మెడిసిన్ 1, సైకియాట్రీ 1, రేడియాలజీ 6, కార్డియాలజీ 8, కార్డియో థోరాసిస్ వాస్క్యులర్ సర్జరీ 2, నెఫ్రాలజీ 11, న్యూరో మెడిసిన్ 1, న్యూరో సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 1, పీడియాట్రిక్ సర్జరీ 2, యూరాలజీ 1
వయసు: ఆగస్టు 31 నాటికి 35 ఏళ్లు మించరాదు
అర్హత: ఎంసిఐ గుర్తింపు పొందిన సంస్థ నుంచి సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సెంట్రల్/ స్టేట్ మెడికల్ కౌన్సెల్ గుర్తింపు పొంది ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.500
ఇంటర్వ్యూ: ఆగస్టు 21 నుంచి 24 వరకు
వేదిక: Office Chamber of the Director, IGIMS, Patna - 14
వెబ్‌సైట్: www.igims.org

షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

ముంబైలోని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా- **'గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీర్స్'** పోస్టుల భర్తీకి ఉద్దేశించిన జిఎంఇ కోర్స్‌కు దరఖాస్తులు కోరుతోంది. ఇందులో భాగంగా ఎనిమిది నెలల జిఎంఇ షోర్ ట్రైనింగ్, పది నెలల షిప్ బోర్డ్ ట్రైనింగ్ ఉంటుంది. కోర్సు పూర్తిచేసుకొన్న అభ్యర్థులకు **'ఎంఇఒ క్లాస్ 4 పార్ట్ బి'** సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.
సీట్లు: 40(జనరల్ వర్గానికి 20, ఒబిసిలకు 11, ఎస్సీలకు 6, ఎస్టీలకు 3 సీట్లు కేటాయించారు)
క్యాంపస్: SCI' Maritime Training Institute, Powai, Mumbai
కోర్సు ఫీజు: రూ.4,50,000
స్టయిపెండ్: నెలకు రూ.15,000 ఇస్తారు
అర్హత: 50 శాతం మార్కులతో బిఇ/ బిటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు/ ఆఖరు ఏడాది పరీక్షలు రాసి ఆగస్టు 31 నాటికి ఫలితాలు వెలవడే అవకాశం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతి & పన్నెండో తరగతి లెవెల్ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.
వయసు: అక్టోబరు 1 నాటికి 28 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆల్ ఇండియా ఆన్‌లైన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 9న
ఆన్‌లైన్ టెస్ట్ వివరాలు: పరీక్ష సమయం రెండు గంటలు. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, రీజనింగ్ ఎబిలిటీకి సంబంధించిన మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ అడుగుతారు. అభ్యర్థులు ప్రతి విభాగంలో అర్హత సాధించాలి. అర్హులైనవారిని ఇంటర్వ్యూకి షార్ట్‌లిస్ట్ చేస్తారు.
పరీక్ష కేంద్రాలు: ముంబై, న్యూఢిల్లీ, కోల్‌కతా, చెన్నై
దరఖాస్తు ఫీజు: రూ.1000
అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పూర్తిచేసిన దరఖాస్తు ఫారాన్ని ఆర్డినరీ పోస్ట్/ కొరియర్/ స్పీడ్ పోస్ట్/ రిజిస్టర్డ్ పోస్ట్ / బై హ్యాండ్ ద్వారా కింది చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఆగస్టు 23
దరఖాస్తు హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 25
చిరునామా: Vice President I/C, Flee Personnel Dept, Third Floor, The shipping Corporation of India, Shipping House 245, Madame Cama Road, Nariman Point, Mumbai- 400021
వెబ్‌సైట్: www.shipindia.com/careers

గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?

జంతు రాజ్యం, మొక్కలు - ఆర్థిక ప్రయోజనాలు



ఆర్. సురేష్
సీనియర్ ఫ్యాకల్టీ

1. క్రికెట్ బ్యాట్ తయారీలో ఉపయోగించే చెట్టు?
ఎ) విల్లో బి) హాల్లీ సి) హాక్‌బెర్రి డి) వెదురు
2. కింది ఏ రంగులను పత్రాల నుంచి సేకరిస్తారు?
ఎ) ఇండిగో బి) హెన్నా సి) క్లోరోఫిల్ డి) పైవన్నీ
3. ఆహారపదార్థాల్లో రంగుగా ఉపయోగించే అన్నెట్టోను ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) వేరు బి) కాండం సి) విత్తనం డి) పత్రం
4. ఏ చెట్టు నుంచి రబ్బరు తయారు చేస్తారు?
ఎ) ఫైకస్ ఎలాస్టికా బి) కాస్టిల్లా ఎలాస్టికా
సి) హివియా బ్రెసిలెన్సిస్ డి) పైవన్నీ
5. కింది ఏ చెట్టు నుంచి గమ్(జిగురు)ను సేకరిస్తారు?
ఎ) ఫైకస్ బి) అకేసియా సి) పైనస్ డి) పైవన్నీ
6. టర్పెంటైన్‌ను కింది ఏ చెట్టు నుంచి సేకరిస్తారు?
ఎ) విల్లో బి) పైనస్ సి) అకేసియ డి) హివియా

7. 'లవంగం' మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) వేరు
బి) ఫలం
డి) పుష్ప విన్యాసం




8. మిరియాలు మొక్కలోని ఏ భాగం?
ఎ) మొగ్గ బి) ఫలం సి) వేరు డి) కాండం
9. చాక్లెట్ల తయారీలో ఉపయోగించే కోకోవాను మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) ఫలం బి) మొగ్గ సి) విత్తనాలు డి) కాండం
10. కింది ఏ సుగంధ ద్రవ్యాన్ని విత్తనాల నుంచి సేకరిస్తారు?
ఎ) యాలకులు బి) లవంగం
సి) దాల్చిన చెక్క డి) పైవన్నీ
11. గుండె జబ్బు చికిత్సలో ఉపయోగించే ఔషధ మొక్క?
ఎ) యూకలిప్టస్ బి) డిజిలాలిస్
సి) బెల్లడోనా డి) క్వినైన్
12. సింకోనా అనే ఔషధ మొక్కలోని ఏ భాగం నుంచి మలేరియా చికిత్సలో ఉపయోగించే క్వినైన్ అనే ఔషధాన్ని సేకరిస్తారు?
ఎ) వేరు బి) బెరడు సి) పత్రం డి) విత్తనాలు
13. 'ముల్లంగి' మొక్కలోని ఏ భాగం?
ఎ) దుంప కాండం బి) నిల్వ చేసే వేరు
సి) ఫలం డి) పుష్ప విన్యాసం
14. కింది వాటిలో ఏక దళ బీజ మొక్క?
ఎ) చిక్కుడు బి) గోధుమ సి) బఠాని డి) ఏదీకాదు
15. అల్లం : భూగర్భ కాండం :: బీట్‌రూట్ : ....
ఎ) వేరు బి) ఫలం సి) లశునం డి) కొమ్ము
16. కింది వాటిలో చిరుధాన్యం?
ఎ) వరి బి) గోధుమ సి) రాగి డి) పైవన్నీ
17. విత్తన సుప్తావస్థను కలుగజేసే ఫైటోహార్మోన్?
ఎ) ఆక్సిన్ బి) సైటోకైనిన్
సి) జిబ్బరెల్లిన్ డి) అబ్‌సైసికామ్లం
18. కింది వాటిలో సంయుక్త ఫలం ఏది?
ఎ) పైనాపిల్ బి) సీతాఫలం
సి) కొబ్బరి డి) మామిడి
19. గోల్డెన్ రైస్ అనేది ఒక ....
ఎ) కీటక నిరోధకత కలిగిన మొక్క
బి) నీటి ఎద్దడిని తట్టుకోగలిగే మొక్క
సి) బీటా కెరోటిన్‌ను కలిగిన జన్యుపరివర్తన మొక్క
డి) పైవన్నీ

జనరల్ స్టడీస్ - బయాలజీ

20. ఊడ వేర్లను కలిగి ఉన్న చెట్టు?
ఎ) మొక్కజొన్న బి) చెరకు సి) మర్రి డి) పైవన్నీ
21. ఆడమ్స్ ఫిగ్, ఆపిల్ ఆఫ్ పారడైజ్ అనే ప్రతి నామాలు కలిగిన ఫలం?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) సీతాఫలం
22. బంగినపల్లి, సువర్ణరేఖ అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) మామిడి బి) అరటి సి) జామ డి) పైనాపిల్
23. చక్కెరకేళి, అమృతపాణి అనేవి ఏ ఫలంలోని రకాలు?
ఎ) సీతాఫలం బి) జామ సి) మామిడి డి) అరటి
24. స్వర్ణ, మొతి అనేవి ఏ ధాన్యంలోని రకాలు?
ఎ) వరి బి) గోధుమ సి) జొన్న డి) సజ్జ
25. మర్రి చెట్టు జీవితకాలం?
ఎ) 50 సంవత్సరాలు బి) 80 సంవత్సరాలు
సి) 200 - 300 సంవత్సరాలు
డి) 100 - 150 సంవత్సరాలు

26. ఏనుగు సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) $35.9^\circ C$
బి) $25^\circ C$
సి) $42.9^\circ C$ డి) $51^\circ C$



27. కుక్క సాధారణ శరీర ఉష్ణోగ్రత?
ఎ) $125^\circ F$ బి) $84 - 92^\circ F$
సి) $100 - 102.5^\circ F$ డి) $110 - 114^\circ F$
28. గుర్రం సాధారణ శరీర ఉష్ణోగ్రత ఎంత?
ఎ) $99.5^\circ - 101,5^\circ F$ బి) $82^\circ - 85^\circ F$
సి) $74.3^\circ - 76.5^\circ F$ డి) $105^\circ - 107^\circ F$
29. నీలి తిమింగలం గుండె బరువు?
ఎ) 50 కి.గ్రా. బి) 150 కి.గ్రా.
సి) 750 కి.గ్రా. డి) 78 కి.గ్రా.
30. ఏనుగు గుండె సుమారుగా ఎన్ని కిలో గ్రాముల బరువు ఉంటుంది?
ఎ) 12 - 21 కి.గ్రా. బి) 5 - 6 కి.గ్రా.
సి) 35 - 39 కి.గ్రా. డి) 50 - 56 కి.గ్రా.
31. ఏనుగు గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 26 డి) 06
32. నీలి తిమింగలం గుండె నిమిషానికి ఎన్ని సార్లు కొట్టుకొంటుంది?
ఎ) 76 బి) 46 సి) 16 డి) 07
33. జంతువుల్లో ఎత్తయినది ఏది?
ఎ) ఏనుగు బి) జిరాఫీ సి) గుర్రం డి) గేదె
34. జలగ ఏ వర్గానికి చెందిన జీవి?
ఎ) మొలస్కా బి) నిడేరియ సి) అనెలిడా డి) కార్డేటా

35. 'గుడ్లగూబ' ఒక ....
ఎ) పక్షి
బి) క్షీరదం
సి) సరీసృపం
డి) అకశేరుకం



36. కింది వాటిలో స్వీయ మలభక్షక జంతువు?
ఎ) పంది బి) కుక్క సి) కుందేలు డి) ఏదీకాదు
37. సీతాకోకచిలుక జంతురాజ్యంలోని ఏ వర్గానికి చెందుతుంది?
ఎ) ఆర్థ్రోపొడా బి) మొలస్కా సి) అనెలిడా డి) కార్డేటా
38. ఏ జంతువు కంటిలో టపేటమ్ లుసిడమ్ ఉంటుంది?
ఎ) పిల్లి బి) కుక్క సి) గుర్రం డి) పైవన్నీ
39. ఊసరవెల్లి ఏ తరగతికి చెందిన జంతువు?
ఎ) క్షీరదం బి) సరీసృపం
సి) ఉభయచరం డి) అకశేరుకం
40. కింది ఏ జంతువు కళ్లు పరస్పరం స్వతంత్రంగా (రెండోదానితో సంబంధం లేకుండా) పనిచేస్తాయి?
ఎ) ఊసరవెల్లి బి) కుందేలు సి) గుడ్లగూబ డి) పిల్లి
41. కింది ఏ జంతువులో మూడు కనురెప్పలు ఉంటాయి?
ఎ) ఏనుగు బి) ఒంటె సి) గుర్రం డి) జిరాఫీ
42. పిల్లికి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 230 - 250 బి) 310 - 330
సి) 196 - 205 డి) 260 - 270
43. కుక్కకి సుమారు ఎన్ని ఎముకలు ఉంటాయి?
ఎ) 220 - 225 బి) 290 - 296
సి) 319 - 321 డి) 200 - 206
44. ఎక్కువ జీవిత కాలాన్ని కలిగి ఉన్న జంతువు?
ఎ) టర్టిల్ బి) ఏనుగు సి) తిమింగలం డి) పులి
45. పులి జీవితకాలం ఎన్ని సంవత్సరాలు?
ఎ) 30 బి) 10 సి) 45 డి) 12
46. కింది ఏ జంతువు జీవితకాలంలో దంతాలు ఒకసారి మాత్రమే ఏర్పడతాయి?
ఎ) కుక్క బి) మానవుడు సి) ఎలుక డి) పైవన్నీ
47. కింది ఏ జంతువులో రథనికలు, అగ్ర చర్వణకాలు ఉండవు?
ఎ) కుందేలు బి) గేదె సి) ఎలుక డి) పైవన్నీ
48. ఒకే రకమైన దంతాలను కలిగి ఉన్న జంతువు?
ఎ) కుక్క బి) కుందేలు సి) మానవుడు డి) డాల్ఫిన్
49. దంతాలు లేని సరీసృపం?
ఎ) తాబేలు బి) బల్లి సి) టర్టిల్ డి) తాబేలు, టర్టిల్
50. కింది వాటిలో కీటకం?
ఎ) సిల్వర్ ఫిష్ బి) డాగ్ ఫిష్
సి) డేవిల్ ఫిష్ డి) ఏదీకాదు
51. కింది వాటిలో క్షీరదం?
ఎ) గబ్బిలం బి) డాల్ఫిన్ సి) డుడాంగ్ డి) పైవన్నీ
52. జతపరచండి.

1. ఉల్లి	ఎ. కొమ్ము
2. బంగాళదుంప	బి. లశునం
3. అల్లం	సి. దుంపకాండం
	డి. కందం

ఎ) 1-ఎ, 2-బి, 3-డి బి) 1-బి, 2-సి, 3-ఎ
సి) 1-బి, 2-సి, 3-డి డి) 1-ఎ, 2-సి, 3-డి
53. కింది వాటిలో సరైన జత కానిది?

మొక్క	- క్రోమోజోముల సంఖ్య
1. ఉల్లి	- 16
2. వరి	- 24
3. యాపిల్	- 34

ఎ) 1, 3 బి) 2, 3 సి) 3 డి) ఏదీకాదు
54. కుంకుమ పువ్వును మొక్కలోని ఏ భాగం నుంచి సేకరిస్తారు?
ఎ) పుష్పం బి) వేరు సి) బెరడు డి) ఫలం
55. కింది ఏ జంతువు నీరు తాగకుండా ఎక్కువ రోజులు ఉంటుంది?
ఎ) గుర్రం బి) ఏనుగు సి) ఒంటె డి) గేదె

సమాధానాలు

1) ఎ	9) సి	17) డి	27) సి	37) ఎ	47) సి
2) డి	10) ఎ	18) ఎ	28) ఎ	38) డి	48) డి
3) సి	11) బి	19) సి	29) సి	39) బి	49) డి
4) డి	12) బి	20) సి	30) ఎ	40) ఎ	50) ఎ
5) బి	13) బి	21) బి	31) బి	41) బి	51) డి
6) బి	14) బి	22) ఎ	32) డి	42) ఎ	52) బి
7) ఎ	15) ఎ	23) డి	33) బి	43) సి	53) డి
8) బి	16) సి	24) సి	34) సి	44) ఎ	54) ఎ
		25) సి	35) ఎ	45) ఎ	55) సి
		26) ఎ	36) సి	46) సి	

అడ్మిషన్స్

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ వర్కింగ్ ఎగ్జిక్యూటివ్స్ కోసం నిర్వహించే ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి ప్రకటనను విడుదల చేసింది.
ఆఫర్ చేస్తున్న కోర్సులు: ఎంబిఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్- ఈవెనింగ్ సెషన్)
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
ఎంబిఏ (ఈవెనింగ్-పార్ట్‌టైమ్)
ప్రవేశం: టిఎస్‌ఐసెట్-2017 ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 11, 2017
రాత పరీక్ష తేదీ: ఆగస్టు 13, 2017
వెబ్‌సైట్: http://www.ouadmissions.com/

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల

సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్, డిప్లొమా ఇన్ ఆప్టోమెట్రీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఇంటర్మీడియెట్ (బయాలజీ/మేథ్స్, ఫిజికల్ సైన్స్)
వయసు: 17-25 సంవత్సరాలు
దరఖాస్తు: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్ పేరిట రూ.100 డిడిని తీసి నిర్దేశిత చిరునామాకు పంపి దరఖాస్తును పొందొచ్చు. కవర్ మీద అభ్యర్థి వివరాలు రాయాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: సూపరింటెండెంట్, సరోజినీ దేవి నేత్ర వైద్యశాల-హైదరాబాద్,
పిన్: 500028.

బార్క్‌లో డిప్లొమా

బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
సీట్ల సంఖ్య: 30
అర్హత: 60 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ (ఫిజిక్స్)
వయసు: 26 సంవత్సరాలు
దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 21, 2017
రాత పరీక్ష తేదీ: సెప్టెంబర్ 3, 2017
వెబ్‌సైట్: http://www.barc.gov.in/

జెఎన్‌టియు

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు)-హైదరాబాద్, ఎంబిఏ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.
సీట్ల సంఖ్య: 20
అర్హత: 55 శాతం మార్కులతో ఏదైనా నాలుగేళ్ల డిగ్రీ
దరఖాస్తు: ఆఫ్‌లైన్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.1,000
ప్రవేశం: రాత పరీక్ష ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
వెబ్‌సైట్: http://jntuh.ac.in/admissions
చిరునామా: డైరెక్టరేట్ ఆఫ్ ఎగ్జామినేషన్, జెఎన్‌టియూ, కూకట్‌పల్లి, హైదరాబాద్-85.

స్కాలర్‌షిప్

రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్

న్యూఢిల్లీలోని రాష్ట్రీయ శాన్‌స్క్రిట్ సంస్థాన్ - సంస్కృత విద్యాభివృద్ధిలో భాగంగా ఉద్దేశించిన **'మెరిట్ స్కాలర్‌షిప్స్'**నకు ప్రకటన విడుల చేసింది. ఇందుకు ఎంహెచ్‌ఆర్‌డి సహకారాన్ని అందిస్తోంది.
శాన్‌స్క్రిట్/ పాళి/ ప్రాకృత్‌లను మెయిన్/ ఆప్షనల్ సబ్జె క్టులుగా శాన్‌స్క్రిట్ పాఠశాల/ శాన్‌స్క్రిట్ మహా విద్యా లయ/ శాన్‌స్క్రిట్ విశ్వవిద్యాలయాల్లో చదువుతు న్నవా రు అర్హులు. పూర్వ మాధ్యమ(ప్రథమ సంవత్సరం)/ తొమ్మిదో తరగతి పూర్వ మాధ్యమ (రెండో సంవత్సరం)/ పదోతరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(మొదటి సంవ త్సరం), పదకొండో తరగతి ఉత్తర మాధ్యమ, ప్రక్షస్త్రీ(రెండో సంవత్సరం), పన్నెండో తరగతి శస్త్రీ, బిఏ/ ఆచార్య ఎమ్మే/ విద్యావారధి/ పిహెచ్‌డి చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
విద్యా సంస్థల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: ఆగస్టు 30
అభ్యర్థుల స్కాలర్‌షిప్ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ: సెప్టెంబరు 10
వెబ్‌సైట్: www.sanskrit.nic.in, www.scholarship.rsks.in

200 మందికి హోమియో వైద్య సేవలు

పాతవరక(కవిటి రూరల్): పాతవరకలో జగతి హోమియో వైద్యుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు ఆయన చెప్పారు. ఇళ్ల పరిసరాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్ద శ్యాంపురియా పాల్గొన్నారు.





ఈ పాస్‌పుస్తకాలు అందిస్తున్న తహసీల్దార్

పాయితారిలో రెవెన్యూ సభ

ఇచ్ఛాపురం : మండలంలో పాయితారి, కీర్తిపురంలో శుక్రవారం రైతు సేవలో రెవెన్యూ శాఖ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ, అడంగళ్, 1బీ, ఈ పాస్ పుస్తకాలు, పట్టాదారు పాస్ పుస్తకాలు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. భూ రికార్డుల్లో తప్పులుంటే సరిచేసుకోవడానికి ఈ సదస్సులు మంచి అవకాశమని చెప్పారు. అనంతరం ఆరుగురు రైతులకు ఈపాస్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో డీటీ మురళీకృష్ణ, ఆర్ఐ కృష్ణప్రసాద్‌రౌలో, వీఆర్వో సీతారాం, ఏవో నరసింహమూర్తి, గ్రామ పెద్దలు దీనబందు, భారతి పాల్గొన్నారు.

విలువలపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు



మాట్లాడుతున్న నర్తు

కవిటి : రాజకీయాల్లో విలువల గూర్చి మాట్లాడే హక్కు టీడీపీకి లేదని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్తు రామారావు అన్నారు. శుక్రవారం కవిటిలో విలేఖరులతో మాట్లాడారు. నంద్యాలలో జగన్ మాటలను వక్రీకరించి అర్థం లేని ఆరోపణలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పి.ఎం.తిలక్, శ్రీనివాస్, బి.భాస్కర్, వై.అశోక్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అధికారం రాలేదనే బాబుపై జగన్ విమర్శలు

ఇచ్ఛాపురం : అధికారంలోకి రాలేనన్న ఆందోళనతోనే ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్షనేత వైఎస్ జగన్ విమర్శలు చేస్తున్నారని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డుపై కాల్చాన్న మాటలు ఒక్క కంత్రీలే మాట్లాడుతారని ప్రజాస్వామ్యవాదులెవ్వరూ తప్పుడు మాట్లాడరని పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

గోకర్ణపురం(కంచిలి) : సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడలు సాధించవచ్చని ప్రముఖ వైద్యుడు ఐ.కృష్ణమూర్తి తెలిపారు. మండలంలోని గోకర్ణపురంలో సేంద్రియ విత్తనాలను రైతులకు శుక్రవారం పరిచయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోంపేట మండలంలోని పలాసపురానికి చెందిన బీన ఢిల్లీరావు వద్ద ఈ విత్తనాలు సేకరించి ఖరీఫ్ పంటలో వేస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు సాధారణంగా హైబ్రిడ్ విత్తనాలు 30కేజీలకు వరకు అవసరమని చెప్పారు. సేం ద్రియ వ్యవసాయంలో విత్తనాలు అరకేజీ నుంచి కేజీ వరకు వేసుకుంటే సుమారుగా 50 బస్తాలు వరకు దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు. ఆర్గానిక్ బియ్యం వల్ల 475 రకాల పోషక విలువలు ఉంటాయని చెప్పారు.

లక్ష్యాన్ని చేరుకోకుంటే ఉపేక్షించం

టెక్కలిటౌన్: ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకంజలో ఉన్న వెలుగు సిబ్బందిపై డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.కిషోర్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, టెక్కలి, సారవకోట మండలాల వెలుగు ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి కిలోమీటరు దూరంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని, ప్రతి గ్రామంలో ఐదు ఎకరాలకు తగ్గకుండా పశుగ్రాసం పెంచాలని, ప్రతి మండలంలో వంద ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీటి అమలులో ఎవరు అలసత్వం వహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు





సోంపేట దుర్గామాత ఆలయంలో, ప్రగడపుట్టుగ కోదండరామాలయంలో పూజలు, వ్రతాలు చేస్తున్న మహిళలు

సోంపేట : శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీవ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సోంపేట దుర్గామాత ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేపట్టారు. పిండి వంటలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు.

ప్రగడపుట్టుగ(కవిటి రూరల్): మండలంలోని ప్రగడపుట్టుగ కోదండరామ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు కళశాలపై లక్ష్మీదేవి బంగారు ప్రతిమను పెట్టి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. అర్చకులు అంగధరావు మాట్లాడుతూ, శ్రావణ మాసం అత్యంత శ్రేష్టమైనదని, ఈ పూజలు చేయడం వల్ల ఆయురారోగ్యంతోపాటు, ధనధాన్య సౌభాగ్యాలు సమకూరుతాయని తెలిపారు.

ఇచ్ఛాపురం : స్థానిక సత్యసాయిబాబా మందిరంలో శ్రావణమాస పూజలను ఘనంగా నిర్వహించారు.58మంది మహిళలు వ్రతంలో పాల్గొ న్నారు. కుంకుమ పూజలు, అభిషేకాలు, కలశపూజ నిర్వహించారు. పెద్ద జగన్నాథస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడు ప్రసాద్‌సిద్ధాంతి ఆధ్వర్యంలో వరలక్ష్మీకి పూజలు చేశారు.కోదండరామ, సంతోషిమాత ఆలయాల్లో శ్రావణ శుక్రవారం వ్రతాలు చేశారు.

చైనా వస్తువులను బహిష్కరించండి

కవిటి : చైనా దేశానికి సంబంధించిన ప్రతి వస్తువునూ బహిష్కరించాలని ఎస్.వి.జె కళాశాల కరస్పాండెంట్ బి.వి.వి. ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో చైనా అకృత్యాలపై సమావేశం నిర్వహించారు. మన దేశంలో చొరబడేందుకు ప్రయత్నిస్తున్న చైనాకు బుద్ధి చెప్పాలంటే వారు తయారు చేసని వస్తువులను వినియోగించకుండా ఉండాలన్నారు. నాణ్యత లోపించిన నాశిరకం వస్తువులను ఎరచూపి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. రక్షాబంధన్ సందర్భంగా చైనా రాఖీలను కొనుగోలు చేయవద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విజయ్‌నగరం విభాగ్ ప్రచారక్ ఎన్.మధుకర్, కె.లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కరస్పాండెంట్ ప్రసాద్

ఇచ్ఛాపురం : చైనా దేశానికి చెందిన వస్తువులను కొనుగోలు చేయకుండా వారికి గుణపాఠం చెప్పాలని శాంతినికేతన్ హైస్కూల్ చైర్మన్ డి.కృష్ణారావు అన్నారు. శుక్రవారం చైనా వస్తువులకు వ్యతిరేకంగా ఉద్యమం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సేవా ముఖ్య ప్రతినిధి టి.రమేష్ హాజరై మాట్లాడారు. చైనా వస్తువులను కొనుగోలు చేయవద్దని సూచించారు. సమావేశంలో కేసీ పూరి, సురేఖ, పి.శంకర్, పద్మజ,రోజా పాల్గొన్నారు.

రైతు సేవలో భూ సమస్యల పరిష్కారం

● ఆర్డీవో వెంకటేశ్వరరావు

బొప్పాయిపురం(టెక్కలి): రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని సరిచేసుకునే అవకాశం రైతు సేవలో రెవెన్యూశాఖ ద్వారా క ల్పించినట్లు మండల ప్రత్యేకాధికారి, టెక్కలి ఆర్డీవో ఎం. వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఆయన టెక్కలి మండలం బొప్పాయిపురంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. రైతులకు అందజేసిన 1బీల్లో తప్పులు ఉంటే వాటిని గుర్తించి వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేస్తూ మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూముల వివరాలు పక్కాగా ఉండేందుకే ప్రభు త్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వివరించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 13 అర్జీలు స్వీకరించగా, 70 వన్‌బీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఆర్ఐలు బి.వి.రమణ, ఆర్.రామారావు, వీఆర్వో మోహన్, సర్పంచ్ తెలగవలస రాములమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆవల ఉమ పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఆర్డీవో

కలుపు మందుతో ప్రయోజనం

టెక్కలి: ఉబాలు చేస్తున్న రైతులు కలుపు మందు సకాలంలో వేస్తే ప్రయోజనం పొందగలుగుతారని మండల వ్యవసాయాధికారి పూజారి సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. ఉడిచిన మూడు రోజుల్లో ప్రిటిల్లాకోన్ 400 ఎంఎల్, ఆక్సిడైమార్డిల్ 35 గ్రాములు ఇసుకలో కలిపి పొలంలో జల్లాలని సూచించారు. దీనివల్ల ప్రయోజనం ఉంటుందన్నారు.

వైద్య సమాచారం

కంచిలి మండలం ఎంఎస్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని ముండ్ల, కె.బి.నౌగాం, సాగర నౌగాం గ్రామాల్లో శనివారం చందన్న సంచార వైద్య సేవలు అందించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేస్తామని, ఈ సేవల ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు కోరారు.

గ్యాస్ సమాచారం

● సోంపేట శ్రీ సాయి ఏజెన్సీలో ఈ నెల 5న గ్యాస్ బుకింగ్ చేసుకున్న పట్టణ వినియోగదారులకు 6న, రూరల్ ప్రాంత వినియోగదారులకు 7న గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు తెలిపారు.

● ఇచ్ఛాపురం సిద్ధభైరవి గ్యాస్ ఏజెన్సీ ద్వారా మండలంలోని శాసనాం, అరకభద్ర, టి.బరంపురం, జగన్నాథపురం, అయ్యవారిపేట, లొద్దపుట్టి, మశాఖపురం గ్రామాల్లో శనివారం గ్యాస్ సరఫరా చేస్తామని ఏజెన్సీ ప్రతినిధులు వెంకటేష్, రామకోటి తెలిపారు.

సినిమాలు

సోంపేట
శ్రీనివాస.. నక్షత్రం
శివ...... మాయామాల్

ఇచ్ఛాపురం
పూర్ణ .... ఫిదా
శ్రీమణికంఠ... నక్షత్రం

కవిటి
మహాలక్ష్మి.. నక్షత్రం
అశోక్..... ఫిదా

దేవాంగుల నూతన కార్యవర్గం

జింకిభద్ర (సోంపేట) : మండలంలోని జింకిభద్రలో దేవాంగుల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తుల వీరభద్రరావు, పడాల నరేష్, గౌరవ సలహాదారులుగా నిమ్మన దాసు, సప్పటి శివరాం ప్రసాద్‌తోపాటు మరో ఇరవైమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



పీఈటీ నిజాయితీ

దొరికిన సెల్‌ఫోన్ అప్పగింత

ఇచ్ఛాపురం : మండలంలోని శాసనాం ప్రభుత్వ పాఠశాలలో విద్యావలంటీర్ కింద పీఈటీగా విధులు నిర్వహిస్తున్న కె.మోహన్ తనకు దొరికిన రూ.12వేల విలువ చేసే సెల్‌ఫోన్‌ను పోలీసులకు అప్పగించాడు. ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీను తన ఫోన్‌ను రాత్రి పూట పోగుట్టుకున్నాడు. ఈ ఫోన్ మోహన్‌కు దొరకడంతో హెచ్‌సీ జనార్దనకు అప్పగించాడు. శుక్రవారం దీన్ని బాధితుడికి అందించారు.



బాధితుడికి ఫోన్ అందిస్తున్న హెచ్‌సీ

గ్రామాల అభివృద్ధికి కృషి

చిన్నయర్ర గోవింద పుట్టుగ(కవిటి రూరల్): మారుమూల గ్రామాలను అభివృద్ధి చేసేందుకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని సర్పంచ్ శేఖర్ అన్నారు.శుక్రవారం చిన్నయర్రగోవిందపుట్టుగలో రూ.2లక్షలతో మండపం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దుర్యోధన, రమణ, బెన్ను, డొంబురు పాల్గొన్నారు.



మండపం పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

చర్చలతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దలు

ఇచ్ఛాపురం రూరల్: చర్చలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని.. అధికారుల చుట్టూ తిరగడం వలన ఫలితం ఉండదని కేశుపురం సర్పంచ్ నాలాపు చంద్రయ్య అన్నారు. ఈదుపురం సమీపంలోని తులసిగెడ్డలో సన్యాసిపుట్టుగ రైతులు గ్రోయిన్ నిర్మించడంపై ఏడు గ్రామాల రైతులు శుక్రవారం కేశుపురం ముత్యాలమ్మ గుడివద్ద సమావేశమయ్యారు. సన్యాసిపుట్టుగలో దమ్ములయిన వెంటనే నీరు విడిచిపెట్టేందుకు పెద్దల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ చర్చలకు పెద్దలక్ష్మీపురం, చిన్నలక్ష్మీపురం, శివకృష్ణాపురం, డొంకూరు, బూర్జపాడు, సన్యాసిపుట్టుగ, కేశుపురం రైతులు హాజరయ్యారు. గ్రామ పెద్దలు దున్న లోకేష్, పి.గజన్నాథం, ఎం.కృష్ణారావు, వీరాస్వామి, చిరంజీవి, పులకల శ్రీను, దేవరాజు, బి.జానకిరావు, బి.కామాక్షి, ఎన్. ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భావనపాడు మత్స్యకార సంఘ అధ్యక్షుడిగా 'శిర్ల'

భావనపాడు(సంతబొమ్మాళి): భావనపాడు సాగర మత్స్య పారిశ్రామిక సంఘ అధ్యక్షునిగా శిర్ల ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం భావనపాడులో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా బచ్చల గంగాధర్, కార్యదర్శిగా దున్న చలపతిని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా సూరాడ పోలయ్య, చింత కృష్ణమూర్తి, బి.సుందరరావు, తెప్పల కోటేసు, బి.రామస్వామి, గొరకల నారాయణరావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ఎఫ్‌డీవో బి.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోటబొమ్మాళి ఎస్ఐ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో నౌపడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్‌వో శేషగిరి, సర్పంచ్ గురువులు పాల్గొన్నారు.



ప్రకాష్‌కు పత్రాలు అందిస్తున్న దృశ్యం

ముఖద్వారం వద్ద

● ఇచ్ఛాపురం పట్టణ ప్రవేశమార్గంలో దుర్గంధం ● ప్రారంభానికి నోచుకోని డంపింగ్ యార్డు ● రోడ్డు పక్కనే చెత్త నిల్వలు ● తీవ్ర దుర్వాసనతో ప్రజల అవస్థలు

ముక్కు మూసుకోవాల్సిందే

ఇచ్ఛాపురం పట్టణంలోకి ప్రవేశిస్తున్నామంటే చాలు వెంటనే ప్రయాణికులు, ప్రజలు అప్రమత్తమవుతారు. ముక్కుకి, నోటికి చేతి రుమాలను కట్టుకుంటారు. కొందరు చేతులను అడ్డంగా పెట్టుకుంటారు. పట్టణ ముఖద్వారాం వద్ద ప్రధాన రోడ్డు పక్కనే చెత్తను నిల్వ చేయడంతో వర్షానికి కుళ్లి ఆ ప్రాంతం తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అక్కడకు వచ్చేసరికి దుర్వాసనతో ప్రయాణికులు, ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. అంతర్గత రోడ్డు మినహా డంపింగ్ యార్డు పనులు పూర్తయినా ఇంకా ప్రారంభించలేదు. దీంతో మున్సిపాల్టీలోని చెత్తనంతా సేకరించి రోడ్డు పక్కనే పడేస్తున్నారు.



రోడ్డు పక్కనే చెత్త, కుళ్లిన వ్యర్థాలు



ఇచ్ఛాపురం : స్థానిక సిద్ధభైరవి గ్యాస్ ఏజెన్సీ ఎదురుగా శ్మశాన వాటికకు ఆనుకొని ఉన్న స్థలాన్ని డంపింగ్ యార్డు నిర్మాణానికి కేటాయించారు. అయితే, యార్డు పనులు పూర్తయినా అంతర్గత రోడ్డు లేకపోవడంతో ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో మున్సిపల్ సిబ్బంది ప్రతిరోజూ పట్టణంలో సేకరించిన చెత్తను మెయిన్ రోడ్డు పక్కనే యార్డు స్థలంలో డంప్ చేస్తున్నారు. కొందరు వ్యాపారస్థులు కుళ్లిన కూరగాయలు, వ్యర్థాలను కూడా ఆ స్థలంలోనే పడేస్తున్నారు. దీంతో పందులు, పశువులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త కుళ్లిపోవడంతో ఆ ప్రాంతమంతా కంపుకొడుతోంది. ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని ఈ ప్రాంతంలోకి ప్రవేశించాలంటే ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిసార్లు చెత్తను తగలబెట్టే ప్రక్రియలో రహదారిపై పొగ కమ్మేసి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగిన సంఘనటలు ఉన్నాయి.

డంపింగ్ యార్డుని ప్రారంభించేదెప్పుడో?

మూడేళ్ల కిందట డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించి పనులు ప్రారంభించారు. మూడేళ్లు గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఇంకా పూర్తి కాలేదు. 12వ ఆర్థిక సంఘం నిధులు రూ.28లక్షలను డంపింగ్‌యార్డు కోసం కేటాయించారు.

తడి, పొడి చెత్తను వేరు చేసే పల్వరైజర్ యంత్రాన్ని నెలకొల్పేందుకు సేగ్రిగేషన్ షెడ్‌ను రూ.6.85లక్షలతో పూర్తి చేశారు. వర్మీ కంపోస్ట్ తయారీ షెడ్‌ను రూ.6.85లక్షలతో నిర్మించారు. రూ.60 వేలతో బోరు, రూ.1.75 లక్షలతో విద్యుత్ సదుపాయం, రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. కేవలం అంతర్గత రోడ్డు పనులు మాత్రమే మిగిలిఉన్నాయి. డంపిం గ్‌యార్డును ప్రారంభించకపోవడంతో ఈ షెడ్లు మందుబాబులకు నిలయంగా మారాయి. ఇప్పటికైనా డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.





పూర్తయిన సేగ్రిగేషన్, వర్మీ కంపోస్టు షెడ్ల నిర్మాణం

కనీస వేతనం అందేలా చూడండి

కవిటి: ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం అందేలా పనులు కల్పించాలని ఏపీవో కె.భాస్కరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేతనదారులకు రోజుకు రూ.160 వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ 100 రోజుల పనులు చేసేలా చూడాలన్నారు. కుటుంబ సభ్యులందరికీ పనులు కల్పించాలని తెలిపారు. ఒక్కోక్షేత్ర సహాయకుడు నెలకు ఐదు వరకు పంట సంజీవిని పథకం లక్ష్యాలను చేరుకోవాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి వేతనాల పెండింగ్ జాబితాను క్షేత్ర సహాయకులకు అందజేస్తున్నామని, వేతనదారులు వీరిని సంప్రదించి పెండింగ్ బిల్లులు పొందాలని సూచించారు. రైతులు తమ తోటల్లో సరిహద్దు కందాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీవో భాస్కర్‌రావు

ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌కు సంస్కారభారతి విద్యార్థులు

సోంపేట : స్కాలర్‌షిప్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ పథకంలో భాగంగా 2016-17 సంవత్సరానికిగాను సోంపేట సంస్కార భారతి విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన రుంకు ప్రియ, బెండి శ్రీజ, నెమలి ప్రశాంత్‌కుమార్, పచ్చిళ్ల సుప్రజలు ఇన్‌స్పైర్ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు యాజమాన్యం తెలిపింది. వీరికి బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంఎస్ చదువు కోసం సంవత్సరానికి రూ.80వేల చొప్పున అందించున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాల చైర్మన్ వై.దేవరాజు, కరస్పాండెంట్ ఎన్.దాసు, డైరెక్టర్ శ్రీనుబాబు, తదితరులు అభినందనలు తెలిపారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 5, 8

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారుల విషయాలపై దృష్టి సారిస్తారు. సృజనాత్మకంగా వ్యవహరించి వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. పిల్లల విజయం ఆనందం కలిగిస్తుంది.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. చర్చలు, సమావేశాలకు ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు శుభప్రదం. ఇంట్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. సంకల్పం నెరవేరుతుంది.

మిథునరాశి:(మే21-జూన్21): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. మ్యూచువల్ ఫండ్స్, బీమా వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఆర్థిక విషయాల్లో సోదరీ, సోదరుల సహకారం లభిస్తుంది.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక విషయాల్లో భాగస్వామి సహకారం అందుకుంటారు. జన సంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతముల కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్టు23): వ్యవసాయ, పరిశ్రమల రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపిస్తారు. కొత్త పనుల ప్రారంభానికి అనుకూలం. కొత్తగా ఆలోచించి వృత్తి, వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు.

కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23): దూరంలోఉన్న ప్రియతముల నుంచి సంతోషకరమైన సమాచారం అందుకుంటారు. ఉన్నత విద్యకు అవసరమైన నిధులు సమకూరుతాయి. రాజకీయ, సినీ రంగాల వారికి కొత్త ఆలోచనలు స్ఫురిస్తాయి.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): బంధుమిత్రులతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రియతముల ప్రవర్తనలో మార్పు గమనిస్తారు. రియల్ ఎస్టేట్, గృహ నిర్మాణ రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. విద్యార్థులకు లక్ష్య సాధనలో పెద్దల సహకారం లభిస్తుంది. స్టేషనరీ, ఏజెన్సీ, రవాణా రంగాల వారికి శుభప్రదం. సోదరీ, సోదరుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆదాయం పెంపొందించుకునేందుకు కొత్త వ్యూహాలు ఆలోచిస్తారు. సంకల్పం నెరవేరుతుంది. పెట్టుబడులు, పొదుపు పథకాల గురించి సమాచారం సేకరిస్తారు. ప్రయాణాలు, సమావేశాలకు అనుకూలం.

మకరరాశి: (డిసెంబర్22-జనవరి21): పెట్టుబడుల గురించి ఆరా తీస్తారు. బీమా, పింఛన్, మ్యూచువల్ ఫండ్స్ వ్యవహారాలకు అనుకూలం. సంస్మరణల్లో పాల్గొంటారు. ఇన్‌స్టాల్ మెంట్స్‌పై వస్తువులు కొనుగోలు చేస్తారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. బంధుమిత్రులతో ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి. జన సంబంధాలు విస్తరిస్తాయి. శ్రీవారు, శ్రీమతి అంతరంగం తెలుసుకుని మసలుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19-మార్చి20): ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారం అందుకుంటారు. బంధుమిత్రులతో విందు, వినోదాల్లో పాల్గొంటారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, సహకార సంఘాల వారు లక్ష్యాలు సాధిస్తారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

పలాసలో కలకలం


నిందితుడు గణేష్
దొర ఇంటి వద్ద గుమిగూడిన జనం

పలాస: నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై స్పీడ్ బైక్ రేసింగ్ చేస్తుండగా పట్టుకున్న కానిస్టేబుల్‌పై హత్యాయత్నం జరిగింది. తీవ్ర సంచలనం సృష్టించిన ఈ సంఘటన పలాస-కాశీబుగ్గలోని మాజీ ఎంపీ అప్పయ్యదొర నివాసంలో శుక్రవారం చోటుచేసుకుంది. కాశీబుగ్గ డీఎస్పీ సీహెచ్ వివేకానంద అందించిన వివరాల మేరకు... కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఎల్.రోణికేశ్వరరావు (పీసీనెంబర్ 559) విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం పలాస కంచరవీధికి చెందిన కె.గణేష్‌తో పాటు మరో ఇద్దరు బైక్‌పై పరిమితికి మించి, నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాన్ని నడుపుతుండగా గుర్తించారు. వారిని పట్టుకుని బైక్ తాళాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుస్టేషన్‌కు వెళ్లి తగిన ఆధారాలు సమర్పించి వాహనాన్ని తీసుకెళ్లాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో మాజీ ఎంపీ, దివంగత హనుమంతు అప్పయ్యదొర నివాసంలో ఆయన కుమారుడు హనుమంతు విజయ్ కుమార్‌దొర దగ్గరకు కానిస్టేబుల్ రోణికేశ్వరరావు వెళ్లి మాట్లాడుతుండగా కానిస్టేబుల్ బైక్ ఇంటి బయట ఉన్న విషయాన్ని గుర్తించిన గణేష్‌తో పాటు మరో ఇద్దరు ఆగంతకులు లోపలికి వెళ్లి బైక్‌తాళాలు ఇమ్మని నిలదీశారు. దీంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో గణేష్‌తో పాటు మరో ఇద్దరు కత్తి తీసి కానిస్టేబుల్ రోణికేశ్వరరావుపై ఒక్కసారిగా దాడికి దిగారు. హఠాత్పరిణామంతో ఏం చేయాలో పాలుపోక కత్తిని చేతితో అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో మరోమారు కత్తితో నిందితులు దాడి చేయగా రోణికేశ్వరరావు చెవి నుంచి నోటి వరకూ తెగిపోయింది. చేతులు విరిగిపోయాయి. మృతిచెందాడని భావించి నిందితులు పరారవుతుండగా రోణికేశ్వరరావు తీవ్ర రక్తస్రావంతోనే వారిని వెంబడించాడు. వివేకానంద మార్గ్‌లో కాశీబుగ్గ ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వద్దకు వచ్చేసరికి తీవ్ర రక్తస్రావంతో కింద పడిపోయాడు. దీంతో నిందితులు అదే మార్గం గుండా పరారయ్యారు. తొలుత గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఉండవచ్చని అంతా భావించారు. కత్తిగాట్లు కనిపించడంతో హత్యాయత్నం జరిగిందని గుర్తించి కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వివేకానంద సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్ర గాయాలతో ఉన్న రోణికేశ్వరరావును పలాస సీహెచ్‌సీకి తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు ప్రకాశవర్మ, హేమసుందర్ ప్రథమ చికిత్స అందజేశారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో శ్రీకాకుళం కిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం పరిస్థితి తీవ్రంగా ఉందని, 24 గంటలు గడిస్తే గానీ ఏ విషయమూ చెప్పలేమని అక్కడ వైద్యులు నుంచి సమాచారం అందింది.

సంచలనం

ఈ ప్రాంతంలో ఎన్నడూ లేని విధంగా కానిస్టేబుల్‌పై హత్యాయత్నం తీవ్ర సంచలనం కలిగించింది. దాడి సమాచారం అందుకున్న టెక్కలి, ఇచ్ఛాపురం సీఐలు భవానీప్రసాద్, అవతారం, టెక్కలి డివిజన్‌కు చెందిన అన్ని పోలీసుస్టేషన్ల ఎస్‌ఐలు సంఘటనా స్థలానికి చేరుకొని కానిస్టేబుల్ పరిస్థితి చూసి చలించిపోయారు.

ఆది నుంచి నిందితుడే...

హత్యాయత్నానికి పాల్పడినట్టుగా చెబుతున్న గణేష్‌కు గతంలో అనేక నేరాలతో సంబంధం ఉందని తెలిసింది. దొంగనోట్ల వ్యవహారంలో నిందితుడు. అతడితో పాటు పరారైన వారు కూడా నేరప్రవృత్తికలవారేనని పోలీసులు చెబుతున్నారు. వీరి కోసం ప్రత్యేక బృందాలను నియమించి గాలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

విజయ్‌కుమార్‌దొరను విచారించిన పోలీసులు

కానిస్టేబుల్ రోణికేశ్వరరావుపై హత్యాయత్నంలో మాజీ ఎంపీ కుమారుడు విజయ్‌కుమార్‌దొరను కాశీబుగ్గ డీఎస్పీ వివేకానంద ప్రశ్నించారు. ఈ సంఘటన ఎన్ని గంటలకు జరిగింది, ఎంతమంది నిందితులు ఇంట్లోకి ప్రవేశించారు, ఆ సమయంలో గొడవ జరగడానికి కారణాలేమిటని ప్రశ్నించడంతో పాటు ఆయన నుంచి లిఖితపూర్వకంగా వాంగ్మూలాన్ని తీసుకున్నారు. క్లూస్ టీమ్ సాయంత్రానికి చేరుకొని రక్తనమూనాలను సేకరించారు. సంఘటన ఏ విధంగా జరిగి ఉంటుందోనని ఊహచిత్రాన్ని రూపొందించారు. అనంతరం విజయ్‌కుమార్ దొర నుంచి వివరాలు సేకరించారు.

ధర...నిద్దుర

(మొదటి పేజీ తరువాయి)

జరిగేలా చూడాల్సిన గనులశాఖ మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది. ప్రభుత్వ ఆదేశాల అమల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇసుక తవ్వకాలకు సంబంధించి క్యూబిక్ మీటర్ల చొప్పున లోడింగ్‌కు, కిలోమీటర్ల చొప్పున రవాణాకు చార్జీలు నిర్ణయించాల్సి ఉన్నా అది జరగడం లేదు. ఇప్పటికే ఇతర జిల్లాల్లో ఈ ప్రక్రియ వేగంగా సాగుతుంటే జిల్లాలో మాత్రం కనీసం పట్టించుకునే పరిస్థితి లేదు. జిల్లాస్థాయి కమిటీ సమావేశానికి ముందు ధరలపై చర్చించడానికి పంచాయతీరాజ్‌శాఖకు లేఖ రాశామని గనులశాఖ చెబుతుంటే అటువంటి ప్రతిపాదనేదీ తమ వద్దకు రాలేదని ఆశాఖ చెబుతుండటం విశేషం.

ఆదేశాలొచ్చి పదిరోజులైనా...

ప్రభుత్వం గత ఏడాది ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఇసుక తవ్వకాలు పెరిగిపోయాయి. ఎవరికివారు ఎక్కడపడితే అక్కడ తవ్వేసి విశాఖకు తరలించి రెండు చేతులా ఆర్జిస్తున్నారు. ఇప్పటికీ జిల్లా నుంచి విశాఖకు నిత్యం వందల సంఖ్యలో లారీల్లో ఇసుక తరలిపోతూనే ఉంది. జిల్లాలో కూడా ఇసుక ఉచితమైనప్పటికీ ట్రాక్టర్ల యజమానులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారు. దీంతో ఇదేంటని జనం నిలదీసుకునే పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ప్రభుత్వం ప్రజల నుంచి అన్ని జిల్లాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందులో ఉచిత ఇసుక విధానంపై 48 శాతం మాత్రమే ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తే 52 శాతం మంది తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తేలింది. తక్షణ నివారణ చర్యలు చేపట్టిన సీఎం జిల్లాస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, ఎస్పీ, రవాణాశాఖ ఉప కమిషనర్, జలవనరులశాఖ ఈఈ, గనుల శాఖ ఏడీలను సభ్యులుగా నియమిస్తూ గత నెల 25న జీవో జారీ చేశారు. ఈ కమిటీ తక్షణం సమావేశమై ఉచిత ఇసుక విధానంలో లోటుపాట్లను సవరించి క్యూబిక్ మీటర్ల చొప్పున లోడింగ్‌కు, కిలోమీటర్ల చొప్పున రవాణాకు చార్జీలు నిర్ణయించాల్సి ఉన్నారు. లోడింగ్, అన్‌లోడింగ్, ఇసుక ర్యాంపు నిర్వహణ, రవాణా చార్జీలు, దూరం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇసుకకు సాధారణ ధర నిర్ణయించాలని ప్రస్తావించారు.



ప్రతినెలా ఈ కమిటీ ధరలు అమలు తీరుతెన్నులను పరిశీలించాలని కూడా స్పష్టం చేశారు. మండలస్థాయిలో రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ తదితర విభాగాల సిబ్బందిని టాస్క్‌ఫోర్స్ బృందంగా నియమించి ధరల అమలుపై పరిశీలించాలన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడం, యూనిట్ ధర నిర్ణయంలో జిల్లాస్థాయి కమిటీకి పూర్తి అధికారాలను కట్టబెడుతూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఉత్తర్వులు వెలువడి పదిరోజులవుతున్నా ఇంతవరకు కమిటీ ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. గనులశాఖ దీనికి బాధ్యత వహించి సమన్వయం చేసుకోవాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీనిపై గనులశాఖ అధికారులను సంప్రదిస్తే జిల్లాస్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉందని, త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. లోడింగ్, దూరం ఆధారంగా రవాణా చార్జీలు ఎంత వసూలు చేయాలనేది తేల్చడానికి పంచాయతీరాజ్‌శాఖకు లేఖ రాశామని, వారి నుంచి ప్రాథమిక ధరలు వచ్చాక జిల్లా స్థాయి కమిటీలో చర్చిస్తామన్నారు. కాగా గనులశాఖ నుంచి ధరల ప్రతిపాదనలపై ఎలాంటి లేఖ రాలేదని పీఆర్ అధికారులు అంటున్నారు.

ఎన్ని రీచ్‌లకు వర్తింపజేస్తారో?

జిల్లాలో 18 ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. కానీ విశాఖ అవసరాల పేరుతో పలువురు వ్యాపారులు అడ్డగోలుగా తవ్వి రవాణా చేస్తున్నారు. మొదట్లో లారీలను అడ్డుకునేందుకు పిలక పాలెం టోల్‌గేట్ వద్ద చెక్‌పోస్టు ఏర్పాటుచేసినా ఆతర్వాత ఎత్తేశారు. దీంతో ఇప్పటికీ విశాఖకు రవాణా సాగిపోతోంది. దీంతో అప్పటి కలెక్టర్ లక్ష్మీనృసింహం విశాఖకు ఇసుక రవాణా జరగకుండా గట్టి ఆదేశాలిచ్చారు. అక్కడి నుంచి స్వయంగా గనులశాఖ సిబ్బంది వచ్చినా రీచ్‌ల కేటాయింపునకు అంగీకరించలేదు. కానీ ప్రస్తుతం భారీగా అక్రమ మార్గంలో తరలిపోతూనే ఉంది. మరి ధరల నిర్ణయం జరిగాక పరిస్థితి ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.

ఇక సొంతమే!

(మొదటి పేజీ తరువాయి)

పేద కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. దీంతో జిల్లాలోని శ్రీకాకుళం నగర పాలక సంస్థ, మూడు పురపాలక సంఘాలు, రెండు నగర పంచాయతీలతో పాటు 38 మండలాల పరిధిలోని 1800 రెవెన్యూ గ్రామాల్లో బడుగులకు ప్రభుత్వం తీపి కబురు అందించినట్లయింది. తాము ఇల్లు నిర్మించుకుని దీర్ఘకాలంగా నివసిస్తున్నట్టు ధ్రువీకరణ చూపితే ఎలాంటి ఆంక్షలు, రుసుం చెల్లించనవసరం లేకుండా ఆ స్థలాన్ని వారికి సొంతం చేసేలా ప్రభుత్వం నిర్ణయించింది.


రుసుంతో...

పేదలకే కాకుండా దారిద్ర్యరేఖకు ఎగువనున్న కుటుంబాలు(ఏపీఎల్) కూడా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని భవనాలు నిర్మించుకుంటే వారికీ అవకాశం కల్పించింది. కాకపోతే వారికి కొంత రుసుం విధించాలని నిర్ణయించింది. వంద గజాల్లోపు ఆక్రమించుకున్న ఏపీఎల్ కుటుంబాలకు బేసిక్ విలువలో 7.5 శాతం, 101 నుంచి 250 గజాల వరకూ బేసిక్ విలువలో 15 శాతం, 251 నుంచి 500 గజాల్లోపు బేసిక్ విలువలో 30 శాతం వసూలు చేస్తారు. ఇది కూడా మంచి అవకాశం. ప్రస్తుతం జిల్లా కేంద్రంతో పాటు పాలకొండ, టెక్కలి, రాజాం, నరసన్నపేట, పలాస పట్టణాల్లో నివాస స్థలాల ధరలు ఆకాశంలో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో నామమాత్రపు ఫీజు చెల్లించి ప్రభుత్వ స్థలాన్ని సొంతం చేసుకునే అవకాశం వినియోగించుకోవాలి. ప్రభుత్వస్థలంలో రూ.లక్షలు వెచ్చించి గృహాలు నిర్మించుకుని ఆక్రమణదారులుగా నిర్ధారణైతే భూమిని స్వాధీనం చేసుకోవడం, భవనాలను కూల్చివేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. దీంతో ఆక్రమణదారుల్లో తీవ్ర అభద్రత ఉండేది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వీరందరికీ ఊరట కలుగుతోంది. ఈ తరహాలో జిల్లా వ్యాప్తంగా కనీసం ఐదు వేల కుటుంబాలుంటాయని రెవెన్యూ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదిలా ఉండగా 500 గజాలకు మించి ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారిపై వేటు వేసి, ఆక్రమణలు తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో గతంలో రాజకీయ అండదండలు, ప్రభుత్వ సిబ్బందికి ముడుపులు చెల్లించి గడిపేస్తున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఉత్తర్వులు వచ్చిన వెంటనే గుర్తింపు

ఈ విషయమై జిల్లా రెవెన్యూ అధికారి నటుకుల సత్యనారాయణ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల ఆక్రమణల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే లబ్ధిదారులను గుర్తిస్తామన్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకెళ్తామన్నారు.

దారి కనుక్కోండి



సూక్తి

కోపం తెచ్చుకునే హక్కు ఎవరికైనా ఉండొచ్చు.. కానీ ఆ కోపంలో క్రూరంగా ప్రవర్తించే హక్కు మాత్రం ఎవరికీ లేదు.

టంగ్ ట్విస్టర్స్



1. If you're keen on stunning kites and cunning stunts,buy a cunning stunning stunt kite.
2. Sounding by sound is a sound method of sounding sounds.
3. Real rock wall, real rock wall, real rock wall



'పోలార్ పార్క్'లోకి అడుగుపెట్టగానే.. ముఖ్య అతిథిపై పూల వర్షం కురిపించినట్లు...వెన్నెల్లాంటి మంచు జల్లులా కురుస్తుంది. చాలా రోజుల తర్వాత కలిసినా ఆత్మీయుల్లా క్రూర మృగాలు ఆలింగనం చేసుకుంటాయి. ఎంతో ప్రేమతో ముద్దిస్తాయి. స్నేహితుల్లా కలిసిపోతాయి. వాటిని వదిలిపోతుంటే. దీనంగా చూస్తుంటాయి.. ఈ పార్కుకు మీకు వెళ్లాలనుందా? అయితే చలో నార్వే!



ప్రేమతో ముద్దిచ్చే తోడేళ్లు

పోలార్ పార్కు దీన్నే 'పోలార్ జూ'గా కూడా పిలుస్తారు. ఇది 'ట్రోమ్స్' అనే చిన్న దేశంలో ఉంది. నార్వేలోని ప్రసిద్ధ పార్కుగా పేరు పొందింది. ఈ పార్కును 1994, జూన్ 18న ప్రారంభించారు. ఎలుగు బంట్లు, నక్కలు, తోడేళ్లు, పెద్ద అడవి పిల్లి(శివంగి), ధ్రువపు జింకలు, మూస్(లేడి వంటి జంతువు), ఎరుపు జింక, బ్రౌన్ ఎలుగుబంటి జంతువులు ఈ పార్కులో స్వేచ్ఛగా తిరుగాడుతుంటాయి. 112 ఎకరాల్లో ఉన్న ఈ పార్కుల్లో 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కుకు 12 కిలోమీటర్ల దూరంలోనే 'రోహ్‌కున్ బొర్రి నేషనల్ పార్కు' ఉంది.

సెల్ఫీలకు పోజులు!

ఇక్కడి పార్కులోని తోడేళ్లు మనుషుల్ని చూసి భయపడవు. మనుషుల సమక్షంలో అవి ఆనందంగా గడుపుతాయి. సందర్శకులు తోడేళ్లతో ఎంచక్కా ఆడుకోవచ్చు. మనుషులతో అవి ఇట్టే కలిసిపోతాయి. ప్రేమతో ముద్దులు కూడా ఇస్తాయి. చుట్టూ చేరి తెగ సందడి చేస్తాయి. సెల్ఫీ తీస్తుంటే.. అందమైన పోజులిస్తాయి. అమ్మ ఒడిలో పడుకున్నట్లు.. వాటిపై హాయిగా పడుకున్నా అవి ఏమనవు. మిగతా జంతువులు కూడా సందర్శకులను ఏమీ చేయవు. సందర్శకులు వీటిని మచ్చిక చేసుకోవడానికి తోడేళ్ల ఎన్‌క్లోజర్‌లో గంటపాటు గడపవచ్చు. ఒక రోజు మొత్తం కూడా వాటిలో ఉండొచ్చు. మీతో పాటు తోడేళ్ల శిక్షకులు కూడా ఉంటారు. వాటితో ఎలా మెలగాలో, ఎలా మచ్చిక చేసుకోవాలో వారు సూచిస్తారు. అత్యుత్సాహంతో వాటిని బెదరకొట్టకూడదు. అవి దగ్గరికి వచ్చినప్పుడు నిండైన ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎందుకంటే అవి భయాన్ని పసిగడతాయి. ఒక్కసారి మచ్చిక అయితే పెంపుడు జంతువుల్లా ఉంటాయి.



మొబైల్ రైడ్..

ప్రకృతి ప్రేమికులకు ఈ పార్కు వీనుల విందే. పార్కులో ఎటూ చూసినా అందాలే. మంచు దుప్పటి కప్పుకున్న పర్వతాలను,రకరకాల జంతువులను చూస్తూ... ఎరుపెక్కిన సూరీడు అందాల మాటున స్నో మొబైల్ వ్యానులో షికారు భలేగా ఉంటుంది.

ఎన్నో అరుదైన జంతువుల మధ్యలో హాయిగా గడపడం..ఓ అనిర్వచనీయమైన అనుభూతి. ఈ పార్కుకు వెళ్లాలంటే ఒకే ఒక్క కండీషన్. అదేంటంటే 15 సంవత్సరాల వయసు దాటిని వారినే ఇందులోకి అనుమతిస్తారు.

రంగులు వేయండి



నవ్వుల్ నవ్వుల్



తండ్రి : ఏరా! ఎన్నిసార్లు ఫోన్ మోగుతున్నా ఎత్తడం లేదు ఎందుకని?
బన్ను : నాన్నా! నన్ను డాక్టర్ బరువులు ఎత్తొద్దని చెప్పారు. అందుకనే!
తండ్రి : !!!!!!!!

=======

టీచర్ : టీవీ వల్ల హింసలు పెరుగుతున్నాయిట నిజమేనా?
చిన్ను : అవును టీచర్ నిజమే! నేను ఎప్పుడు టీవీ ఆన్ చేసినా మా నాన్న నన్ను కొట్టినంత పని చేస్తున్నారు.

చెప్పగలరా?

కూడులో ఉన్నా కానీ గూడులో లేను

తుదిలో ఉన్నా కానీ ఆదిలో లేను

రుచిలో ఉన్నా కానీ శుచిలో లేను

అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి


1. హాఆరం ▸ ....
2. ధుమరం ▸ ....
3. చాతిమం ▸ ....

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. DSIE ▸ ....
2. FODO ▸ ....
3. RPEO ▸ ....

బొమ్మ గీయండి



మీకు తెలుసా?



సిగరెట్ లైటర్‌ని అగ్గిపుల్ల కంటే ముందే కనిపెట్టారు.


ఔనా!

స్టార్ ఫిష్‌కు మెదడు ఉండదు.

జవాబులు

చెప్పగలరా? :
కూతురు
జంతర్‌మంతర్ :
1. ఆహారం
2. మధురం
3. చామంతి
జంబ్లింగ్ వర్డ్స్ :
1.SIDE
2.FOOD
3.ROPE

చుక్కలు కలపండి



అనుబంధాలకు గుర్తుగా..



ఆకట్టుకునే ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు

జిల్లాలో రాఖీలు, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ల విక్రయాలు జోరందుకున్నాయి. ఈనెల 6న స్నేహితుల దినోత్సవం, 7న రాఖీ పౌర్ణిమ సందర్భంగా మార్కెట్లో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు, రాఖీల సందడి చేస్తున్నాయి. మహిళలు, యువతను ఆకట్టుకునే విధంగా వ్యాపారులు వివిధ రకాల రాఖీలు, బ్యాండ్‌లను అందుబాటులో ఉంచారు. రాఖీలు రూ.5 నుంచి రూ.200 ధరల్లో లభ్యమవుతున్నాయి. గ్రీటింగ్ కార్డులు రూ.10 నుంచి అందుబాటులో ఉన్నాయి. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు రూ.10లు నుంచి రూ.500 వరకు పలుకుతున్నాయి. - (పాలకొండ టౌన్)



రాఖీలు కొనుగోలు చేస్తున్న విద్యార్థులు







ఉపాధి అనుసంధానంతో అభివృద్ధి

● పనులు వేగంగా పూర్తి చేయండి ● జాప్యమైతే కఠిన చర్యలు తప్పవు ● కలెక్టర్ ధనుంజయరెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి, హాజరైన అధికారులు

కలెక్టరేట్: ఉపాధి హామీ పథకం నిధులు పలు శాఖలకు అనుసంధానం చేయటం వల్ల గ్రామాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఉపాధి అనుసంధాన ప్రగతి పనులపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిధులు అనుసంధానంతో చేపట్టిన పనుల వల్ల జిల్లా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని, అధికారుల సమన్వయంతో పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అదేశించారు. నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, పంచాయతీ, అంగన్‌వాడీ, మండల పరిషత్, రెవెన్యూ తదితర కార్యాలయ భవనాలు నిర్మించవచ్చని తెలిపారు.

జిల్లాలో 490 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేయాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు 60 కిలోమీటర్లు నిర్మించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా రోడ్లు నిర్మాణం చేయాల్సిన గ్రామాలను గుర్తించి, ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ కోరారు. అంగన్‌వాడీ, పంచాయతీ భవనాల నిర్మాణంలో జాప్యం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇప్పటివరకు 110 అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేశారని, కొన్ని వివిధ దశల్లో ఉండగా, మరికొన్ని ప్రారంభం కాలేదు. పంచాయతీ భవనాల నిర్మాణం సర్పంచ్‌లతో కలిసి త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్లకు ఇరు వైపులా మొక్కలు నాటే కార్యక్రమం, పాఠశాలల క్రీడా మైదానాలు అభివృద్ధి చేయాలన్నారు. నిధులు సకాలంలో ఖర్చు చేయకపోతే వెనక్కి పోయే పరిస్థితి ఉంటుందని, ప్రతి శాఖకు సంబంధించి పనులు ప్రగతి నివేదిక అందించాలని అదేశించారు. జాప్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ కూర్మారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ జీసీ కిషోర్ కుమార్, పశుసంవర్ధక శాఖ జేడీ ఎం.వెంకటేశ్వరరావు, ఉద్యానవన ఏడీ ఎంఏ రహీమ్, డీపీవో కోటేశ్వరరావు, ముఖ్య ప్రణాళికాధికారి ఎం.శివరామ నాయకర్, ఐసీడీఎస్ పీడీ కె.లీలావతి, డీఎఫ్‌వో బి.ధనుంజయరావు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలి

శ్రీకాకుళం సిటీ: తెలుగు, హిందీ, ఒరియా భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని సంఘం జిల్లా ప్రతినిధులు కలెక్టర్ కె.ధనుంజయ రెడ్డికి గురువారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. మూడు దశాబ్దాలుగా భాషాపండితులకు పదోన్నతులు లేవని, ఫిబ్రవరిలో పదోన్నతులు ఇస్తున్న సందర్భంలో ఎస్జీటీలు కోర్టుకు వెళ్లి నిలుపుదల చేశారని, ఇదే విషయమై తాము న్యాయస్థానానికి వెళ్లగా, భాషాపండితులు అర్హులు అని నిర్ధారిస్తూ తీర్పును ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ తరుణంలో భాషాపండితులకు పదోన్నతులు చేపట్టాలని ఉత్తర్వులు ఇచ్చారని, ఇంతవరకు జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకోలేదని తెలిపారు. తక్షణమే పదోన్నతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్ఎల్‌టీఏ అధ్యక్షుడు పి.వసంతరావు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.అప్పలరాజు, ఆర్‌యూపీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మల్లేషు, పద్మావతి తదితరులు ఉన్నారు.



రూ.పది నాణేలపై సందేహాలు వద్దు

● ఆర్‌బీఐ స్పష్టత ● త్వరలో గ్రామాల్లో మేళాలు, సదస్సులు

(శ్రీకాకుళం సిటీ)

రూ.పది నాణేల చలామణిపై రిజర్వ్ బ్యాంక్ మరోసారి స్పష్టత ఇచ్చింది. సాక్షాత్తూ ఆర్‌బీఐ ముద్రించిన నాణేలపై అపోహలు సరికాదని, ప్రజలు సందేహాలు వీడాలని సూచించింది. ఈ విషయాన్ని ప్రజలకు వివిధ రూపాల్లో చైతన్యపరచాలని బ్యాంకర్లకు ఆదేశించింది.

ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా రూ.10 నాణేలు దాదాపు చెల్లుబాటు కావడం లేదు. వీటిని తీసుకోవడానికి వ్యాపారులే కాకుండా ఆర్టీసీ సిబ్బంది కూడా నిరాకరిస్తున్నారు. దీంతో నాణేల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

పేదల వద్ద పది నాణేలు ఉన్నా.. చెల్లుబాటు కాకపోవడం, చెల్లనివి పరిగణిస్తుండడంతో ఏం చయాలో పాలుపోలేదు. చివరకు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తీసుకునేందుకు నిరాకరిస్తుండడంతో ఇక రూ.పది నాణేలు చెల్లవని నిర్ధారణకు వచ్చారు. తాజాగా రిజర్వ్ బ్యాంక్ మరోసారి నాణేల చలామణిపై స్పష్టత ఇవ్వడంతో ఇప్పటికైనా ప్రజలు, వ్యాపారులు జాగృతం కావాల్సి ఉంది. పెద్ద సమస్యగా మారిన రూ.పది నాణేల మనుగడ సాక్షాత్తూ అత్యున్నత బ్యాంకు ఇచ్చిన స్పష్టత కనువిప్పుగా భావించాల్సి ఉంది.

ఇదిలా ఉండగా రూ.పది నాణేల చెల్లుబాటుపై బ్యాంకులు గ్రామస్థాయిలో ప్రజలను జాగృతం చేసేందుకు చైతన్య సదస్సులు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాయి. మరో పక్క నాణేల మేళా నిర్వహించాలని రిజర్వ్ బ్యాంక్ వివిధ బ్యాంకులకు సూచనలిచ్చింది. త్వరలో ఈ ప్రక్రియ జిల్లాలో ప్రారంభం కానున్నట్టు వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఆత్మ రక్షణకు తైక్వాండో అవసరం

● ఎస్పీ త్రివిక్రమ వర్మ ● జాతీయ స్థాయి పోటీల విజేతలకు అభినందన

(శ్రీకాకుళం సిటీ)

విద్యతో పాటు ఆత్మరక్షణకు తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్ అవసరమని ఎస్పీ త్రివిక్రమ వర్మ అన్నారు. ఇటీవల భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్-3 తైక్వాండో పోటీలో జిల్లాకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ చూపారు. వివిధ వెయిట్ కేటగిరీల్లో నాలుగు పతకాలు సాధించగా, ఇందులో బాలికల విభాగంలో వైశ్యరాజు జాష్మిని రజత పతకం, బాలుర అండర్-41 కిలోల విభాగంలో బూర్ల శ్రీచిత్, అండర్-45 కిలోల విభాగంలో వైశ్యరాజు మదన్, అండర్-49 కిలోల విభాగంలో మూర్తి సాయిబాలాజీ కాంస్య పతకాలు సాధించారు. వీరిని శుక్రవారం ఎస్పీ వర్మ జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ప్రాణ రక్షణకు తైక్వాండో దోహదపడుతుందని, క్రీడలు మానసిక, శారీరక ఎదుగుదలకు తోడ్పడుతాయని తెలిపారు. తైక్వాండో క్రీడాకారులకు విద్య, ఉద్యోగాలకు క్రీడా కోటాలో రిజర్వేషన్ ఉన్నట్టు చెప్పారు. ముఖ్యంగా ఎనిమిదో తరగతి చదువుతున్న వైశ్యరాజు జాష్మిని బాలికల విభాగంలో జాతీయ స్థాయిలో రజత పతకం సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను, జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, డీఎస్‌డీవో బడి శ్రీనివాస్‌కుమార్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, కోచ్‌లు ఎన్.రవి, పుక్కళ్ల నవీన్, మజ్జి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిసున్న ఎస్పీ త్రివిక్రమవర్మ

సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయండి

శ్రీకాకుళం సిటీ:ప్రజలు ఎటువంటి సమస్యలు ఎదురైనా నేరుగా తనకు ఫిర్యాదుచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పీఏ శోభ సూచించారు. ఆమె శుక్రవారం నగరంలోని బాదుర్లపేట, మావూరువీధి, హౌసింగ్‌బోర్డ్‌కాలనీలో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ఇంటింటా చెత్త సేకరణ గురించి తెలుసుకున్నారు.. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా, సమస్యలు ఎదురైనా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కమిషనర్‌తో పాటు పర్యావరణ డీఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.



కిరీటం అందిస్తున్న దృశ్యం

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ

వాకలవలస(శ్రీకాకుళం రూరల్) : వాకలవలస లంకాం సమీపంలోని దుర్గమ్మవారికి విజయనగరానికి చెందిన శ్రీనివాసరావు, ఉషారాణి దంపతులు వెండి కిరీటాన్ని బహూకరించారు.శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాసరావు దంపతులు వెండి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా కుంకుమాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసరావు గోత్రనామాలతో పూజలు చేయించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారికి వెండి కిరీటం అందించడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి అన్నివిధాలా చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

శ్రీకాకుళం రైతుబజార్ ధరలు

కూరగాయలు	ధర(కిలో) రూ...
టమోటా	రూ. 46
వంకాయలు	రూ. 33
బెండకాయలు	రూ. 32
పచ్చిమిర్చి	రూ. 55-62
బీరకాయలు	రూ. 26
కాలీఫ్లవర్	రూ. 35
క్యాబేజీ	రూ. 16
క్యారెట్	రూ. 26
దొండకాయలు	రూ. 30
పచ్చిబఠాని	రూ. 32
ఉల్లి	రూ. 20
బీన్స్	రూ. 45
గోరుచిక్కుడు	రూ. 34
బంగాళదుంప	రూ. 12
అరటికాయ(జత)	రూ. 18
చామదుంప	రావడం లేదు
ఎర్రదుంపలు	రూ. 25
నూల్‌కోల్ దుంప	రూ.20
బీట్‌రూట్	రూ. 29
కీర	రూ. 25
ఫ్రెంచ్‌బీన్స్	రూ. 40
కాకరకాయలు	రూ. 28
అల్లం	రూ. 50
గోల్కొండచిక్కుల్లు	రూ. 34-42
స్వీట్‌పొటాటో	రూ. 16
వెల్లుల్లి	రూ. 55
క్యాప్సీకం	రూ. 50

ప్రమాదపు చదువులు..!

కనీస రక్షణ చర్యలు లేకుండా ఆటోల్లో పాఠశాలలకు చిన్నారుల తరలింపు

బాధ్యతారాహిత్యంగా యాజమాన్యాలు

తల్లిదండ్రుల్లో అవగాహన లోపం

ప్రమాదం జరిగినప్పుడు కారణాల అన్వేషణకే యంత్రాంగం పరిమితం

(శ్రీకాకుళం-కలెక్టరేట్)

ప్రభుత్వ విద్య బలోపేతానికి యంత్రాంగం చర్యలు చేపడుతున్నా... ప్రభుత్వ విద్యాసంస్థల్లో రాయితీలు కల్పిస్తున్నా ఫలితం లేకపోతోంది. పట్టణం నుంచి పల్లెల వరకూ అంతా ఇప్పుడు కాన్వెంట్ చదువులు ఫ్యాషన్‌గా మారాయి. ఒకరిని చూసి ఒకరు ప్రైవేటు విద్యాసంస్థల్లో చేర్పించేస్తున్నారు. అక్కడ కల్పిస్తున్న సదుపాయాలేమిటి? నిబంధనలు పాటిస్తున్నారా? ప్రభుత్వ అనుమతి ఉందా? పిల్లలకు రక్షణెంత అన్నది ఎవరూ ఆలోచించడం లేదు. ముఖ్యంగా ప్రమాదకరస్థితిలో ఆటోల్లో చిన్నారులను తరలిస్తున్నారు. వెనుక, ముందు, పక్కల్లో వేలాడుతూ చిన్నారులు ప్రయాణిస్తున్నారు. దీనికితోడు కిలోలకు కిలోలు బరువుండే బ్యాగులు ఒకపక్క, క్యారీయర్లు మరోపక్క వేలాడదీస్తూ ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నారు.

● అనుమతులు లేవు

కార్పొరేట్ పాఠశాలలు బస్సులు ఏర్పాటు చేసుకుంటున్నాయి. చిన్న పాఠశాలలు మాత్రం తగినంత మంది పిల్లలు ఉండకపోవడంతో ఆటోల్లో తరలిస్తున్నారు. ఇలా తరలిస్తున్న ఆటోలకు సంబంధించి రవాణా శాఖ నుంచి అనుమతులు లే వు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం చిన్న ఆటోలకైతే డ్రైవ ర్లతో కలిపి నలుగురు ప్రయాణం చేసే అవకాశం ఉంది. పెద్ద ఆటోలకైతే డ్రైవర్‌తో కలిసి ఏడుగురు వరకూ ప్రయాణం చే యాల్సి ఉంటుంది. ఆటోకు చుట్టూ రక్షణ సౌకర్యాలు కూడా కల్పించాలి. కానీ శ్రీకాకుళం నగరంలో ఇవెక్కడా పాటిస్తున్న దాఖలాలు లేవు. చిన్నారులను ఆటోలో కుక్కి తరలిస్తున్నారు.

● ముందస్తు చర్యలు అవసరం

నిబంధనలకు విరుద్ధంగా నడిపే ఆటోలపై పోలీసులు కానీ...రవాణా శాఖ అధికారులు కానీ దృష్టిసారించడం లేదన్న విమర్శలున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రమాదం జరిగిన తరువాత కారణాలను అన్వేషిస్తుంటారు. అంతేకానీ ముందస్తు అవగాహన కల్పించడం ద్వారా తల్లిదండ్రులకు....హెచ్చరికలు ద్వారా ఆటోడ్రైవర్లకు కట్టడి చేయవచ్చు. కానీ ఇదేమీ చేసినట్టు కనిపించడం లేదు. ఫలితంగా నగర, గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదకర ప్రయాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో కిక్కిరిసి ప్రయాణం చేస్తున్న విద్యార్థులు



బ్యాగుల మధ్య ఇబ్బందిగా...



కాలుజారితే అంతే..

ఉపాధ్యాయ బదిలీల్లో కొంత మోదం..కొంత ఖేదం

శ్రీకాకుళం సిటీ: ఉపాధ్యాయ బదిలీలు కొంత మోదం... కొంత ఖేదమని.... ఉపాధ్యాయులకు మిశ్రమఫలితాలు లభించాయని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతల దుర్గారావు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో జిల్లాస్థాయి సర్వసభ్యసమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పల డేనియల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ సుదీర్ఘ పోరాటం, ఎన్నో ప్రభుత్వ ఉత్తర్వులు, క్లారిఫికేషన్లతో గత రెండునెలలుగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ సాగిందన్నారు. ఇబ్బందులు ఎదురైనా గురువారంతో ముగియడం ఆనందంగా ఉందన్నారు. సుమారు 13 రోజులు రేయింబవళ్లు శ్రమించిన విద్యాశాఖాధికారులకు రాష్ట్ర, జిల్లా ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఇంత సుదీర్ఘకాలం బదిలీల ప్రక్రియ జరపడం రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమమన్నారు. రాష్ట్రస్థాయి విద్యాశాఖాధికారులు పూటకో జీవో విడుదల చేస్తూ భాషాపండితుల విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోవడం... ప్రతిభా పాయింట్లు, హేతుబద్ధీకరణ..కేటగిరీ పాయింట్లలో పూర్తిగా విఫలం కావడం... జీవో నెంబర్ 50ను అర్ధాంతరంగా తీసుకొచ్చి ఉపాధ్యాయులను గందరగోళంలో పడేయడం కొంత ఇబ్బంది కలిగించిందన్నారు. కౌన్సెలింగ్ హాల్‌లోనికి ఉపాధ్యాయ సంఘాలను అనుమతించకపోయినా ఇటు ఉపాధ్యాయులకు, విద్యాశాఖాధికారులకు సంయమనంతో సహకారాన్ని అందించిన సంఘాల ప్రతినిధుల పాత్ర మరువలేనిదన్నారు. సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు భూపతి రవికుమార్, సంయుక్త కార్యదర్శి జగన్నాథం, ప్రతినిధులు రాజు, రాజారావు, సంజీవరావు, ఆదినారాయణ, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బీమా ఏజెంట్లకు దరఖాస్తుల ఆహ్వానం

డేఅండ్‌నైట్ జంక్షన్ : శ్రీకాకుళం డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా ఏజెంట్లుగా పనిచేయడానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ నాగాదిత్యకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీసులో ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని తెలిపారు. 5 వేలు కంటే తక్కువ జనాభా ఉంటే 10వ తరగతి, 5 వేలు కంటే ఎక్కువ జనాభా ఉంటే ఇంటర్మీడియట్ ఉండాలన్నారు. వయస్సు 18 నుంచి 40 సంవత్సరాలు ఉన్న వారు అర్హులని చెప్పారు.ఆసక్తిగల అభ్యర్థులు ఇంటర్వ్యూకి హాజరు కావాలని తెలిపారు. భారతీయ తపాలాకు సుదీర్ఘ చరిత్ర ఉందన్నారు. తపాలాలో పొదుపు చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు పోస్టల్ సేవలను చేరువ చేసేందుకుగాను ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. అందులో భాగంగా జీవిత బీమా ఏజెంట్లను నియమిస్తున్నట్టు తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఆందోళనబాట తప్పదు'

హిరమండలం: అధికారుల తీరులో మార్పు రాకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని వంశధార నిర్వాసితులు హెచ్చరించారు. నిర్వాసిత గ్రామాల్లో రేషన్ పంపిణీ నిలిపివేసి పునరావాస కాలనీల్లోనే తీసుకోవాలనడంపై ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన సమా వేశంలో పలు అంశాలపై నిర్వాసితులు చర్చించారు. స మస్యల్ని పరిష్కరించకుండా గ్రామాల్ని ఖాళీచేయాలన డంపై మండిపడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా ఈనెల 2న రిజర్వాయర్ పనులను అడ్డుకున్నామని, మళ్లీ ఆ పరిస్థితి రానీయొద్దన్నారు. సంక్షేమ పథకాల్ని శనివా రంలోగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్య ల్ని పరిష్కరించకుండా పనులు చేపడితే సహించేది లేద ని స్పష్టం చేశారు. గతంలో కంటే ఈసారి ఆందోళనను ఉధృతంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నిర్వాసి తుల సంఘ నాయకులు మడపాన భాస్కరరావు, పెదకోట రామ ప్రసాద్,గవర గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవో గున్నయ్య మాట్లాడుతూ నిర్వాసితులు రేషన్ పునరావాస కాలనీల్లోనే తీసుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వాయర్ పనులకు నిర్వాసితులు సహకరించాలని, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

'జగన్‌వి ఫ్యాక్షన్ రాజకీయాలు'

శ్రీకాకుళం సిటీ:సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసి జగన్మోహనరెడ్డి తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకున్నారని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం తన నివాసగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ చంద్రబాబును కాల్చిచంపాలి అని వ్యాఖ్యానించడం ద్వారా ఆయన రాజకీయ పార్టీ అధ్యక్షుడా లేక రౌడీయా అన్న అనుమానం కలుగుతుందన్నారు. ఒక ముఖ్యమంత్రిని ఈ విధంగా మాట్లాడితే ఇక సామాన్యులను ఎలా చూస్తారో తెలియాలన్నారు.జగన్ ప్రజాస్వామ్యాన్ని పరిహసించి రౌడీ రాజకీయాలకు తెర తీస్తున్నారని విమర్శించారు.

నగరపాలక సంస్థ అధికారుల ఫోన్ నంబర్లు

పీఏ శోభ ఐఏఎస్	కమిషనర్	9849905787
నూకేశ్వరరావు	సహాయ కమిషనర్	9849908099
డి.భాస్కరరావు	ప్రజారోగ్య అధికారి	9849906972
జి.వేంకటేశ్వరరావు	ఇంజనీర్	9000902338
దేవకుమార్	సహాయ సిటీ ప్లానర్	9949996081
కిశోర్‌కుమార్	ప్రణాళిక అధికారి	8897626999
జగన్మోహనరావు	మెప్మా అధికారి	9701385743
అప్పలస్వామి	పట్టణ సర్వేయర్	9849906967
డి.గణేష్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	8919228847
ప్రకాష్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	9849908966

ఉచితంగా జింక్ పంపిణీ

సంతబొమ్మాళి: మండలంలో ఆసక్తి గల రైతులకు ఉచితంగా పది కేజీల జింక్ ప్యాకెట్‌ను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి పూజారి సత్యనారాయణ తెలిపారు. మండలంలో ఎంటీయూ 1001, 1079, 1075 వరి రకాలు సాగుచేస్తున్న రైతులకు జింక్ సల్ఫేట్ ఆఖరి దమ్ములో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎకరాకు 25 కేజీల చొప్పున జింక్ సల్ఫేట్ ఉపయోగిస్తే పంట దిగుబడి పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్ కార్డుతో వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదిస్తే పది కేజీల జింక్ ప్యాకెట్‌ను ఉచితంగా అందిస్తామని వ్యవసాయాధికారి తెలిపారు.

లక్ష్యాన్ని చేరుకోకుంటే ఉపేక్షించం

● డీఆర్‌డీఏ పీడీ కిశోర్‌కుమార్

టెక్కలిటౌన్: ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకంజలో ఉన్న వెలుగు సిబ్బందిపై డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.కిషోర్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, టెక్కలి, సారవకోట మండలాల వెలుగు ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి కిలోమీటరు దూరంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని, ప్రతి గ్రామంలో ఐదు ఎకరాలకు తగ్గకుండా పశుగ్రాసం పెంచాలని, ప్రతి మండలంలో వంద ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీటి అమలులో ఎవరు అలసత్వం వహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ పనులకు అవసరమైన నిధులు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్లు ఎస్.వైకుంఠరావు, ఎ.చిరంజీవి, బి.రవి, కళ్యాణి, ఏపీఎంలు ఉమారాణి, మనోరత్నం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిశోర్‌కుమార్

గ్రామ దేవతలకు చల్లదనం



గ్రామదేవతల చల్లదనానికి ముర్రాటలతో వెళుతున్న భక్తులు

టెక్కలి: కిల్లిపోలమ్మ, సర్వమంగళదేవి, భూలోకమాత అమ్మవార్లకు శుక్రవారం పంచాయతీ ప్రథమ పౌరురాలు కృష్ణవేణి బెహరా ఆధ్వర్యంలో చల్లదనం చేశారు. మంగళవాయిద్యాలతో గ్రామదేవతల వద్దకు ముర్రాటలతో వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భూలోకమాతవీధి, సర్వమంగళవీధి తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో కాళీ బెహరా తదితరులు పాల్గొన్నారు.

రైతుల సౌలభ్యం కోసమే 'రైతు సేవలో'

సౌడాం(కోటబొమ్మాళి): రైతుల సౌలభ్యం కోసమే రైతు సేవలో రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ డి.సోనీకిరణ్ అన్నారు. శుక్రవారం సౌడాం, చిట్టియ్యవలసల్లో రైతు సేవలో రెవెన్యూ శాఖ నిర్వహించి మాట్లాడారు. వన్‌బీ, అడంగల్‌ను పరిశీలించి లోపాలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సవరించి రికార్డులను పక్కాగా తయారు చేస్తామని తెలిపారు. దీనివల్ల భవిష్యత్‌లో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోనీకిరణ్

'బదిలీల ప్రక్రియ విజయవంతం'

పాతపట్నం: ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ విజయవంతంగా ముగియడంపై పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రేగేటి మధుసూదనరావు, అమర జనార్దనరావు హర్షం వ్యక్తం చేశారు. రాత్రయినా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తిచేసిన అధికారులందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు సేవలో భూ సమస్యల పరిష్కారం

● ఆర్డీవో వెంకటేశ్వరరావు

బొప్పాయిపురం(టెక్కలి): రైతులు తమ భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని సరిచేసుకునే అవకాశం రైతు సేవలో రెవెన్యూశాఖ ద్వారా కల్పించినట్లు మండల ప్రత్యేకాధికారి, టెక్కలి ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఆయన టెక్కలి మండలం బొప్పాయిపురంలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. రైతులకు అందజేసిన 1బీల్లో తప్పులు ఉంటే వాటిని గుర్తించి వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేస్తూ మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భూముల వివరాలు పక్కాగా ఉండేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వివరించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 13 అర్జీలు స్వీకరించగా, 70 వన్‌బీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఆర్ఐలు బి.వి.రమణ, ఆర్.రామారావు, వీఆర్వో మోహన్, సర్పంచ్ తెలగవలస రాములమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆవల ఉమ, దేవాదాయ శాఖ ఈవో జి.గురునాథరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వరరావు

'పార్టీ ప్రయోజనాల కోసం త్యాగాలు చేయాలి'

జర్జంగి(కోటబొమ్మాళి): వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడం కోసం కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఏ త్యాగానికైనా సిద్ధపడాలని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేడాడ తిలక్ అన్నారు. శుక్రవారం ఆయన జర్జంగిలో అన్నెపు రామారావు ఇంటి వద్ద నిర్వహించిన మండల స్థాయి వైసీపీ సమాశంలో మాట్లాడారు. జగన్ పార్టీ ప్లీనరీలో ప్రకటించిన నవరత్నాపై ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలని కోరారు. సభ్యత్వ నమోదు, శంఖారావం, జగన్ పాదయాత్రలో పార్టీ నాయకుల పాత్ర వంటి అంశాలను వివరించారు. పోలింగ్ బూత్ స్థాయిలో నాయకులను గుర్తించి వారి ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీపై విశ్వాసం కలుగజేసేలా అంతా కృషి చేయాలన్నారు. ప్రశాంత్‌కిశోర్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఒక బృందం ఎన్నికల ఘట్టం పూర్తయిన వరకు ఉండి ఎప్పటికప్పుడు తగిన సూచనలు, సలహాలు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఎస్.హేమసుందరరాజు, దుబ్బ వెంకట్రావు, పేడాడ వెంకట్రావు, రోణంకి మల్లేశ్వరరావు, అన్నెపు రామారావు, కాళ్ల సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

గొర్రెల మందలకు రక్షణ కరువు

హరిశ్చంద్రపురం(కోటబొమ్మాళి): గొర్రెల మందలకు రక్షణ లేకుండా పోతోంది. ఇటీవలే కోటబొమ్మాళితో పాటు చుట్టుపక్క మండలాల్లో దొంగల భయం రోజురోజుకి పెరిగిపోతోంది. ఈ ప్రభావం గొర్రెల మందలపై కనిపిస్తోంది. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల మందల వద్దకు వచ్చి గొర్రెల కాపర్లకు మత్తుమందు జల్లి గొర్రెలను లారీల్లో ఎక్కించుకుపోతున్నారనే వదంతులు తీవ్రంగా రావడంతో గొర్రెల కాపర్లు రాత్రి వేళల్లో నిద్ర మానుకొని కాపలా కాయాల్సి వస్తోంది. కొంతమంది కార్లలో వచ్చి మందల వద్ద ఆపి ఫోన్‌లో ఏవో మాట్లాడుతున్న సమయంలో ఎవరు మీరు, ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తుండడంతో వెంటనే కారు స్టార్ట్ చేసుకొని శరవేగంతో వెళ్లిపోతున్నారని, ఈ నేపథ్యంలో తాము మందల్ని కాపలా కాసుకోవడం కష్టసాధ్యమవుతోందని పలువురు గొర్రెల కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చెరువు గట్లపై రాత్రుళ్లు మందలను పడుకోబెట్టేవారమని, ఇప్పుడు భయంతో గ్రామ పొలిమేరల్లోనే ఉంచాల్సి వస్తోందని తెలిపారు. దీనిపై పోలీస్ సిబ్బంది దృష్టిసారించి నైట్‌బీట్ పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిజియోథెరపిస్ట్ మృతి

నందిగాం: ప్రత్యేకావసరాల పిల్లలకు ఫిజియోథెరఫీ చేసే ఫిజియోథెరపిస్ట్ జి.అఖిల శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. అత్తవారిల్లు కింతలిలో ఉంటున్న ఆమె అనారోగ్యంతో బాధపడుతుండడంతో చికిత్స కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రక్తకణాలు తగ్గిపోవడంతో మృతిచెందారు. ఆమె మృతికి ఎంఈవో జి.నర్సింహులు, ఎస్ఎస్ఏ సైట్ ఇంజినీర్ కె.గణేష్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పినకాన రాణి, రాధారాణి, సిబ్బంది ఎ.ప్రసాద్, ఎం.ఉమాపతి, మోహన్ తదితరులు సంతాపం తెలిపారు.

సమాచారమ్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటబొమ్మాళి: పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఎన్.చంద్రశేఖర్ తెలిపారు. కోటబొమ్మాళిలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న భారీ చెట్లను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నందిగాంలో న్యాయవిజ్ఞాన సదస్సు

నందిగాం: మండల కేంద్రం నందిగాంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాల, ఆదిత్య కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ అంశాలపై టెక్కలి మెజిస్ట్రేట్ పి.శ్రీనివాస్ నేతృత్వంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంతబొమ్మాళి మండల సమావేశం

సంతబొమ్మాళి: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎం.ప్రభావతి తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

రేపు మాజీ సైనికుల సమావేశం

టెక్కలి: ఈనెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు టెక్కలి డివిజన్ మాజీ సైనికులు, వితంతు మాజీ సైనికుల సమావేశం ఎన్టీఆర్ నగర్‌లోని సైనిక భవనంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు కూన మోహనరావు, కార్యదర్శి గోరింట కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంబేద్కర్ పార్కుకు సందర్శకుల తాకిడి

టెక్కలి: పాతబస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ పార్కు సందర్శకులతో కళకళలాడుతోంది. గతనెల 30న ఈ పార్కును మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. పార్కు సర్వాంగ సుందరంగా ఉండడంతో పాటు కూర్చునేందుకు అనువైన బెంచీల సౌకర్యం, పూలమొక్కలు, వాటర్‌ఫౌంటేన్‌లతో అందంగా ఉండడంతో పాటు లైటింగ్ సౌకర్యం కల్పించడంతో ఎక్కువ మంది వస్తున్నారు. పార్కుకు వచ్చి పలువురు సెల్ఫీలతో సందడి చేస్తున్నారు.



అంబేద్కర్ పార్కులో సందర్శకుల సందడి

9 నుంచి టీచర్లకు వృత్యంతర శిక్షణ

హిరమండలం: విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వేపై మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ నెల 9, 10, 11 తేదీల్లో టెలికాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈవో రాంబాబు చెప్పారు. మండలంలోని ఆరు స్కూల్ కాంప్లెక్స్‌ల కేంద్రాల్లో వృత్యంతర శిక్షణ ఉంటుందని తెలిపారు. 9న 50 శాతం ప్రాథమిక పాఠశాలల టీచర్లు, 10న మిగతా వారు హాజరుకావాలన్నారు.

టెక్కలిలో సినిమాలు

సుదర్శన్	: గౌతమ్‌నంద
భవాని	: ఫిదా

కోటబొమ్మాళిలో..

శివకృష్ణ	: నిన్నుకోరి
అనుపమ	: గౌతమ్‌నంద

167వ రోజుకు చేరిన దీక్షలు

వాల్తేరు(సంతకవిటి): మండలం వాల్తేరు, ఇసుకల పేట గ్రామాల మధ్య నాగావళి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలనే డిమాండ్ చేపడుతున్న దీక్షలు శుక్రవారం నాటికి 167వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నిర్వహించిన దీక్షలో వాల్తేరు గ్రామానికి చెందిన కూటికుప్పల సింహాచలం, ఎం.వెంకటరమణ, పైడి సూర్యనారాయణ, పప్పల సన్యాసప్పడు, జి.లక్ష్మం దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో వంతెన పోరాట సాధన కమిటీ కన్వీనర్ నారాయణ రావుస్వామి మాట్లాడుతూ శాంతియుతంగా ఉద్యమాన్ని చేపడుతూ.. సమస్య పరిష్కరించుకుంటామన్నారు.

తుదిదశలో వంతెన పనులు

● మరో నెలరోజుల్లో సిద్ధం ● అప్రోచ్ రోడ్లకు స్థలసేకరణే సమస్య





వంతెనపై శ్లాబ్ వేసిన దృశ్యం.. నిలిచిన అప్రోచ్ రహదారి నిర్మాణం

రంగారాయపురం (సంతకవిటి): బూర్జ మండలం లాబాం- సంతకవిటి మండలం రంగారాయపురం గ్రామాల మధ్య నాగావళి నదిపై చేపడుతున్న వంతెన పనులు తుదిదశకు చేరుకున్నాయి. దాదాపు రూ.48కోట్లతో చేపడుతున్న పనులు మరో నెలరోజుల్లో పూర్తి కానున్నాయి. 2013లో అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, అప్పటి రోడ్లు,భవనాల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం అవసరాన్ని గుర్తించి నిధులు మంజూరు చేయించారు. ఇంకా వంతెన శ్లాబ్‌పై నాలుగు ఇంచీల దట్టంతో మరో ఫ్లోర్ శ్లాబ్ , వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నాలుగు అడుగుల ఎత్తున నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే... లాబాం వైపు బీటీ రహదారికి అప్రోచ్ రోడ్డుకు భూసేకరణ పూర్తయినప్పటికీ... సంతకవిటి మండలం పరిధిలో రంగారాయపురం, వీజేపేట గ్రామాల మధ్య వంతెన నుంచి అప్రోచ్ రోడ్డుకు అవసరమైన స్థల సేకరణకు రెవెన్యూ అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే సంతకవిటి, బూర్జ మండలాలతో పాటు ఆమదాలవలస, సరుబుజ్జిలి, పాలకొండ, శ్రీకాకుళం, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల ప్రజలకు ఎంతగానో దోహదపడుతుంది. అంతేకాకుండా ముఖ్యపట్టణాలు శ్రీకాకుళం, పాలకొండ, రాజాంలకు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తే సమయంతో పాటు దూరం కూడా కలిసి వస్తుందనేది ప్రజల మాట.

ప్రాణాంతకమైన వ్యాధుల నివారణకు ఎంఆర్ టీకా దోహదం



సన్‌స్కూల్‌లో విద్యార్థులకు టీకాల దృశ్యం

రాజాం రూరల్: ప్రాణాంతకమైన తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు ఎంఆర్ టీకా ఎంతో దోహదపడుతుందని పొగిరి వైద్యాధికారి పి.విద్యాసాగర్, బొద్దాం వైద్యాధికారి బి.సునీత అన్నారు. నగరపంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు వారు ఎంఆర్ టీకాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ .. తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు విధిగా ఎంఆర్ టీకాలు తల్లిదండ్రులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది వీవీ సుందరేశ్వరరావు, ఆచారి, కె.ఈశ్వరరావు, రవిచంద్ర పాడే, సన్‌స్కూల్ ప్రిన్సిపాల్ భారతి తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం'

రేగిడి: భూ సమస్యల పరిష్కరించేందుకే ప్రభుత్వం రైతుసేవలో రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహిస్తోంది. వీటి ద్వారా రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దారు బి.సూరమ్మ, వ్యవసాయాధికారి ఎం.మధుసూదనరావు సూచించారు. ఈమేరకు శుక్రవారం ఉప్పరనాయుడువలస, వన్నలి, ఖండ్యాం, కొమిరి గ్రామాల్లో రైతుసేవలో రెవెన్యూశాఖ గ్రామసభలను అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా 92 దరఖాస్తులు వివిధ సమస్యలపై అందినట్లు తహసీల్దారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాదరావు, వీఆర్వో అనంతరావు, రైతులు పాల్గొన్నారు.

● సంతకవిటిలో..

గుళ్లసీతారాంపురం, తాలాడ గ్రామాల్లో శుక్రవారం రైతుసేవలో రెవెన్యూశాఖ గ్రామసభలు జరిగాయి. డిప్యూటీ తహసీల్దారు యూకే గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నియోజకవర్గం కార్యక్రమ ఇన్‌చార్జి గౌతమీకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. భూ సంబంధిత సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుసేవలో కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. వీటిని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఆర్.రవీంద్ర, ముగ్గు సరస్వతి, ఎంపీటీసీ సభ్యుడు ఇనమల మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

● రాజాంరూరల్‌లో....

భూ సమస్యల పరిష్కారానికి రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి గౌతమీకుమారి సూచించారు. శ్యాంపురం, కొరారిపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రై.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దారు కె. కృష్ణమూర్తి, ఆర్ఐలు శ్రీకాంత్, షరీఫ్, సర్పంచ్‌లు వెంకటరమణ, చిట్టెమ్మతో పాటు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● వంగరలో..

భూ సమస్యలు పరిష్కరించేందుకే రైతుసేవలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహసీల్దారు పి.అప్పారావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం కొండచాకరాపల్లి, బంగారువలసలలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ గోవిందరావు, ఆర్ఐ రామారావు, రెవెన్యూసిబ్బంది ఉన్నారు.







రేగిడి: మాట్లాడుతున్న తహసీల్దార్... సంతకవిటి: గ్రామసభలో గౌతమీకుమారి...వంగర: కొండచాకరాపల్లిలో రెవెన్యూసదస్సు

రేగిడి మండల సమావేశం నేడు

రేగిడి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు. ఎంపీపీ కిమిడి వేణిసుందరం అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశానికి మండల స్థాయి అధికారులు పూర్తిసమాచారంతో హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీసభ్యులు, సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు.

జీఎంఆర్ఐటీలో నాటిక పోటీలు నేడు

రాజాం అర్బన్: స్థానిక జీఎంఆర్ ఆడిటోరియంలో శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత అంశంపై ఎన్ఎస్ఎస్‌పీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ మన్మథరావు తెలిపారు. మహిళలకు, చిన్నారులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో భారత ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టు ద్వారా ఈ పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలకు మండలంలోని 20 పాఠశాలల నుంచి 30 బృందాలు పాల్గొంటాయని వివరించారు. ఉత్తమ ప్రదర్శనలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3వేలు, 2వేలు, వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే.. మూడు ప్రదర్శనలకు రూ.500 చొప్పున కన్సోలేషన్ బహుమతులకు అందజేయ నున్నట్లు వివరించారు.

సంగమేశ్వరాలయానికి ఎల్ఈడీ బల్బులు



ఆలయంలో వెలుగుతున్న ఎల్ఈడీ బల్బులు

సంగాం(వంగర): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సంగమేశ్వర స్వామి ఆలయానికి వంగర సర్పంచ్ రామారావునాయుడు ఎల్ఈడీ బల్బులు వితరణగా అందజేశారు. ఇటీవల ఆలయంలో అభివృద్ధి లేక అవస్థలు పడుతున్న అర్చకులు, భక్తులను దృష్టిలో ఉంచుకుని బల్బులు సమకూర్చారు. ఆలయానికి సాయంత్రం సమయంలో భక్తులు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బల్బులు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'సేవాకార్యక్రమాలతో అండగా నిలవండి'



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న కొల్ల అప్పలనాయుడు

గుళ్లసీతారాంపురం(సంతకవిటి): స్వచ్ఛందసంస్థలతో పాటు కంపెనీలు, ఎన్ఆర్ఐలు సేవాకార్యక్రమాలు చేపడుతూ.. సమాజానికి అండగా నిలవాలని సీనియర్ టీడీపీ నాయకుడు కొల్ల అప్పలనాయుడు సూచించారు. గుళ్లసీతారాంపురంలో టాటా రిలీఫ్ కమిటీ ఆధ్వర్యంలో సహజ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటైన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రూ. 4.50 లక్షల వ్యయంతో నిర్మించిన వాటర్‌ప్లాంట్ వల్ల గుళ్లసీతారాంపురంలో తాగునీటి సమస్యకు చెక్ పడినట్లయిందని అభిప్రాయపడ్డారు. దీనికి కృషి చేసిన సర్పంచ్ రావు రవీంద్రను ఆయన అభినందించారు. గ్రామంలో ఎక్కడ బోర్లు తీయించినా... ఉప్పునీరు, ఫ్లోరైడ్ నీరు వస్తుండంతో వినియోగించలేని పరిస్థితులు నేపథ్యంలో స్థానికంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటవడం శుభ పరిణామం అన్నారు. ఇంటింటా కొళాయిలు ఏర్పాటుకు అవకాశం కలుగుతుందన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇనమల మురళీకృష్ణ, గ్రామస్తులు, సహజసంస్థ ప్రతినిధులు ఉన్నారు.

విద్యార్థులకు రేపు పద్య,శ్లోక పఠన పోటీలు

కలెక్టరేట్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పాఠశాల విద్యార్థులకు పద్య, శ్లోక పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధులు వైవీ రమణారావు, ఎస్.మధుసుదనరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శ్లోకాలు, పద్యాలు, బాగవత, భగవద్గీత సంబంధమై ఉండాలన్నారు. నిర్ణయించిన సమయానికి విద్యార్థులు హాజరుకావాలన్నారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించనున్నట్టు చెప్పారు.ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పాలనలో.. వెనుకబాటు..!

సుదీర్ఘ చరిత్ర కలిగిన సిక్కోలు మున్సిపాల్టీని ప్రభుత్వం నగరపాలక సంస్థగా గుర్తించింది. దీంతో అభివృద్ధి ఊపందుకుంటుందని ప్రజలు ఎంతగానో ఆనందించారు. వసతులు మెరుగుపడతాయని ఆశించారు. కానీ సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలకు మోక్షం కలగడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తున్నా ఖర్చు చేయలేని స్థితిలో యంత్రాంగం ఉంది. పథకాల అమలులో కూడా తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనంతటికీ ప్రధాన కారణం పాలకవర్గం లేకపోవడం. ఎన్నికల ప్రక్రియ తీవ్ర జాప్యం జరుగుతుండగా...ప్రత్యేకాధికారుల పాలన ఆశించినస్థాయిలో ఉండకపోవడంపై ప్రజలు పెదవివిరుస్తున్నారు.

- పాలకవర్గముంటేనే ప్రభుత్వంపై ఒత్తిడి
- ఫలితమివ్వని ప్రత్యేకాధికారుల పాలన
- సమస్యలు.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే
- అతీగతీ లేని 14వ ఆర్థిక సంఘం నిధులు
- ఇదీ శ్రీకాకుళం నగర పాలక సంస్థ దుస్థితి

(శ్రీకాకుళం సిటీ)

నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారుల పాలనలో ఆశించినస్థాయిలో అభివృద్ధి జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధికి నిధులు కావాలన్నా...సమస్యలకు పరిష్కారం కావాలన్నా పాలకవర్గం ఎంతో అవసరం. వివిధ రకాల న్యాయపరమైన సమస్యలు వల్ల నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగలేదు. ప్రస్తుతానికి ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమమైంది. 36 వార్డులుగా ఉన్న నగరాన్ని 50 డివిజన్లుగా విభజించారు. ఓటర్ల తుది జాబితా ఖరారు చేసి ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి పంపారు. కానీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు.నిధులు రప్పించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పాలకవర్గం తప్పనిసరి. కానీ అలా కాకుండా ప్రత్యేకాధికారుల పరిపాలన కొనసాగుతోంది. ప్రజలకు ఏదైనా అవసరముంటే నేరుగా నగర పాలక సంస్థ కార్యాలయానికి రావాల్సిన పరిస్థితి తలెత్తింది.

● దళారుల రంగప్రవేశం

దాదాపు లక్షా 40 వేల జనాభా ఉన్న నగరంలో ప్రజలకు ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడం వల్ల ఎవరిని ప్రశ్నించాలో, ఎవరికి తమ గోడు చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. ఇటీవల నగరంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో మొదటి విడతగా 1280 గృహాలు మంజూరు కాగా.. మలి విడతల్లో వేలాది గృహాలు మంజూరు కానున్నాయి. ఈ గృహాలు మధ్య దళారీల బారిన పడకుండా ఉండాలంటే పాలకులు అవసరం. అలాగే చాలా మంది పేదలకు సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. పట్టణ పేదలకు అవసరమైన సౌకర్యాలు సమకూరడం లేదు. 50 డివిజన్లలో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉంది. ఇద్దరు ఐఏఎస్ అధికారులు (ప్రత్యేకాధికారి-కలెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్) అందుబాటులో ఉన్నా పాలకవర్గం లేని లోటు కనిపిస్తోంది.

నిధుల వినియోగంలో వెనుకబాటు...

శ్రీకాకుళం కార్పొరేషన్ 14వ ఆర్థిక సంఘం నిధులను సద్వినియోగం చేసుకోవడంలో వెనుకబడింది. గత ఆర్థిక సంవత్సరంలో (2016-17) రూ.8.9 కోట్లు మంజూరయ్యాయి. మొదటి విడతలో రూ.3.1 కోట్లు మంజూరు కాగా... నగరంలో తాగునీరు, సీసీ కాలువలు, రహదారులు,మౌలిక సదుపాయాలకు సంబంధించి మొత్తం 73 పనులను ప్రతిపాదించారు. కానీ ఈ పనుల్లో పురోగతి లేదు. ఇంజనీరింగ్ అధికారులు పనులు చేపట్టకుండానే చేతులెత్తేశారు. నిధులు మురిగిపోకుండా మరోసారి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు అనుమతి కోసం పంపినా ఇప్పటికీ ఆమోదం లభించలేదు. ఇక రెండో విడతలో రూ.4.47 కోట్లను గతేడాది మంజూరుచేశారు. ప్రస్తుతం నగరంలో 36 కిలోమీటర్ల మేర మంచినీటి పైప్‌లైన్ల విస్తరణ, పది వేల కుటుంబాలకు వ్యక్తిగత కుళాయిల కోసం కేంద్రం రూ.10. 76 కోట్లు కేటాయించింది. ఈ పనుల్లో నగరపాలక సంస్థ వాటాగా రెండో విడత 14వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. ప్రస్తుతం ఆ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కానీ తొలివిడత నిధులకు అతీగతీ లేదు.

● ఆ ముగ్గురు దృష్టిసారిస్తున్నా..

నగరపాలక సంస్థకు ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ధనుంజయరెడ్డి వ్యవహరిస్తుండగా...ఐఏఎస్ స్థాయి అధికారి పీఏ శోభ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపడుతున్నారు. ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కూడా పెద్దఎత్తున ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నా కిందిస్థాయిలో మాత్రం యంత్రాంగం చతికిల పడుతోంది. ఇదే పాలకవర్గం ఉంటే ఇటు ప్రజలకు...అటు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి నిధుల మంజూరు, ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, సమస్యల గుర్తింపు, పరిష్కార మార్గానికి అవకాశముండేది.


విస్తరణకు ఎదురుచూస్తున్న రహదారులు

ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం నగరంలోని పీఎన్‌కాలనీలో రెడ్‌క్రాస్, న్యూసెంట్రల్ స్కూల్ సంయుక్తంగా తట్టు, రుబెల్లా టీకాపై అవగాహనా కార్యక్రమం నిర్వహించాయి. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు, న్యూసెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు పాల్గొని ఎంఆర్ టీకాపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.తల్లిదండ్రులు విధిగా పిల్లలను ఎంఆర్ టీకాలు వేయించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, బి.సతీష్, పి.చైతన్యకుమార్, స్కూల్ సిబ్బంది, రెడ్‌క్రాస్‌సభ్యులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పౌరసేవలను ప్రైవేటుపరం చేయడం తగదు

సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల భారీ నిరసన ర్యాలీ

(శ్రీకాకుళం సిటీ)

ప్రజారోగ్యాన్ని, పౌరసేవలను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టి ప్రజాసంక్షేమాన్ని ప్రమాదంలోకి నెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకించాలని సీఐటీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి టి.తిరుపతిరావు కార్మికులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు నోటికి రిబ్బన్లు కట్టుకొని మౌన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన తిరుపతిరావు మాట్లాడుతూ పట్టణీకరణ, సుందరీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు ఇటు ప్రజలను అటు కార్మికులకు కష్టాల్లోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు వ్యర్థపదార్థాల మోతాదు పెరుగుతోందని... రోడ్లు, కాలువలు పెరుగుతున్నాయని... ఆ నిష్పత్తిలో కార్మికులు మాత్రం పెరగడం లేదన్నారు.రాజ్యాంగంలో ఆర్టికల్ 21 ప్రకారం పౌరసేవలో-ప్రజారోగ్యం ప్రభుత్వాల బాధ్యత అని... కానీ ఆ బాధ్యతల నుంచి ప్రస్తుత ప్రభుత్వాలు తప్పుకునేందుకు టెండర్ల ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్లను పెంచిపోషిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలను విమర్శించారు.పట్టణాల్లో పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్ తదితర పనులన్నీ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు రంగం సిద్ధమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, కిరోసిన్ చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరుస్తున్నారని విమర్శించారు. భవిష్యత్‌లో పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు ఎన్.బలరాం, కె.వేణు మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని.. జీవో 151 ప్రకారం జీతాలు పెంచి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించకుండా దళిత వీధులన్నింటినీ అభివృద్ధి చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐలను కార్మికుల ఖాతాల్లో వెంటనే వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎ.గణేష్, పార్థసారథి, కె.రాజు, గోవిందరావు, చిట్టిబాబు, నర్సమ్మ, ఈశ్వరి, పార్వతి, మంగమ్మ, ధనలక్ష్మీ, గన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



మౌన ర్యాలీ నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు

నీలమ్మతల్లికి నీరాజనం

శ్రీకాకుళం సిటీ: నగరంలోని గాజుల వీధిలో వెలసిన శ్రీ నీలమ్మతల్లి దేవాలయంలో మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. అలాగే శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వేకువజాము నుంచే బారులుదీరారు. ప్రత్యేక కుంకుమాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు అందించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, అర్చకులు ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కలుపు మందు వినియోగంతో ప్రయోజనం

టెక్కలి: ఉబాలు చేస్తున్న రైతులు కలుపు మందు సకాలంలో వేస్తే ప్రయోజనం పొందగలుగుతారని మండల వ్యవసాయాధికారి పూజారి సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. ఉడిచిన మూడు రోజుల్లో ప్రిటిల్లాకోన్ 400 ఎంఎల్, ఆక్సిడైమార్డిల్ 35 గ్రాములు ఇసుకలో కలిపి పొలంలో జల్లాలని సూచించారు. పొలంలో కలుపు పుట్టిన తరువాత దాని నివారణకు ఉడిచిన 20 రోజుల వరకు బిస్‌పైరిబిక్ సోడియం(నామినీగోల్డ్ జునూన్) 60ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేయాలని, అప్పుడే రైతులకు ప్రయోజనం ఉంటుందన్నారు. వెడల్పాటి గడ్డి నివారణకు కూడా పలురకాల మందులు ఉన్నాయని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

మీ ఇంటికి మీ రేషన్ పంపిణీ



రేషన్ సరుకులు అందిస్తున్న ఆర్డీవో వెంకటేశ్వరరావు

అక్కవరం(టెక్కలి): మంచం పట్టిన సింగిల్ యూనిట్ లబ్ధిదారులకు మీ ఇంటికి మీ రేషన్ పేరుతో సరుకులను అందజేస్తున్నట్లు ఆర్డీవో ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం ఆయన అక్కవరంలో అంగూరు లక్ష్మికి సరుకులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం బెడ్‌రిడెన్ కేసులకు ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు ఆవల ఉమ, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, సీఎస్‌డీటీ సతీష్, ఆర్ఐలు బి.వి.రమణ, రామారావు, పొట్నూరు రామ్మూర్తినాయుడు, ఆవల శ్రీరాములు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'రైతు సేవలో'కు వినతుల వెల్లువ

కణితివూరు(నందిగాం): మండలంలో శుక్రవారం నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖకు వినతులు వెల్లువగా వచ్చాయి. తహసీల్దార్ ఎస్.వి.నాగేశ్వరరావు, ఉప తహసీల్దార్ వి.లక్ష్మీనారాయణ, ఆర్ఐ పి.కామేశ్వరరావు ఆధ్వర్యంలో కణితివూరు, కోటిపల్లి, కల్లాడ, మర్లపాడు, నౌగాం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రెవెన్యూ శాఖ తరపున 1బీ, అడంగల్ పత్రాలను రైతులకు అందించారు. వీటిని పరిశీలించిన రైతులు వాటిలోని తప్పులను సరిచేయాలని దరఖాస్తులు అందించారు. ప్రభుత్వం తప్పులను సవరించుకోవడానికే ఈ కార్యక్రమం చేపట్టిందని, సమస్యలను పరిష్కరించి రైతులకు సంబంధించిన భూముల వివరాలను పొందుపరుస్తామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ జోగారావు, ఆర్ఐ జగన్‌మోహనరావు, వీఆర్‌వోలు ఎం.జోగారావు, చిన్నారావు, ఎం.మురళీరావు, కె.సురేష్, రామ్‌జీ, పి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్న బీమాతో భరోసా



మంగమ్మకు బీమా పరిహారం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: చంద్రన్న బీమాతో ప్రతి కుటుంబానికి భరోసా లభిస్తుందని ఎంపీటీసీ సభ్యుడు మామిడి రాము అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మెట్టవీధికి చెందిన జమ్మ మంగమ్మ కుటుంబ సభ్యులకు చంద్రన్న బీమా తక్షణ సహాయంగా రూ.5 వేల నగదు అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో దూరదృష్టితో ప్రవేశపెట్టిన ఈ పథకం పేదలకు ఆసరాగా నిలుస్తోందన్నారు. రూ.15 చెల్లించి చంద్రన్న బీమాలో సభ్యత్వం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మామిడి నారాయణ, బీమామిత్ర, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

'జగన్ మాటలను వక్రీకరించడం తగదు'

టెక్కలిటౌన్: ఓ ప్రతిపక్ష నాయకుడిగా వైసీపీ అధినేత జగన్ అధికార పార్టీపై విమర్శలు చేస్తే దాన్ని అధికార పార్టీ నేతలు వక్రీకరిస్తూ మీడియాలో వాడని పదజాలాలతో దుమ్మెత్తి పోస్తున్నారని, ఇది తగదని ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేడాడ తిలక్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుపై ఆరు కేసులు ఉన్నాయని చెప్పారు. తనకు నేరచరిత్ర లేదని చెబుతూ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తున్న మంత్రి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కై టీడీపీ జగన్‌పై 11 కేసులు వేయించిందని, ఒక కేసు కూడా నిరూపించగలరా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం సీసీ రోడ్లు, నీరు-చెట్టు పేరుతో డబ్బులు దోచుకుంటోందన్నారు.

స్వచ్ఛ టెక్కలి సాధ్యమేనా?

టెక్కలి: "అధికారంలోకి వచ్చాక టెక్కలి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నా. ఈ అభివృద్ధికి పరిశుభ్రత తోడైతే స్వచ్ఛ టెక్కలిగా తయారుచేయవచ్చు. అందుకే ఇళ్లు, దుకాణాల ముందు చెత్త ఉంటే రూ.2 వేల అపరాధ రుసుం విధించాల్సిందే" అంటూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గతనెల 30న టెక్కలిలో జరిగిన బహిరంగ సభలో ప్రకటించడంతో పంచాయతీ యంత్రాంగం స్వచ్ఛ టెక్కలి దిశగా అడుగులు వేయడం ప్రారంభించింది. బుధవారం పంచాయతీ కార్యదర్శి వాణీ బెహరా వార్డు సభ్యులు, వర్తక, వాణిజ్య సంఘం ప్రతినిధులతో పాటు పలు శాఖల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అయితే స్వచ్ఛ టెక్కలి అప్పుడే సాధ్యమా? అన్న సందేహం తలెత్తుతోంది. ఇందుకు కారణం అనేక సమస్యలు ఉన్నట్లు పలువురు సమావేశంలో పేర్కోవడమే నిదర్శనం. పారిశుధ్య కార్మికుల కొరత, చెత్తను తరలించే అవసరమైన వాహనాలు లేకపోవడం టెక్కలి పంచాయతీని పీడిస్తున్న ప్రధాన సమస్య. దీనికి తోడు దుకాణ సముదాయాలు, ఇళ్ల యజమానులకు అవగాహన కల్పిస్తే తప్ప స్వచ్ఛ టెక్కలి సాధ్యం కాదని పలువురు అభిప్రాయపడ్డారు. మంత్రి ఆదేశాల మేరకు ఎలాగైనా పట్టణాన్ని స్వచ్ఛ టెక్కలిగా తీర్చిదిద్దేందుకు కృషి ఆరంభించాలని పాలక వర్గం తీర్మానించింది. ప్రతి ఇంటా, దుకాణం వద్ద చెత్త బుట్ట ఉంచుకుని పారిశుధ్య కార్మికులు వచ్చినప్పుడు వారికి చెత్తను ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి విజ్ఞప్తి చేశారు. ఇందుకు వర్తక, వాణిజ్య సంఘం తరపున సహకరిస్తామని సంఘ అధ్యక్షుడు లాడి శ్రీనివాసరావు చెప్పారు. అయితే టెక్కలి మేజర్ పంచాయతీలో 20 వార్డుల్లో 106 వరకు వీధులు ఉన్నాయి. పందుల స్వైరవిహారాన్ని అరికట్టి రోడ్లపైన వేసిన చెత్త సేకరించడం పంచాయతీ యంత్రాంగానికి సాధ్యపడుతుందా అన్నది



టెక్కలి గొల్లవీధిలో రోడ్డుపై పేరుకుపోయిన మురుగు, చెత్త(ఫైల్ ఫొటో)

ప్రశ్నార్థకంగా మారింది. ఉన్న సిబ్బంది ఓవైపు చెత్తసేకరిస్తున్నా మరోవైపు చెత్త కుప్పలుతెప్పలుగా రోడ్డుపై పడుతోంది. మెట్టవీధి, గొల్లవీధి, చిన్నబజారు, కంద్రవీధి తదితర ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ నిర్వహణ కష్టమయ్యే అవకాశాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో ముందు పరిశుభ్రత ప్రక్రియ జరిగితే తప్ప స్వచ్ఛటెక్కలి సాధ్యంకాని పరిస్థితి. మొత్తంమీద స్వచ్ఛ టెక్కలిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ యంత్రాంగంపై పడింది. అయితే ఏ తరహాలో అమలవుతుందో వేచిచూడాలి.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ పూజ



టెక్కలి: దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి



నందిగాం: ప్రత్యేకంగా అలంకరించిన వరలక్ష్మీదేవి క్రతువు

టెక్కలి: శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని చేశారు. ఇళ్లల్లో పలువురు భక్తులు శక్తికొలదీ లక్ష్మీదేవినిని కొలిచారు. తొమ్మిది రకరకాల పిండివంటలు చేసి అమ్మవారికి నైవేద్యం పెట్టారు. మరికొందరు ఆలయాలకు వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండాపొలం కాలనీలోని దుర్గామల్లేశ్వర ఆలయం, మెట్టవీధిలోని జగద్ధాత్రి ఆలయం, జడ్పీ రోడ్డులో ఉన్న సంతోషిమాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తన నివాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని వైభవోపేతంగా జరిపారు.

కోటబొమ్మాళిలో...

కోటబొమ్మాళి: మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా జరిగాయి. ప్రతి ఇంటా మహిళలకు తమ శక్తి కొలదీ అమ్మవారిని పూజించారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన వారు ఈ వ్రతాన్ని ఆచరించారు.

వేడుకగా వరలక్ష్మీ పూజ

నందిగాం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మండలంలో వరలక్ష్మీ వ్రతాన్ని వేడుకగా నిర్వహించారు. ప్రతి ఇంటా ప్రత్యేక అలంకరణతో లక్ష్మీదేవిని పూజించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక సంతోషిమాత ఆలయం, నందిగాం, పెంటూరు, సుభద్రాపురం వెంకటేశ్వర ఆలయాలు, సుబ్బమ్మపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది.

భావనపాడు మత్స్యకార సంఘ అధ్యక్షుడిగా 'శిర్ల'

భావనపాడు(సంతబొమ్మాళి): భావనపాడు సాగర మత్స్య పారిశ్రామిక సంఘ అధ్యక్షునిగా శిర్ల ప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం భావనపాడులో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా బచ్చల గంగాధర్, కార్యదర్శిగా దున్న చలపతిని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా సూరాడ పోలయ్య, చింత కృష్ణమూర్తి, బి.సుందరరావు, తెప్పల కోటేసు, బి.రామస్వామి, గొరకల నారాయణరావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు ఎఫ్‌డీవో బి.సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోటబొమ్మాళి ఎస్ఐ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో నౌపడ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్వో గాలి శేషగిరి, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ సైని గురువులు పాల్గొన్నారు.



ప్రకాష్‌కు పత్రాలు అందిస్తున్న దృశ్యం

'మంత్రి పర్యటన జయప్రదం చేయండి'

నందిగాం: మండల కేంద్రం నందిగాంలో శనివారం నిర్వహించనున్న రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్, వంశధార ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ మళ్ల బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక హైస్కూల్‌లో నిర్మించిన నూతన భవనాలను ప్రారంభించడంతో పాటు నందిగాం, పెంటూరుల్లో మంత్రి పర్యటిస్తారని తెలిపారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

బోరుభద్ర(సంతబొమ్మాళి): రైతు సేవలో రెవెన్యూశాఖ ద్వారా భూ సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ బి.రామారావు అన్నారు. శుక్రవారం మండలంలోని బోరుభద్ర, గొదలాం రెవెన్యూ గ్రూపుల్లో రైతు సేవలో రెవెన్యూ శాఖను నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తహసీల్దార్ చెప్పారు. రైతులు గ్రామాలకు వస్తున్న రెవెన్యూ అధికారుల దృష్టికి తమ సమస్యలు తీసుకురావాలని సూచించారు. 1బీ, పాసుపుస్తకాలు, అడంగల్‌తో పాటు ఇతర భూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్‌వోలు రామారావు, వెంకటరమణ పాల్గొన్నారు.



రైతులకు పత్రాలిస్తున్న తహసీల్దార్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంతకవిటి: మండలంలో శనివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఇన్‌చార్జి ఏఈ కుమార్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. మండలంలో విద్యుత్ లైన్ల మీద చెట్లు కూలడం, కొమ్మలు విరగడం, ఇతర ఇబ్బందుల నేపథ్యంలో జంగిల్ క్లియెరెన్స్ కోసం శ్రీకాకుళం డీఈ ఆపరేషన్ కె.చలపతిరావు ఆదేశాల మేరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇంటిపన్ను వసూళ్ల లక్ష్యం రూ.74 లక్షలు

రామారావు, ఆర్ఐ



రాజాం నగరపంచాయతీ పరిధిలో ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యం రూ.74 లక్షలు అని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు చెప్పారు. ఇప్పటికి రూ. 15 లక్షలు వసూళ్లు అయిందన్నారు. మిగిలిన మొత్తం వసూళ్లకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈమేరకు ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి అయ్యారు. ఆ వివరాలివే..

ప్రశ్న: ఇంటి పన్ను వసూళ్లకు బిల్లు కలెక్టర్లు పూర్తిస్థాయిలో ఉన్నారా?

జవాబు: ముగ్గురు బిల్లు కలెక్టర్లకు గానూ.. పూర్తిస్థాయిలో ఇద్దరు బిల్లు కలెకర్లు ఉన్నారు. నైట్ వాచ్‌మేన్ చిరంజీవి సైతం పన్ను డిమాండ్ నోటీసులు ఇవ్వడం, బిల్లులు వసూళ్లు చేయడంలో సహకరించడంతో వసూళ్ల లక్ష్యానికి చేరవుతున్నాం.

ప్రశ్న: ప్రభుత్వ శాఖల నుంచి పెండింగ్ బిల్లులు ఎంత మేరలో ఉన్నాయి?

జవాబు: సుమారు రూ. 4 లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. పోలీసుశాఖ నుంచి రూ.2 లక్షల వరకు బకాయి ఉండగా, ఆర్అండ్‌బీ ఇతర శాఖల నుంచి మరో రూ.2 లక్షల వరకు బకాయిలు ఉన్నాయి. వీరికి డిమాండ్ నోటీసులు పంపించడం జరుగుతుంది.

ప్రశ్న: అన్ని పన్నులకు ఒకే డిమాండ్ నోటీసు ఇచ్చే పద్ధతి అమలవుతుందా?

జ: ప్రభుత్వం ఏప్రిల్ నుంచి ఇంటిగ్రేటెడ్ డిమాండ్ బిల్లుల పేరిట ఒక వ్యక్తికి అన్నిరకాల బిల్లులకు సంబంధించిన ఒకే డిమాండ్ నోటీసు ఇవ్వడం జరుగుతుంది. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి దాన్ని అమలు చేస్తాం.

-రాజాం అర్బన్

గ్యాస్ సమాచారం

లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఉన్న వినియోగదారులు ఈనెల 4 వరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి శనివారం గ్యాస్ సరఫరా చేస్తామని నిర్వాహకుడు సాయి ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఏవైనా గ్యాస్ సమస్యలుంటే 08941- 251016, 251160, 94905 96519 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సినిమాలు

రాజాం

అప్సర (ఎ.సి)- ఫిదా
సీతారామా (ఎ.సి)- గౌతమ్‌నంద
సీతారామా (మినీ)- వాసుకి

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు




రేగిడి: బూరాడ సంతోషిమాతఆలయంలో...ఉంగరాడమెట్ట గాయత్రీ ఆలయంలో మహిళల పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రాజాం అర్బన్: శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పర్వదినం పురస్కరించుకుని రాజాం నగరపంచాయతీ పరిధిలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే మహిళలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రాజాం పట్టణంలో ప్రసిద్ధ నవదుర్గా ఆలయం, జ్ఞానసరస్వతి, శివాలయాలు, శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయాల ఎదుట మహిళా భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలుచేపట్టారు.

సంతకవిటి:శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాలు ఆచరించిన తర్వాత ఆలయాలకు చేరుకుని మహిళలు పూజలు నిర్వహించారు. వాల్తేరు, మామిడపల్లి, సంతోషి మాత ఆలయాలు, జావాంలో పగాడలమ్మ, సురవరంలో బాల అన్నమ్మ పేరంటాలు, సిరిపురంలో కొండ కామేశ్వరాలయాల వద్ద భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. కాకరాపల్లి, గరికిపాడు, గుళ్లసీతారాంపురం, తాలాడ, మందరాడ, హొంజరాం, ఎంఆర్ అగ్రహారం, ఎస్.రంగారాయపురం తదితర గ్రామాల్లోని శివాలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేకంగా దీపారాధన, అభిషేకాలు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

రేగిడి:మండలంలో రెండో శ్రావణశుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉంగరాడమెట్టలో వెలసిన గాయత్రీమాత, బూరాడలో వెలసిన సంతోషిమాత ఆలయంలో మహిళలచే సామూహిక అష్టోత్తర శతనామావళి, కుంకుమపూజలు ఆలయ పురోహితులు మురపాక ఉమామహేశ్వరశర్మ, తిరుమలశర్మ, జాడ సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా పూజలు నిర్వహించారు.

వంగర: మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సంగాంలోని గంగ విగ్రహానికి మహిళలు పెద్దఎత్తున హాజరై పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గణపతిశర్మ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.




రాజాం అర్బన్:దీపారాధన చేస్తున్న మహిళ.. వంగర: సంగమేశ్వరఆలయంలో...

రేపటి నుంచి ఆదివాసీ దినోత్సవం

రాజాం అర్బన్: తిమ్మయ్యపేట ఎస్టీ కాలనీలో ఆదివారం నుంచి ఆదివాసీ దినోత్సవాలను ప్రభావతి జాగృతి ట్రస్టు ఆధ్వ ర్యంలో నిర్వహించనున్నట్లు శ్రీరామ యువజన సంఘం అధ్యక్షుడు బొండపల్లి గణేష్ తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కాలనీలో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 6న రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యువకులకు వాలీబాల్, షార్ట్‌పుట్, స్లో సైక్లింగ్ ... మధ్యాహ్నం 3 గంటలకు తిమ్మయ్యపేట ఎస్టీ కాలనీలో యువతులకు రింగ్ టెన్నిస్, కుర్చీలాట, స్కిప్పింగ్ తదితర ఆటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 8న ఉదయం 10 గంటల నుంచి గిరిజన కుటుంబ సభ్యులకు జీఎంఆర్ కేర్ ఆస్పత్రి సౌజన్యంతో అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. అదే రోజు మధ్యాహ్నం ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన పెద్దలకు సన్మానం, క్రీడల్లో విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు.

జోరుగా రాఖీల విక్రయం



రాజాం పట్టణంలో వెలిసిన రాఖీల దుకాణం

రాజాం అర్బన్: రాఖీ పర్వదినం సందర్భంగా పట్టణంలో రాఖీల విక్రయాలు జోరందుకున్నాయి. అన్నదమ్ములకు అక్కచెల్లెళ్లు రాఖీలు కట్టడం ఆనవాయితీ. దీంతో పట్టణాలు, పల్లెలని తేడాలేకుండా.. రాఖీ విక్రయాలు జరుగుతున్నాయి. 7న జరుపుకోనున్న రాఖీ పండుగ కోసం ఇప్పటినుంచే రాఖీలు కొనుగోలు చేస్తున్నారు.

'జగన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం'

పాలకొండ టౌన్: వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నంద్యాల ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసే స్థాయి జగన్‌కు లేదన్నారు. నవ్యాంధ్ర నిర్మాణం కోసం పాటుపడుతున్న ఆయనపై ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్న జగన్ తప్పుగా మాట్లాడటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సీఎంపై జగన్ వ్యాఖ్యలు చే యడాన్ని ఖండించారు. ఆయనతో పాటు వారాడ సుమంత్‌నాయుడు ఉన్నారు.

'ప్రైవేట్ బస్సులకు అనుమతులు ఇవ్వండి'

రాజాం రూరల్: ఆర్టీసీ సర్వీసులు కొన్ని రూట్లలో నిలిపివేయడం వల్ల అన్నివర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అదే రూట్లలో ప్రైవేట్ బస్సులు తిప్పేందుకు అనుమతులు ఇవ్వాలని రాజాం ఫోరం ఫర్ బెటర్ ప్రతినిధులు పొట్టా సత్యనారాయణ గుప్తా, మజ్జి మదన్‌మోహన్, ఎంవీ గంగారావు, టీటీవీ రమణమూర్తి, వారాడ వంశీకృష్ణ ప్రకటనలో కోరారు. ఆర్టీసీ బస్సులు రద్దుచేసిన రూట్లలో పునరుద్ధరించాలని ఎన్ని పర్యాయాలు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రైవేటు బస్సులు నడుపుకొనేందుకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు, పాలకొండ ఆర్డీవోకు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిశీలించి అనుమతులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

జంగిల్ క్లియరెన్స్ చేయండి

రాజాం అర్బన్: రహదారులకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏపుగా పెరిగిన ముళ్లచెట్లు, పిచ్చిమొక్కల వల్ల ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొనే పరిస్థితులు ఎదురవుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈమేరకు చీపురపల్లి రోడ్డులో గాయత్రీకాలనీ నుంచి కొత్తపెట్రోల్ బంకు వరకు ముళ్ల చెట్లు ప్రభావం వాహనదారులపై అధికంగా ఉందని వారంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

ఆంధ్రజ్యోతి
పాతపట్నం
12
శనివారం 5 ఆగస్టు 2017
పాతపట్నం ● హిరమండలం ● కొత్తూరు ● మెళియాపుట్టి ● ఎల్.ఎన్.పేట

హౌసింగ్ సర్వేకు మూడు బృందాలు

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన ప్రజా సాధికార సర్వేలో 1394 మందికి ఇళ్లు లేనట్లు గుర్తించినట్లు హౌసింగ్ ఏఈ డి.సత్యనారాయణ తెలిపారు. వీటిని సర్వే చేసేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తహసీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయాధికారి నేతృత్వంలో బృందాలు గ్రామాల్లో పర్యటించి ప్రజాసాధికార సర్వేలో ఇళ్లులేనట్లు గుర్తించినందున వాటిని మరోక్కసారి సర్వే చేస్తారని పేర్కొన్నారు.

భక్తి ప్రపత్తులతో వరలక్ష్మీ వ్రతం

హిరమండలం: శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలో వరలక్ష్మీ పూజను భక్తిశ్రద్ధలతో చేశారు. తెల్లవారుజామునే మహిళలు ఆలయాలకు చేరుకుని అమ్మవారిని కొలిచారు. మరికొందరు ఇళ్లల్లోనే లక్ష్మీదేవికి పూజలు చేశారు. స్థానిక బ్యారేజి సెంటర్‌లో ఉన్న సంతోషిమాత ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు.

కొత్తూరులో...

కొత్తూరు: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరు, పారాపురం, మెట్టూరు, నివగాంలోనూ పూజలు జరిపారు.

ఘనంగా కుంకుమ పూజలు

మెళియాపుట్టి: స్థానిక భాగ్యనగర్‌లో శ్రావణ శుక్రవారం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వరలక్ష్మికి కుంకుమ పూజ చేశారు. సుమారు 60 మంది మహిళలతో రాజరాజేశ్వరి పీఠాధిపతి వనమాలి వెంకటశర్మ ప్రత్యేక పూజలు జరిపించారు. వేకువజామునే మహిళలు పెద్దఎత్తున వచ్చి లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. ఎప్పుడూ ఇటువంటి కార్యక్రమం నిర్వహించకపోవడంతో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రతినిధి సిహెచ్.ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో భక్తులకు కుంకుమ పూజకు అవకాశం కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలను టీటీడీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరలక్ష్మి వ్రతం చేస్తే ధన, ధాన్యాలతో కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాడుగుల్ల రమణయ్య, రాజమోహన్, రాంబాబు, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరు: సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

'సదస్సుల్లోనే సమస్యలు పరిష్కరించాలి'


ధనుకువాడలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

ధనుకువాడ(ఎల్.ఎన్.పేట): రైతుల భూములకు సంబంధించిన సమస్యలను రైతు సేవలో రెవెన్యూ శాఖ నిర్వహిస్తున్న సదస్సుల్లోనే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.అప్పారావు అన్నారు. శుక్రవారం ఆయన ధనుకువాడ, జగన్నాథపురంలో గ్రామసభలు నిర్వహించి మాట్లాడారు. భూములకు సంబంధించి ఎటువంటి సమస్యలున్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిచేయించుకోవాలని సూచించారు. వారంలో రెండు రోజులు గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ నారాయణమూర్తి, ఆర్ఐలు కె.గోవిందరావు, బాబ్జి, సర్వేయర్ గవరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కొత్తూరు: కొత్తూరు రెవెన్యూ పరిధిలోని 254, 255 సర్వే నెంబర్లలోని గ్రంథాలయ స్థలం, గెడ్డ పోరంబోకు స్థలాన్ని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి భవనాలు నిర్మిస్తున్నారని అదే గ్రామానికి చెందిన రెడ్డి ప్రసాదరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజావసరాల కోసం గ్రామానికి చెందిన భూస్వామి గ్రంథాలయ సంస్థకు ఉదారంగా ఇచ్చిన స్థలాన్ని ఆక్రమించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

శత్రుచర్ల జన్మదిన వేడుకల్లో టీడీపీ నేతలు


శత్రుచర్ల జన్మదిన వేడుకల్లో పాతపట్నం టీడీపీ నేతలు

పాతపట్నం: మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు జన్మదిన వేడుకల్లో మండల టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయాన్నే వారు ప్రత్యేక వాహనాల్లో చినమేరంగి వెళ్లారు. వారిని శత్రుచర్ల సాదరంగా ఆహ్వానించి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు కొంచాడ వీరభద్రరావు, మామిడి గోవిందరావు, ఎంపీపీ కొల్లా శారద, జడ్‌పీటీసీ సభ్యురాలు సీమ మీనాక్షీదేవి, బండి రవివర్మ, పైల బాబ్జీ, శాసనపురి మధుబాబు, దువ్వారి ఉదయ్‌భాస్కర్, శ్రీరాంప్రసాద్, ఏనుగుతల సూర్యం, తదితరులు పాల్గొన్నారు.

'చంద్రన్న బీమాతో సామాన్యుడికి భరోసా'


బీమా పరిహారం అందజేస్తున్న దృశ్యం

పాత పట్నం: చంద్రన్న బీమా పథకం సామాన్యుడికి భరోసా కల్పిస్తోందని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల లక్ష్మయ్య అన్నారు. మండల పరిధి తామరలో ఇటీవల మృతిచెందిన వై.బాణెమ్మ కుటుంబానికి చంద్రన్న బీమాలో భాగంగా తొలివిడతగా రూ.5 వేలు వైస్ ఎంపీపీ మామిడి మహాలక్ష్మి చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివాల చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఎంఆర్ వ్యాక్సిన్ శతశాతం పూర్తి చేయాలి'

పాతపట్నపం: ఎంఆర్ వ్యాక్సిన్ శతశాతం పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ జె.చలమయ్య అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ వేసే ప్రక్రియను ప్రారంభించి మాట్లాడారు. ఖరీదైన ఈ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నట్లు చెప్పారు. పిల్లల్ని తట్టు, రుబెల్లా వ్యాధుల నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బైదలాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి దినేష్, ఎంపీహెచ్‌ఈవో కె.ధర్మారావు, ఎస్.ప్రభావతి, టి.లక్ష్మణరావు పాల్గొనగా హెచ్.ఎం. పి.రామరాజు పర్యవేక్షించారు.


వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

'ఆందోళనబాట తప్పదు'

హిరమండలం: అధికారుల తీరులో మార్పు రాకపోతే ఆందోళన బాట పట్టక తప్పదని వంశధార నిర్వాసితులు హెచ్చరించారు. నిర్వాసిత గ్రామాల్లో రేషన్ పంపిణీ నిలిపివేసి పునరావాస కాలనీల్లోనే తీసుకోవాలనడంపై ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై నిర్వాసితులు చర్చించారు. సమస్యల్ని పరిష్కరించకుండా గ్రామాల్ని ఖాళీచేయాలనడంపై మండిపడ్డారు. అధికారుల తీరుకు నిరసనగా ఈనెల 2న రిజర్వాయర్ పనులను అడ్డుకున్నామని, మళ్లీ ఆ పరిస్థితి రానీయొద్దన్నారు. సంక్షేమ పథకాల్ని శనివారంలోగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యల్ని పరిష్కరించకుండా పనులు చేపడితే సహించేది లేదని స్పష్టం చేశారు. గతంలో కంటే ఈసారి ఆందోళనను ఉధృతంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నిర్వాసితుల సంఘ నాయకులు మడపాన భాస్కరరావు, పెదకోట రామప్రసాద్, గవర గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో గున్నయ్య మాట్లాడుతూ నిర్వాసితులు రేషన్ పునరావాస కాలనీల్లోనే తీసుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వాయర్ పనులకు నిర్వాసితులు సహకరించాలని, సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

'రుణాలను తిరిగి చెల్లించాలి'

మెళియాపుట్టి: బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను వాయిదా పద్ధతిలో చెల్లించాలని చాపర ఎస్‌బీఐ మేనేజర్ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం ఆయన మెళియాపుట్టికి చెందిన సుగ్గు రవికాంత్‌రెడ్డికి బీసీ కార్పొరేషన్ ద్వారా ఆటో అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం యువకులకు మంచి అవకాశాలను కల్పిస్తోందని, వాటిని సద్వినియోగపర్చుకోకపోవడంతోనే బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని అన్నారు. యూనిట్లు ఉంటేనే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించే అవకాశముంటుందని తెలిపారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనపాన రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రుణాలు ఇచ్చి యువకులను ఆదుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలసముద్రం భారతి తదితరులు పాల్గొన్నారు.


బీసీ కార్పొరేషన్ ద్వారా ఆటోను అందజేస్తున్న దృశ్యం

'రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలి'

పాతపట్నం: ప్రతిపక్ష నేత జగన్ ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలను మానుకోవాలని టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబును నడిరోడ్డుపై కాల్చిచంపినా తప్పులేదని జగన్ నంద్యాలలో అనడంపై మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చేస్తున్న వ్యాఖ్యల్ని పరిశీలించి జగన్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషనర్‌ను కోరారు. ఆయన వెంట టీడీపీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి శివాల చిన్నయ్య, నల్లి లక్ష్మణరావు, డోల వెంకటరావు, కేలం చంద్రశేఖరరావు, సవిరిగాన శ్రీనివాసులు, రేగేటి రమణ, బోర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'15లోగా గుంతల ఏర్పాటు పూర్తి చేయాలి'

పాతపట్నం: ఈనెల 15వ తేదీలోగా గుంతల ఏర్పాటు పూర్తిచేయాలని వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చింతాడ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు ప్రాంతాల్లో హార్టీకల్చర్, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులను పరిశీలించిన అనంతరం వెలుగు కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 3500 ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకం లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతం 2500 ఎకరాల్లో తోటలు వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. తోటల పెంపకానికి పాతపట్నం మండలంలో 372 ఎకరాలు లక్ష్యం కాగా 297 ఎకరాలకు ఎంపిక పూర్తయిందని చెప్పారు. 19 ఎకరాల్లో గుంతల తవ్వకం పూర్తవగా మిగిలిన వాటిలో 15లోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌లో నాలుగు కిలోమీటర్ల పొడవుగా మొక్కలు పెంచడానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. రొంపివలస-కొరసవాడ, రొంపివలస-కొత్తూరు, పెద్దసున్నాపురం నుంచి సోద వరకూ మొక్కలు పెంచనున్నట్లు చెప్పారు. ఆయన వెంట వెలుగు ఏపీఎం ఎస్.రవిరాజ్ ఉన్నారు.


మాట్లాడుతున్న రామ్మోహన్

పాతపట్నంలో సినిమాలు

ఉమామహల్: నక్షత్రం

హిరమండలంలో..

వరలక్ష్మి : నక్షత్రం

కొత్తూరులో..

గౌరీశంకర : ఫిదా

ఉమాశంకర: గౌతమ్‌నంద

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు

ఆమదాలవలస రూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మున్సిపాల్టీలో ఉమారామలింగేశ్వర ఆలయం,మండలంలో వంజంగి, దూసి, కొత్తవలస, కొర్లకోట గ్రామ దేవాలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు.

పొందూరు: శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని ఆలయాల్లో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.



శ్రావణ శుక్రవారం విశిష్టతను వివరిస్తున్న పండితులు

ఎరువుల లెక్క తేలేదెపుడో..?



● గోదాంలలో అధిక నిల్వలు.. ● విజిలెన్స్ అధికారుల ఆదేశాలు బేఖాతరు ● ఆందోళనలో వ్యాపారులు

ఆమదాలవలస/రూరల్: విజిలెన్స్ అధికారులు ఎరువుల గోదాంలపై దాడులు చేపట్టారు.. అధిక నిల్వలు గుర్తించి అమ్మకాలు నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు.. కాని వ్యవసాయాధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

మండలంలోని తాళ్ళవలస గ్రామ సమీపంలో ఉన్న అవంతి వేర్ హౌసింగ్ గోదాంలపై విజిలెన్స్ అధికారులు జూలై 14, 15 తేదీల్లో దాడులు చేశారు. అధిక నిల్వలను గుర్తించి రూ.3.3 కోట్లు విలువచేసే 3,900 టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేయాలని వ్యవసాయ శాఖాధికారులకు ఉత్తర్వులు అందించారు. గోదాంలో నిల్వ ఉన్న యూరియా-3304 టన్నులు, గ్రోమోర్(28-28-0)426.05 టన్నులు, గ్రోమోర్ (28-28-13)214 టన్నులు అమ్మకాలను నిలపుదల చేయాలని వ్యవసాయాధికారులకు ఆదేశాలు అందించారు. నిబంధనల ప్రకారం దాడులు నిర్వహించిన 21 రోజుల్లో విజిలెన్స్ అధికారులకు పూర్తిస్థాయిలో లెక్కలు అందించాలి. గడువు పూర్తవుతున్నా నేటికీ లెక్కలపై స్పష్టత లేదు. ఒక వైపు సీజన్ ప్రారంభమై ఎరువులు అమ్మకాలు సాగుతున్నాయి. గోదాంలలో సరుకుల నిల్వలు చూసి వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏపీ మార్క్ ఫెడ్‌కు సంబంధించిన ఎరువులు అధిక మొత్తంలో నిల్వ ఉన్నాయి.. మరో సారి పూర్తిస్థాయిలో పరిశీలన జరపాలని వ్యాపారులు విజిలెన్స్ అధికారులకు సూచించారు. అయినప్పటికీ వ్యవసాయాధికారులు మెతక వైఖరితో వెనుకడుగు వేస్తున్నారు. గోదాంలలో భారీ అదనపు నిల్వలు ఉండడంవల్ల ఒత్తిడితో వ్యవసాయాధికారులు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. మరో పక్క పదోన్నతిలో ఉన్న వ్యవసాయ ఉన్నతాధికారి వెళ్లే ముందు తనకు ఈ తలనొప్పులు ఎందుకుంటూ వెనుకంజ వేసున్నట్లు సమాచారం. రెండు లక్షల బస్తాలు లెక్కలు వేయడం అంత తేలికైన పనికాదని వ్యవసాయశాఖ ఏడీ తిరుమలరావు చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టి సారించి ఎరువుల లెక్కలు తేల్చినట్లయితే ఎవరి లెక్క ఎంతన్నది తేలనున్నది.

గోదాంలలో నిల్వ ఉన్న ఎరువులు



దాడులు చేపడుతున్న విజిలెన్స్ అధికారులు(ఫైల్)

అభివృద్ధిపై దృష్టి సారించండి

● పరివర్తన్ ట్రస్టు సభ్యుడు చింతాడ రవికుమార్



ఆమదాలవలస: ప్రభుత్వ విప్ కూన రవికుమార్ స్వలాభం వీడి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని పరివర్తన్ ట్రస్టు సభ్యుడు ప్రొఫెసర్ చింతాడ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. 2015లో ట్రిపుల్ ఐటీ కళాశాలను ఆమదాలవలస నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని విన్నపిస్తే... ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి 100 ఎకరాల భూమి అవసరముంటుందని ప్రశ్నించిన విప్ పూల తోటలు, కూరగాయల పెంపకానికి సరుబుజ్జిలిలో 90 ఎకరాల భూమి లీజుకు ఎలా దరఖాస్తు చేసుకున్నారని ప్రశ్నించారు. విప్ గారు ఇప్పటికైనా భూమి లీజు కోసం చేసుకున్న అర్జీని వెనక్కి తీసుకుని, యువతకు ఉపాధి కల్పించే పరిశ్రమలు ఆ స్థలంలో వచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడి పార్టీ పెద్దలతో మాట్లాడి సుగర్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తే 2019 ఎన్నికల్లో అందరం నీవెంట ఉండి తిరుగులేని మెజార్టీతో అసెంబ్లీ పంపిస్తామని, లేకుంటే ప్రజా కోర్టులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

దళితుల అభ్యున్నతికి మార్గదర్శకుడు అంబేద్కర్



విగ్రహానికి పూల మాలలు వేస్తున్న నాయకులు

కనిమెట్ట (పొందూరు): బలహీన వర్గాల అభ్యున్నతికి మార్గం చూపిన మా ర్గదర్శకుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎంపీపీ సువ్వారి దివ్య, దళిత సీనియర్ నాయకుడు బొడ్డేపల్లి నర్సింహులు అన్నారు. కనిమెట్ట గ్రామంలో సర్పంచ్ యతిరాజుల జగన్నాథం ఆర్థిక సహాయంతో నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఎంపీపీ ఆవిష్కరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కూన సత్యనారాయణ, దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు సాకేటి నాగరాజు, దళిత నాయకులు బి.మోహనరావు, కె.రామగోపాల్, ఎస్‌వీ రమణ మాదిగ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బి.లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ అన్నెప శ్రీనివాసరావు ఎంఈవో రేగిడి రామ్మోహనరావు సర్పంచ్ యతిరాజుల జగన్నాథం, విగ్రహ దాత యతిరాజుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కనుగులవలస(ఆమదాలవలస రూరల్): దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి రైతు సేవలో రెవెన్యూ శాఖ వేదికగా నిలిచిందని ఎంపీటీసీ సభ్యుడు నూక రాజు అన్నారు. కనుగులవలస గ్రామంలో ఆర్ఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న రైతు సమస్యల పరిస్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ప్రభాకర్ జేమ్స్ అన్నారు. మండలంలోగల షలంత్రి, సుభద్రాపురం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖ గ్రామసభల్లో తహసీల్దారు హాజరై మాట్లాడారు. డీటీ ఎంఎన్ ప్రసాద్, తహసీల్దారు వేర్వేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్వేయర్ పీవీ సూర్యనారాయణ, ఆర్‌ఐలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నాయకుల ధ్వజం

● ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించేవిధంగా ఆయన వ్యాఖ్యలు
● మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత

ఆమదాలవలస రూరల్: నంద్యాల ఎన్నికల ప్రచార సభలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రతిపక్ష నేత జగన్ చేసిన వాఖ్యలు ఆయన నేరచరిత్రను బట్టబయలు చేస్తున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక పార్టీకి అధినాయకుడిగా ఉంటూ ఉన్మాదిలా ముఖ్యమంత్రి చంద్రబాబును నడి రోడ్డుపై కాల్చిచంపినా పర్వాలేదని వాఖ్యానించడం ఫ్యాక్షన్ రాజకీయాలను ప్రోత్సహించినట్లు ఉందని ఆరోపిం చారు. చంద్రబాబుపై హత్య ప్రయత్నం చేసే విధంగా ఇష్టారాజ్యంగా ప్రసంగం చేసి జగన్ మోహ న్‌రెడ్డిపై సుమోటోగా 128 సబ్ క్లాజ్ బీ ద్వారా దేశద్రోహం నేరంగా పరిగణించాలని న్యాయ శాఖను కోరారు. టీడీపీ కార్యాలయ జిల్లా సమన్వయకర్త మొదలవలస రమేష్ మాట్లాడుతూ ఆర్థిక నేరాలపై అరెస్టయి బెయిల్‌పై తిరుగుతున్న జగన్‌కు వెంటనే బెయిల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కనీస వేతన సంఘ డైరెక్టర్ కోట గోవిందరావు మాట్లాడుతూ ప్రజాసామ్య దేశంలో బహిరంగంగా హింస ప్రేరేపిత వాఖ్యలు చేస్తున్న నాయకులు తిరగడం ప్రమాదకరమని అన్నారు. అలాగే ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుకు రక్షణ వ్యవస్థను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జన్మభూమి కమిటీ సభ్యులు తమ్మినేని విద్యాసాగర్, మార్కెట్ కమిటీ ఉపాధ్యాక్షులు అన్నెపు భాస్కరరావు, సర్పంచ్‌లు గొండు రమణమూర్తి, రాపిరెడ్డి సన్యాసి రావు, జోగి చంద్రశేఖర్‌లతో పాటు ఆ పార్టీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, పీవీ నర్సింహులు, తంగి గుర్రయ్య, బీవీ రమణమూర్తి, నేతింటి జ్యోతీశ్వరరావు, రెడ్డి రాంబాబు, గొర్లె సూర్యం, మెట్ట వసంత, కూన రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్



సరుబుజ్జిలిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సీఎంను విమర్శించే హక్కు జగన్‌కు లేదు..

సరుబుజ్జిలి: ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే హక్కు వైసీపీ నాయకుడు జగన్‌కు లేదని టీడీపీ మండల నాయకులు ఆమదాలవలస మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి భాస్కరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శివ్వాల సూర్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో శుక్రవారం విలేఖర్లతో మాట్లాడుతూ అవినీతి కేసుల్లో నిందితుడుగా ఉంటూ బెయిలుపై వచ్చిన వ్యక్తి చంద్రబాబును విమర్శించడం సమంజసం కాదన్నారు. తక్షణమే బెయిలు రద్దు చేసి జగన్‌ను అదుపులోకి తీసుకోవాలని కోరారు. మండల నాయకులు టీవీ రమణ, నూక కోటేశ్వరరావు, కూన గణపతి రావు, వై.రామారావు, కె.సురేష్, కందల వెంకట రమణ పాల్గొన్నారు.

ప్రీస్కూల్ విధానంతో దీర్ఘకాలిక ప్రయోజనం

● మున్సిపల్ చైర్‌పర్సన్ గీత

ఆమదాలవలస: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విధానం దీర్ఘకాలిక ప్రయోజనం కలిగిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. పట్టణం పరిధి 13 వవార్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసి ప్రీస్కూల్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది ప్రీ స్కూల్ విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బొడ్డేపల్లి రాము, వైస్ చైర్‌పర్సన్ కూన వెంకట రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, తమ్మినేని విద్యాసాగర్, కూన భోనాజీరావు, ప్రీ స్కూల్ జిల్లా సమన్వయ కర్త షబీనా, ఏఈ శ్రీనివాస్, టీపీవో కనకా రావు, మెప్మా సిబ్బంది శ్రీనివాస్, నాగమణి, మెట్ట అమ్మినాయుడు, అంగన్‌వాడీ కార్య కర్తలు హేమలత, బాలామణి, సుమలత పాల్గొన్నారు.



ప్రీస్కూల్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఘనంగా సంతోషిమాత విగ్రహ ప్రతిష్ఠ

కింతలి(పొందూరు): మండలంలోని కింతలిలో నూతనంగా నిర్మించిన జ్ఞాన సరస్వతి సహిత కనక మహా లక్ష్మి పూర్వక సంతోషిమాత ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం 9 గంటల 40 నిమిషాలకు విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ ట్రస్టీ పైడి నాగభూషణరావు విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కళా ఆసుపత్రి ఎండీ పైడి వెంకటరమణ, సర్పంచ్ దవళ గణపతి, ఎంపీటీసీ సభ్యులు సింగూరు రమణ, హనుమంతురావు తదితరులు ఉన్నారు.



విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఎంఆర్ వ్యాక్సిన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

రొట్టవలస (సరుబుజ్జిలి): ఎంఆర్ వ్యాక్సిన్ ద్వారా పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని యూనిసెఫ్ రిప్రజంటేటివ్ డా.అమిత్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ఎం.మురళి అన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు డా.ఎస్‌వీ రాజేష్ ఆధ్వర్యంలో మండలంలో గల రొట్టవలస కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేకేపేట, సూర్యనారాయణపురం గ్రామాల్లో పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు శుక్రవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో సింధువాడ సర్పంచ్ గోవింద వేంకట శివానంద మూర్తి, సీహెచ్‌వో ఎస్.పద్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

రణస్థలం : అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు సూచించారు. బాలాజీ ఫిల్లింగ్ స్టేషన్‌లో శుక్రవారం పనిచేస్తున్న సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం ఆయన నిర్వహించారు. ప్రమాదాలు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో కె.అన్నాజీరావు, బి.బాస్కరరావు, టి.జనార్దనరావు, ఎ.సత్యంనారాయణ, టి.మోహనరావు, ఎస్.మోహనరావు, ఎస్,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

60 మందికి కళ్లద్దాల పంపిణీ

అరిణాం అక్కివలస(ఎచ్చెర్ల): మండలంలోని అరిణాం అక్కివలసలో జయ సంజీవని ట్రస్ట్, శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో శుక్రవారం 60 మందికి ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. జయ సంజీవని ట్రస్ట్ సభ్యురాలు ధనాలకోటి జయలక్ష్మి ఆధ్వర్యంలో కళ్లద్దాల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో జంగిల్ క్లియరెన్స్

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలో జాతీయ రహదారికి ఇరువైపులా శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ చేశారు. సర్పంచ్ మెండ రాజారావు, పంచాయతీ కార్యదర్శి కె. తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముళ్లపొదలు, పిచ్చి మొక్కల తొలగింపుతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ రవాణాపై పోలీసుల నిఘా

పైడిభీమవరం (రణస్థలం) : అక్రమరవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శుక్రవారం జెఆర్‌పురం ఎస్ఐ సత్యంనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో పైడిభీమవరం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల్లో నిషేధిత వస్తువులు తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. గట్కా, గంజాయి, చిన్నపిల్లలు తరలింపు తదితర వాటిపై నిఘా పెంచామనీ.. అపరచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అందరికీ గ్యాస్ కనెక్షన్లు

కొవ్వాడ (రణస్థలం) : అర్హులందరికీ గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తామని సర్పంచ్ మైలపల్లి పోలీస్ అన్నారు. ఈమేరకు శుక్రవారం కొవ్వాడలో 20 మంది లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ నిరుపేదల ప్రభుత్వమని, మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుబడి ఉన్నారని గుర్తుచేశారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

కుప్పిలి(ఎచ్చెర్ల): ప్రైవేట్ ఆస్పత్రులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బీవీ రమణారెడ్డి సూచించారు. కుప్పిలిలో జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 96 మందికి మెరుగైన వైద్యసేవలు అవసరమని గుర్తించారు. డాక్టర్ అజిత్ పట్నాయక్, డాక్టర్ బి.రంగప్రకాష్, డాక్టర్ సీహెచ్.బాలాజీ, డాక్టర్ ఎల్‌వీ శ్వేత శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెమ్స్ ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ ఎ.పెదబాబు తదితరులు పాల్గొన్నారు. రోగులకు ఉచితంగా మం దులను పంపిణీ చేశారు.



మందులను పంపిణీచేస్తున్న ఎంపీపీ

కాండం పూత పద్ధతితో సస్యరక్షణ

కొండములగాం (రణస్థలం) : పత్తిలో ఆశించే రసం పురుగుల నివారణకు కాండం పూత పద్ధతితో సస్యరక్షణ చేస్తే.. పురుగు మందుల ఖర్చు తగ్గుతుందని న్యాణ్యమైన దిగుబడులు పొందవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు సూచించారు. ఈమేరకు శుక్రవారం కొండములగాంలో పత్తి పంటను సందర్శించి కాండం పూత పద్ధతిని రైతులకు అవగాహన కల్పించారు. ఈ పద్ధతిలో 30రోజుల పత్తి పంట మీద మోనోక్రోటోఫాస్ ఒక పాలు.. నీరు నాలుగు పాళ్లు కలిపిన ద్రావణాన్ని ఈజీ బ్రష్ సాయంతో లేత కాండంపై పూసినట్లయితే రసం పీల్చే పురుగులైన పినుటంక, తామర పురుగులు, పచ్చదోమ నుంచి రక్షణ పొందవచ్చున న్నారు. రైతులు ప్రతివారం, పది రోజులకొకసారి పురుగుమందులు పిచికారీ చేయడం వల్ల మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. అదేవిధంగా తెల్లదోమల నివారణకు పొలంలో పసుపు రంగు జిగురు ఎరలను వాడాలని సూచించారు. అనంతరం నెలివాడ రైతులు సాగు చేస్తున్న మొక్క జొన్న, డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగును పరిశీలించారు. కార్యక్రమంలో నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులతో పాటు రైతులు పాల్గొన్నారు.


పత్తి రైతులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు




ఎచ్చెర్ల: కొయ్యరాళ్ల జంక్షన్ వద్ద భక్తుల సందడి.. లావేరులో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం... రణస్థలం: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఎచ్చెర్ల: శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మండలంలోని పలు అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుశాలపురంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం, కొయ్యరాళ్ల జంక్షన్‌కు సమీపంలోని దుర్గగుడిలో భక్తులు క్యూకట్టారు. దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో పూజించారు.

లావేరు : మండలంలో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. ఈమేరకు మండలంలో ని దుర్గాదేవి ఆలయం గురుగుబిల్లి శివాలయం, బుడుమూరు, బెజ్జిపురం, మురపాక, అదపాక, వెంకటాపురం తదితర గ్రామాల్లో వరలక్ష్మీవ్రతాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు.

రణస్థలం : మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయం, సంతోషిమాత ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు క్షీరాభిషేకం చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక

‘రైతు సేవలో రెవెన్యూ శాఖ’

గెడ్డకంచరాం(జి.సిగడాం): రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం అన్నదాతల భూ సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక అని ఎంపీపీ డొంక సూరీడమ్మ అన్నారు. శుక్రవారం గెడ్డకంచరాం గ్రామంలో నిర్వహించిన రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రైతుల సమస్యలపైన వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి వాటిని పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనురాధ, తహసీల్దారు నర్సయ్య, డీటీ ప్రసాదరావు, ఆర్ఐ రామారావు పాల్గొన్నారు.

రేగపాలెం(లావేరు) : రేగపాలం, గురుగుబిల్లి గ్రామాల్లో శుక్రవారం రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ రత్నకుమార్ మాట్లాడుతూ రెండు గ్రామాల్లోనూ 65 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ-2 శ్రీదేవి, వీఆర్వోలు తవుడు, కిరణ్మయి, టీడీపీ నాయకులు బి.చిట్టిబాబు, కె.రమణ పాల్గొన్నారు.

పొన్నాడ(ఎచ్చెర్ల): డీ పట్టాభూమికి పాసు పుస్తకాలు ఇప్పించాలని రైతు సేవలో రెవెన్యూ కార్యక్రమంలో తహసీల్దార్ కిమిడి రామ్మోహనరావుకు షేక్ ఫర్జీనా వినతి పత్రాన్ని అందజేశారు. 47 ఏళ్ల కిందట చీపురుపల్లి తాలుకాలో పొన్నాడలో సర్వే నెంబర్ 140/2లో 5 ఎకరాలను తన తండ్రి ఎంపీ ఖలీల్ పేరిట డీ పట్టా ఇచ్చారని ఆమె వినతిలో పేర్కొ న్నారు. సుమారు 3 దశాబ్దాల పాటు సాగుచేశామని, ఆ తర్వాత కొంత మంది తమ భూమిని ఆక్రమించుకు న్నారన్నారు. గతంలో తమకు అంద జేసిన భూమికి పాసు పుస్తకాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వాస్తవాలను పరిశీలించి నోటీసులు జారీ చేస్తామని తహసీల్దార్ హామీ నిచ్చారు. రెవెన్యూ పరిశీలకులు కూన వైకుంఠరావు, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి సత్యనారాయణ, స్పందన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పి.కృష్ణారావు, వీఆర్వో గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. జరజాంలో డిటీ శ్రీహరిబాబు పర్యవేక్షణలో రైతు సేవలో రెవెన్యూ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కోటేశ్వరప్రసాద్, తంగి మల్లేశ్వరరావు, దుంగ దాలినాయుడు, ఉప సర్పంచ్ బట్న గోపాల్ పాల్గొన్నారు.


పొన్నాడలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్

‘హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం’

రణస్థలం : ఎన్నికల హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేత గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. నంద్యాల ఉప ఎన్నికలు ప్రజాక్షేత్రంలో యుద్ధంగా అభివర్ణించారు. మోసపూరిత ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజలు బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

‘టీడీపీని బలోపేతం చేయండి’


అప్పాపురంలో బూత్ కమిటీని ఎంపిక చేస్తున్న దృశ్యం

అప్పాపురం(లావేరు) : రాబోయే రోజుల్లో టీడీపీ బలోపేతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ కోరారు. శుక్రవారం అప్పాపురంలో బూత్ కమిటీని ఏర్పాటు చేశారు. టీడీపీ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. అప్పాపురం బూత్ కమిటీ కన్వీనర్‌గా ఆకుల అప్పలనాయుడుని, మరో 12 మంది బూత్ కమిటీసభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

లింగాలవలసకు తోటపల్లి నీరు


లింగాలవలసకు చేరిన తోటపల్లి నీరు

లింగాలవలస(లావేరు) : లింగాలవలస, పోతయ్యవలస, భరణికాం తదితర గ్రామాలకు శుక్రవారం తోటపల్లి నీరు చేరుకుంది. ఈ సందర్భంగా మండల విప్ లంక రాంబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి సాగునీరు అందించిన ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి కళాకే దక్కుతుందన్నారు.

అంబేద్కర్ వర్సిటీలో వర్క్‌షాప్ నేడు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.తులసీరావు శుక్రవారం తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా విశాఖ ఆధ్వర్యంలో ఎంబీఏ, ఎంకాం, లా విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌కు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. కంపెనీ సెక్రటరీస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శివరామకృష్ణ, చైర్మన్ జగదీశ్వరరావు పాల్గొంటారని చెప్పారు.

సాగునీరు అందించేందుకు సహకరించండి

నరసన్నపేట:శివారు భూములకు సాగునీరు అందించేందుకు నీటిసంఘాలు సహకరించాలని నరసన్న పేట వంశధార సబ్‌డివిజన్ డీఈఈ మురళీక్రిష్ణ కోరారు. సబ్‌డివిజన్ కార్యాలయంలో శుక్రవారం నీటి సంఘ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. సబ్‌డివిజన్ పరిధిలో 40వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు.గోపాలపెంట, పోతయ్యవలస, మడపాం, మాకివలస, కిళ్లాం, మబుగాం తదితర ప్రాంతాలకు నాలుగు రోజుల్లో సాగునీరు అందిస్తామన్నారు. కాంట్రాక్టు పద్ధతిపై 12 లస్కర్లను నియమించేందుకు అంగీకరించారు.

ఏపీఎస్ ఆర్టీసీ సర్వీసు వేళలు



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీసుల వివవరాలు సమగ్రంగా మీకోసం

శ్రీకాకుళం నుంచి విజయవాడ వైపు...

బస్సు నంబర్	సమయం	బస్సు	ఊరు
2971	ఉ.5.00	సూపర్‌లగ్జరీ	విజయవాడ
2955	ఉ.6.00	సూపర్‌లగ్జరీ	విజయవాడ
3090	ఉ.7.15	అల్ట్రాడీలక్స్	విజయవాడ
3079	ఉ.8.15	అల్ట్రాడీలక్స్	విజయవాడ
3048	ఉ.11.45	అల్ట్రాడీలక్స్	విజయవాడ
2974	సా.4.00	సూపర్‌లగ్జరీ	హైదరాబాద్
3088	రా.9.15	అల్ట్రాడీలక్స్	విజయవాడ
3074	రా.9.30	సూపర్‌లగ్జరీ	విజయవాడ
3055	రా.7.30	అల్ట్రాడీలక్స్	విజయవాడ
2924	రా.7.00	సూపర్‌లగ్జరీ	ఒంగోలు
2983	రా.8.00	సూపర్‌లగ్జరీ	విజయవాడ
3050	రా.8.30	సూపర్‌లగ్జరీ	విజయవాడ
2969	రా.9.00	సూపర్‌లగ్జరీ	విజయవాడ

రాజమండ్రి వైపు వెళ్లే సర్వీసులు

27068	ఉ.8.15	మెట్రో ఏసీ	రాజమండ్రి
2806	ఉ.8.45	ఆల్ట్రాడీలక్స్	రాజమండ్రి
3105	ఉ.9.45	ఆల్ట్రాడీలక్స్	రాజమండ్రి
3094	ఉ.10.40	ఆల్ట్రాడీలక్స్	రాజమండ్రి
27070	ఉ.11.45	మెట్రో ఏసీ	రాజమండ్రి
3092	మ.12.30	ఆల్ట్రాడీలక్స్	రాజమండ్రి
3107	రా.10.30	ఆల్ట్రాడీలక్స్	రాజమండ్రి
27074	సా.4.45	మెట్రో ఏసీ	రాజమండ్రి
3098	రా.10.30	ఆల్ట్రాడీలక్స్	రాజమండ్రి
2808	రా.10.00	ఆల్ట్రాడీలక్స్	రాజమండ్రి
3077	సా.6.39	ఆల్ట్రాడీలక్స్	భద్రాచలం
36542	సా.4.00	డీలక్స్	భద్రాచలం

కాకినాడ వైపు వెళ్లే సర్వీసులు

3083	ఉ.7.00	ఆల్ట్రాడీలక్స్	రావులపాలెం
3103	ఉ.9.00	ఆల్ట్రాడీలక్స్	అమలాపురం
3085	ఉ.10.15	ఆల్ట్రాడీలక్స్	రావులపాలెం
27082	ఉ.10.55	మెట్రోఏసీ	కాకినాడ
2862	రా.8.15	ఆల్ట్రాడీలక్స్	ఆర్‌సీపీఎం
3096	రా.9.45	ఆల్ట్రాడీలక్స్	అమలాపురం
3109	రా.10.30	ఆల్ట్రాడీలక్స్	అమలాపురం
2808	రా.11.00	ఆల్ట్రాడీలక్స్	ఆర్‌సీపీఎం

రాజధాని ప్రాంతాలకు వెళ్లే సర్వీసులు

3355	సా.4.00	అమరావతి ఏసీ	హైదరాబాద్
3363	సా.6.30	గరుడప్లస్ ఏసీ	హైదరాబాద్
2930	రా.7.30	ఇంద్ర ఏసీ	గుంటూరు

విచారణ కేంద్రం : 08942-223188
ప్రజా సంబంధాల అధికారి : 8341092999
డిప్యూటీ సీటీఎం : 9959225605

శాస్త్రోక్తంగా సామూహిక వ్రతాలు

• నగరంలో భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

పాతశ్రీకాకుళం: నగరంలో అమ్మవారి ఆలయాల్లో వరలక్ష్మీ పూజలు, వ్రతాలు ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసంలో వచ్చిన రెండో శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీదేవిని మహిళలు భక్తిశ్రద్ధలతో పూజించారు. ఉదయం నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో మహిళలు, పురుషులు ఆలయాల వద్ద బారులుదీరారు. పాతశ్రీకాకుళంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. మహాలక్ష్మీనగర్ కాలనీలోని కాత్యాయని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేమకోటి ప్రదీప్‌శర్మ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరిగాయి. నానుబాలువీధిలో ఉన్న విజయదుర్గా అమ్మవారిని గజలక్ష్మీదేవిగా అలంకరించారు. నాగావళి నది ఒడ్డున ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొండేటివీధిలోని లలితాదేవి ఆలయంలో, కిన్నెర జంక్షన్‌లో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో, రెడ్డిక వీధిలో ఉన్న దుర్గమ్మతల్లి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు జరిగాయి. పీఎన్‌కాలనీలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో సర్వసతి దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉమారుద్రకోటేశ్వరాలయంలో మహాలక్ష్మీ అమ్మవారిని, చిన్నబజారు వీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం, సత్యసాయి పెద్ద మందిరంలో, న్యూ కాలనీ సత్యసాయి మందిరంలో, రైతుబజారు వద్ద ఉన్న సత్యసాయి మందిరంలో సామూహిక వ్రతాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.



మహిళల సామూహిక వ్రతాలు



గజలక్ష్మి దేవిగా విజయదుర్గ అమ్మవారు



నగరంలోని ఓ ఆలయం ఎదుట బారులుదీరిన భక్తులు



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు

తండేంవలసలో రెవెన్యూ గ్రామసభ

తండేంవలస(శ్రీకాకుళం రూరల్) : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలనిని ఉప తహసీల్దారు పూజారి రాంబాబు అన్నారు. శుక్రవారం తండేంవలస,అలికాం పంచాయతీల్లో రైతుసేవలో రెవెన్యూ శాఖ గ్రామసభలను నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులు తయారు చేసే క్రమంలో భాగంగా ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రైతులు గ్రామసభల్లో పాల్గొని రెవెన్యూ రికార్డులను సరిచేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఎంఆర్ఐ లింగరాజు, ఎంపీటీసీ అంబటి వైకుంఠరావు, కొంక్యాన రమణమూర్తి, వీఆర్వో అప్పారావు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీటీ



మంత్రి అరుణ్‌జైట్లికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చేనేత వస్త్రాలకు జీఎస్టీ మినహాయించండి

చేనేత వస్త్రాలకు జీఎస్టీ నుంచి మినహాయించాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లాకు చెందిన చేనేత సంఘాల ప్రతినిధులతో కలిసి ఢిల్లీలో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీని కలిశారు. శ్రీకాకుళం జిల్లాలో వేలాది మంది కార్మికులు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని...జీఎస్టీతో అదనపు భారం పడుతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే కుదేలైన చేనేతరంగంపై జీఎస్టీ పెను ప్రభావం చూపుతోందన్నారు. అందుకే జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

-శ్రీకాకుళం సిటీ

వృద్ధుల ఇంటికి నేరుగా రేషన్ సరుకులు

జలుమూరు: వృద్ధులకు, అనారోగ్యానికి గురైన వారికి ప్రతినెల 5వ తేదీలోగా రేషన్ అందించాలని తహసీల్దారు కె.ప్రవల్లికప్రియ తెలిపారు. రావిపాడులో మీఇంటికి మీ రేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి డిపోలోను బెడ్‌రెస్టు లబ్ధిదారులను గుర్తించి సంబంధిత వీఆర్వోల వేలిముద్రల ద్వారా నేరుగా ఇంటికి సరుకులు పంపించాలని ఆమె ఆదేశించారు. అలాగే గొలియాపుట్టి డిపోలో డిప్యూటీ తహసీల్దారు నారాయణరావు శుక్రవారం మీఇంటికి మీరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు రావాడ త్యాగరాజు, వీఆర్వో రాము, ఎస్.రామారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

భూమిపై హక్కులు సాధించండి


అడంగల్ కాపీలను అందిస్తున్న రెవెన్యూ అధికారులు

మడపాం (నరసన్నపేట): భూములపై వాటి యజమానులు హక్కులు సాధించడానికి రైతు సేవలో రెవెన్యూశాఖ కార్యాక్రమా న్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీనివాస రావు అన్నారు. మడపాంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో రైతుల భూ వివరాలు సక్రమంగా లేవని ఇలాంటి సమస్యలన్నీ ఈకార్యక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు కోటేశ్వరరావు, సర్పంచ్ చింతు రాజన్న, ఎంపీటీసీ సభ్యుడు గొద్దు సుందరరావు, పంచాయతీ కార్యదర్శి సవర చిన్నారావు, వీఆర్వో విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారవకోట: రైతుల సేవల్లో రెవెన్యూ శాఖ కార్యక్రమం వినియోగించుకోవాలని తహసీల్దారు జామి ఈశ్వరమ్మ రైతులకు పిలుపునిచ్చారు. కుమ్మరిగుంట, చరణదాసుపురం గ్రామాల్లో రైతుల సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో డీటీ బి.రవి, ఆర్ఐ నారాయణరావు, సర్వేయర్ నారాయణ, పలువురు వీఆర్వోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

దీర్ఘాశి(పోలాకి): దీర్ఘాశి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న పొలానావర సమస్యలను వెంటనే పరిష్కరింపజేయాలని గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పల్లి సూరిబాబు రెవెన్యూ సిబ్బందిని కోరారు. దీర్ఘాశి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో రైతులకు ఇచ్చిన పట్టాదార్ పాస్‌పుస్తకాల్లో తప్పులు ఉన్నాయని వారందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తహసీల్దార్ జెన్ని రామారావు మాట్లాడుతూ పాస్ పుస్తకాల్లో తప్పు, ఒప్పులను, సర్వే జరిపించి సరిదిద్దుతామన్నారు. సదస్సులో ఎంపీటీసీ సభ్యుడు మెండ శ్రీనివాసరావు, పంచాయతీ సలహాదారు మెండ సన్యాసిరాజు, ఆర్ఐ ఢిల్లీశ్వరరావు, వీఆర్వో ప్రమీల, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రియాగ్రహారంలో:
ప్రియాగ్రహారంలో డీటీ సత్యనారాయణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఈనాం భూమి సాగురైతులు తమ సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లావేటి కృష్ణ, ఆర్ఐ త్రినాధరావు, వీఆర్వో వసంతరావు, వ్యవసాయశాఖ విస్తరణాధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'రాజకీయ విలువలు పాటించండి'

నరసన్నపేట: టీడీపీ నాయకులు రాజకీయ విలువలను మరిచి ప్రవర్తిస్తున్న తీరు సరికాదని వైసీపీ నాయకుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న టీడీపీ నాయకులపై ప్రజల తరపున పోరాటం చేస్తున్న తమ నాయకుడు జగన్మోహన్‌రావుపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ నాయకులకు నైతికత ఉంటే వైసీపీ నుంచి టీడీపీకి వెళ్లిన 21 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేసి టీడీపీలోకి తీసుకోవాలని సవాలు విసిరారు. మంత్రి అచ్చెన్నాయుడు జగన్‌పై సభ్యత, సంస్కారం లేకుండా మాట్లాడుతున్న వైనం తగదన్నారు. వైసీపీ జిల్లా మహిళ కన్వీనర్ చింతాడ మంజు, వైసీపీ నాయకులు యాళ్ల కృష్ణమూర్తినాయుడు, ఆరంగి మురళి, సురంగి నర్సింగరావు, దుళ్ల వెంకటరమణ, టెక్కలి నియోజకవర్గ నాయకులు చింతాడ గణపతి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు దంత పరీక్షలు


దంత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ భవనంలో శుక్ర వారం గాదం దంత వైద్యశాల నిపుణులు ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గాదం వైద్యశాల పీఆర్వో బాలరాజు, విశ్రాంత ఉద్యోగులు సదాశివుని ప్రభాకరరావు, పి.చంద్రభూషణరావు, సీహెచ్ కొండలరావు, పి.ధర్మారాజు, బి.రామారావు, టి.రామదాసు, డి.రఘు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగు నీరు అందేదెప్పుడో..?


పోతయ్యవలస వద్ద దమ్ములు కాని పొలాలు

● వంశధారలో తగ్గుముఖం పట్టిన నీరు ● ఆందోళనలో రైతులు

నరసన్నపేట: ఖరీఫ్ పనులు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా మండల శివారు భూములకు సాగునీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై దాటినా ఇంతవరకూ శివారు ప్రాంతాలైన గోపాలపెంట, పోతయ్యవలస, దేవాది, కామేశ్వరిపేట, లుకులాం తదితర ప్రాంతాలకు సాగునీరు ఇంతవరకూ చేరలేదు. దీంతో ఎప్పుడు దమ్ములు చేస్తామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈప్రాంతాలకు పోలాకి, లుకలాం, మబగాం ఓపెన్‌హెడ్ చానల్స్ ద్వారా సాగునీరు సరఫరా అవుతుంది. అయితే ప్రస్తుతం వంశధార నదిలో నీటిమట్టం తగ్గిపోవడం గొట్టాబ్యారేజీ వద్ద నదిలోకి అనుకున్నంతగా నీరు విడిచిపెట్టకపోవడంతో నదిలో నీటి మట్టం తగ్గిపోయింది. దీంతో ఓపెన్ హెడ్ చానల్స్‌లో నీరులేకుండా పోయింది. అందువల్ల సకాలంలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందడంలేదని వంశధార అధికారులు చెబుతున్నారు. ఓపెన్ హెడ్ చానల్స్ ద్వారా మండలంలో సుమారు 4వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇందులో మబగాం చానల్ ద్వారా 820 ఎకరాలు, పోలాకి చానల్ ద్వారా 1,500 ఎకరాలు, లుకలాం చానల్ ద్వారా మరో 1,500 ఎకరాలకు సాగు నీరు వెళ్తుంది. కానీ ఇంతవరకూ సాగునీరు చేరకపోవడంతో రైతు లు చేసేదేమీలేక నీరు కోసం ఎదురు చూస్తున్నారు. నారుమళ్ళు ముదిరి పోతు న్నాయని, ఎప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదురవు తుందని గోపాలపెంట గ్రామానికి చెందిన రైతు సాధు గరికయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా తా ము ఆగస్టులో శివారుల్లోనే దమ్ములు చేస్తుంటా మని ఆయన తెలిపారు.

డిజైన్‌లో తేడా వల్లే..



ఓపెన్‌హెడ్ కాలువల డిజైన్‌లో అనేక లోపాలు న్నాయి. అప్పట్లో తాము వ్యతిరేకించినా అధికా రులు, ప్రభుత్వం పట్టించుకోపోవడం వల్లే మండలా నికి సాగునీటి సమస్య ఏర్పడింది.

– రాడ మోహనరావు,
వంశధార ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్, నడగాం

వర్షం వస్తే ముంపు.. లేకపోతే ఎడారి



మా ప్రాంతం సెప్టెంబర్ వరకూ ఎడారిలా ఉంటుంది. వర్షం కురిస్తే ఎగువ ప్రాంతంనుంచి వరదనీరు రావడంవల్ల పంటపొలాలు ముంపునకు గురవుతాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు అందించాం.

– గదిలి మల్లేశ్వరరావు, సర్పంచ్, గోపాలపెంట

సబ్ కాలువ పనులు చేపట్టండి



ఓపెన్‌హెడ్ చానల్స్ అనుసంధాన కాలువల్లో పనులు చేపట్టకపోవడం వల్లే తమ ప్రాంతానికి సకాలంలో సాగునీరు రావడంలేదు. వచ్చిన నీరంతా ఓపెన్ హెడ్ చానల్స్ ద్వారా లోతు ప్రాంతాలకు వెళ్లిపోతుంది.

– శిమ్మ చంద్రశేఖర్,
నీటిసంఘం అధ్యక్షుడు, కిళ్లాం

వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు


నరసన్నపేట రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

నరసన్నపేట: వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉర్లాంలోని అష్టమహాలక్ష్మి ఆలయం, మాకివలసలోని సీతారామాలయం, కంబకాయ, పారిశెల్లి, రావులవలస, కామేశ్వరిపేటలోని ఉమామహేశ్వర ఆలయంతోపాటు నరసన్నపేటలోని అన్ని ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టారు. నరసన్నపేటలోని రామలింగేశ్వర ఆలయం, ఉర్లాం లోని అష్టమహాలక్ష్మి ఆలయంలో వందలమంది మహిళలు కుంకుమ పూజలు చేశారు. శ్రీవెంకటేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.



సారవకోట, పోలాకిల్లో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సారవకోట: మండలంలోని గొర్రెబందలో కొలువైన సంతోషిమాత ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు సారవకోట సోమేశ్వరరావు భక్తులచే పూజలు జరిపించారు. చీడిపూడి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రామానుజాచార్యులు ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు.

పోలాకి: మండలంలోని గ్రామాల్లో మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పోలాకి భవానీ దుర్గా ఆలయంలో అర్చకులు శ్రీనివాసశర్మ, దీర్ఘాశి దుర్గాగిరి భవానీ ఆలయంలో అర్చకులు జడా దాలయ్య, చిన్నారావు, రామాలయంలో తులసిపాటి రమణయ్య భక్తులచే ప్రత్యేక పూజలు జరిపించారు.

సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణపై వాగ్వాదం


వాగ్వాదం చేసుకుంటున్న సర్పంచ్ ప్రతినిధి, దేవాదాయశాఖ ఏసీ శ్యామలాదేవి

శ్రీముఖలింగం (జలుమూరు): శ్రీముఖలింగంలో నిర్వహించే అష్టతీర్థ రాజమహాయాగం ఉత్సవాల్లో రోజుకొక సాంస్కృతిక కార్యక్రమం చేపడితే బాగుండేదని వీటికి మీరు అడ్డు తగిలారని సర్పంచ్ ప్రతినిధి తర్ర బలరాం దేవాదాయశాఖ ఏసీ శ్యామలాదేవిని నిలదీశారు. పక్షిమోచన తీర్థంలో శుక్రవారం పూజలు చేసిన ఏసీ.. దేవాదాయశాఖ అతిథిగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా సర్పంచ్ ప్రతినిధి అక్కడికి వెళ్లి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణపై ప్రస్తావించారు. కలెక్టరు శ్రీముఖలింగం వచ్చి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ఏమైనా నిధులు కావాలా అని అడిగినపుడు అవసరంలేదని అడ్డుతగిలిన మీరు దేవాదాయశాఖనుంచి పైసాకూడా విడుదల చేయలేదని సర్పంచ్ ప్రతినిధి తర్ర బలరాం, ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షులు బైరి బలరాం ఏసీని నిలదీశారు. దీంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదంలో అర్చకులు సంఘం అధ్యక్షుడు పెద్దలింగన్న, ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ ఉన్నారు.

శివారు భూములకు సాగునీరు

● లస్కర్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్

నరసన్నపేట: శివారు భూములకు సాగునీరు అందించేందుకు నీటిసంఘాలు సహకరించాలని నరసన్నపేట వంశధార సబ్‌డివిజన్ డీఈఈ మోహనకృష్ణ సూచించారు. స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో శుక్రవారం నీటి సంఘ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. సబ్‌డివిజన్ పరిధిలో 40వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. శివారు ప్రాంతాలైన గోపాల పెంట, పోతయ్యవలస, మడపాం, మాకివలస, కిళ్లాం, మబగాం తదితర ప్రాంతాలకు నాలుగు రోజుల్లో సాగునీరు అందిస్తామన్నారు. కాంట్రాక్టు పద్ధతిపై 12 లస్కర్లను నియమించేందుకు అంగీకరించారు. వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ మిరియా పల్లి వెంకట అప్పలనాయుడు, టీసీలు మెండ మోహ నరావు, శిమ్మ చంద్రశేఖర్, శిమ్మ లక్ష్మణరావు, నానాజీ, పిరియా వెంకటరావు, గోవిందరావు, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

పంచాయతీ అధికారి ఇంటింటా సర్వే

పోలాకి: పోలాకి పంచాయతీ కేంద్రంలో మండల పంచాయతీ అధికారి గరిమెళ్ల రవికుమార్ వారి సిబ్బందిని వెంట పెట్టుకుని శుక్రవారం ఇంటింటా సర్వే చేయించారు. పంచాయతీ కార్యదర్శి అరుణ, చెత్తసంపద తయారీ కేంద్ర పర్యవేక్షకుడు శశి, సర్పంచ్ ప్రతినిధి లుకలాపు రాంబాబు, సర్వే బృందం వెంట ఉన్నారు. మండలంలోని 31 పంచాయతీల్లో ఇంటింటా సర్వే జరిపి జియోట్యాగింగ్ చేస్తున్నామని తెలిపారు.

గ్యాస్ సమాచారం

నరసన్నపేట: స్థానిక హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు ఈనెల 3న బుక్‌చేసిన వారికి, ఈనెల 2న బుక్ చేసిన ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు శనివారం గ్యాస్ పంపిణీ చేయనున్నారు.

నరసన్నపేటలో సినిమాలు

శ్రీదేవి	నక్షత్రం
రాజేశ్వరి	ఫిదా
శ్రీవెంకటేశ్వర	గౌతమ్‌నంద

ఇన్‌స్పైర్ అవార్డుకు శ్రావణి ఎంపిక



పాలకొండ రూరల్: స్థానిక తమ్మినాయుడు జూనియర్ కళాశాలలలో ఇంటర్మీడియట్ ఎంపీసీలో 983 మార్కులు సాధించిన పేరిశెట్టి శ్రావణి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డు పొంది నందుకు శ్రావణికి డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి పీజీ వరకు ఐదేళ్ల పాటు ప్రభుత్వం ఉపకార వేతననం అందజేయనుంది. శ్రావణి ఎంపికపై ప్రిన్సిపాల్ ఎ.తిరుపతి రావు, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

వీరఘట్టం: వీరఘట్టంలో 5న శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ హరికృష్ణ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భామినిలో..

భామిని: మండలంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ బీజేస్వామి తెలిపారు. కొత్తూరు నుంచి బత్తిలి వరకు 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ

భామిని: నిబంధనలను అతిక్రమించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొత్తూరు సీఐ జె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈమేరకు శుక్రవారం భామినిలో వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ద్విచక్రవాహనదారులు వాహనపత్రాలను విధిగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే హెల్మెట్ ధారణ తప్పనిసరి అన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. అలాగే... గురండి జంక్షన్‌లో బత్తిలి ఎస్ఐ ఎం.ముకుందరావు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు.

రైతుసేవలో రెవెన్యూశాఖకు 14 దరఖాస్తులు

నర్సిపురం (వీరఘట్టం): నర్సిపురం, డెప్పివలస గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమానికి 14 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ఎం.వి.రమణ తెలిపారు. అడంగల్‌సవరణ, వారసత్వ హక్కులు విషయాలపై వచ్చిన దరఖాస్తులను త్వరలో పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దార్ సుందరరావు, సీనియర్ అసిస్టెంట్ షన్ముఖరావు, ఆర్ఐలు రమేష్, సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

పాలకొండ టౌన్: రైతు సేవలో రెవెన్యూశాఖ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ రమేష్ సూచించారు. ఈమేరకు శుక్రవారం వాటపాగు, చింతాడ గ్రామాల్లో నిర్వహించిన రైతు సేవలో రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్లా జగన్నాధంనాయుడు, రామచంద్రినాయుడు, సీఎస్‌డీటీ లక్ష్మీనారాయణ, హెచ్‌వో జ్యోత్స్న, సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల గుర్తింపుపై సర్వే



సర్వే చేపడుతున్న గృహనిర్మాణశాఖ సిబ్బంది

వీరఘట్టం: ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు, వారి స్థితిగతులపై శుక్రవారం గృహ నిర్మాణశాఖ బృందం మండల కేంద్రంలో ప్రత్యేక సర్వే నిర్వహించింది. గతేడాది నిర్వహించిన ప్రజాసాధికార సర్వేలో 1250 మంది నుంచి ఇళ్లకోసం దరఖాస్తులు వచ్చాయని ఏఈ సుదర్శనరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రస్తుతం రీసర్వే జరుపుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్య క్షుడు జామి లక్ష్మీనారాయణతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా దోమల మందు పిచికారీ





దోమల మందు పిచికారీ చేస్తున్న శానిటేషన్ సిబ్బంది

పాలకొండ టౌన్: పాలకొండ నగరపంచాయతీ పరిధిలో శుక్రవారం ముమ్మరంగా దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమం చేపట్టారు. దోమలు..బాబోయ్.. శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'తో శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. కథనానికి స్పందించిన పాలకొండ నగర పంచాయతీ కమీషనర్ పి.బాలాజీప్రసాద్ స్పందించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. శానిటేషన్ మేస్త్రీ పర్యవేక్షణలో శిర్లిపోతన్నవీధి, శెగిడి వీధి, గారమ్మ కాలనీ, మేదరవీధి, రెల్లివీధి, లుంబూరువారి వీధి, కస్పా వీధితో పాటు మురుగుకాలువల్లో కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ.. నగర పంచాయతీ పరిధిలోని పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారాలను పారవేయరాదని సూచించారు. శానిటేషన్ సిబ్బందికి చెత్త అంద జేసి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

పాలకొండ టౌన్: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాలకు మహిళా భక్తులు పోటెత్తారు. వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. శుక్రవారం వేకువజాము నుంచి అమ్మవారి ఆలయాల్లో అష్టోత్తర అర్చనలు, సహస్రనామార్చనలు, సామూహిక కుంకుమ పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. కోటదుర్గమ్మ దేవాలయంలో దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహిళలకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పురటాల పోలమ్మ దేవాలయంలో అర్చకులు వేమకోటి రవిశర్మ మహిళలచే వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. గాయత్రీ దేవాలయంలో ప్రధానార్చకులు బంకుపల్లి చిట్టిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. సంతోషిమాత ఆలయంలో అమ్మవారి జయంతి ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకుడు బంకుపల్లి నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

వీరఘట్టం: పలు గ్రామాల్లో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్‌శర్మ యాజీ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సంతోషిమాత ఆలయంలో రద్దీ

బత్తిలి (భామిని): శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం పర్వదినం కావడంతో బత్తిలిలో సంతోషిమాత, లలితాంబ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వంశధార నదిలో మహిళలు శుద్ధి స్నానాలు చేసి సంతోషిమాతకు అభిషేకాలు, కుంకుమార్చనలు, ఉద్యాపనలు చేశారు. ఆలయ అర్చకులు సీతారామ భట్టో, రంప తాతబాబు భట్టో, అనీల్‌కమార్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఒడిశాకు చెందిన రాజేష్, స్వాతి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసావ వితరణ జరిగింది. మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రతాలు చేశారు. భామినిలో మణికేశవ అమ్మవారి ఆలయంలో అర్చకుడు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.



బత్తిలి సంతోషిమాత ఆలయంలో అన్నప్రసాద వితరణ

అడారులో చురుగ్గా పారిశుధ్య పనులు

అడారు (వీరఘట్టం): అడారులో శుక్రవారం పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానవీధితో పాటు ఎస్సీకాలనీ, వారణాశివీధి, శివాలయం పరిసరాలు, బోరుబావుల ఆవరణలో చెత్తకుప్పలు, కాలువల్లో పూడిక తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలమ్మ ఉన్నారు.

నల్ల రిబ్బన్లతో కార్మికుల నిరసన

పాలకొండ రూరల్: పాలకొండ నగరపంచాయతీ ప్రజలపై పన్నుభారం మోపే 159, 160, 279 జీవోలను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం నగర పంచాయతీ కార్మికులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు దావాల రమణారావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పడాల భాస్కరావు, చింతల కైసులు మాట్లాడుతూ... 279 జీవో అమలులోకి వస్తే పట్టణాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర పనులన్నీ ప్రైవేట్ సంస్థలకు అప్పగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 151 జీవో ప్రకారం మున్సిపాలిటీల్లో అన్ని విభాగాల్లోఉద్యోగులకు జీతాలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి మున్సిపల్ కార్మికుల సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలన్నారు. లేకుంటే.. ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీ.హెచ్.సంజీవి, సీ.హెచ్.రఘు, పి.శ్రీను. సురేష్, మధు, వి.గిరి. శ్రీదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో మున్సిపల్ కార్మికులు

ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి
దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరావు తెలిపారు. ఐటీఐలో చేరదలిచిన వారు రూ 10 చెల్లించి దరఖాస్తులు పొందవచ్చన్నారు. ఎలక్ట్రిషియన్, మోటార్‌వెహికల్ మెకానిక్, ఫిట్టర్, వెల్డర్ తదితర ట్రేడులలో చేరేందుకు మిగిలిన సీట్లకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 15లోగా ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

సినిమాలు

పాలకొండ

శ్రీరామ కళామందిర్: గౌతమ్ నంద

వెంకటగౌరి: ఫిదా

వీరఘట్టం

బీఎంఆర్ థియేటర్: గౌతమ్ నంద